సాహితీ
గత వారం రోజుల్లో విడుదలైన కొత్త పుస్తకాలు

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

6-10-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 247 పేజీలు: 10+4 వెల: 6.50



ఆహార సంక్షోభంలో ప్రపంచదేశాలు 5

బోగస్ ఫారం-7లపై చర్యలు తీసుకోండి: సిఇఒ 6




## రూ.5,460 కోట్ల విద్యుత్ బాదుడు

### నవంబరు నుంచి ట్రూఅప్ ఛార్జీల భారం

### వ్యవసాయ వినియోగదారులకు మినహాయింపు

**హైదరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారులపై పంపిణీ సంస్థలు మరో బాదుడుకు సిద్ధమవుతున్నాయి. ఇందులో భాగంగా ట్రూఅప్ చార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారుల నుండి ముక్కు పిండి మరీ వసూలు చేయనున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని వినియోగదారులపై రూ.5,460 కోట్ల >>7



## వైద్యశాస్త్రంలో ముగ్గురికి నోబెల్

### న్యూరోసైన్స్‌లో కొత్త ఆవిష్కరణలకు అత్యున్నత పురస్కారం

**ఓస్లో, అక్టోబరు 5:** ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ పురస్కారాల ప్రకటన ప్రారంభమైంది. 2026 సంవత్సరానికి గాను వైద్యశాస్త్రంలో (ఫిజియాలజీ /మెడిసిన్) ముగ్గురు శాస్త్రవేత్తలు సంయుక్తంగా ఈ అత్యున్నత పురస్కారానికి ఎంపికయ్యారు. అమెరికాకు చెందిన కార్ల్ డీస్సెరొత్ >>2



న్యూఢిల్లీలో ఉమ్మడి మీడియా సమావేశంలో స్విస్ అధ్యక్షుడు గై పార్మెలిన్, ప్రధాని మోడీ

### పదిహేనేళ్లలో 100 బిలియన్ డాలర్ల

# స్విస్ పెట్టుబడులు

### పది లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలు లక్ష్యం

### రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరించిన భారత్- స్విస్

### ప్రధాని మోడీ, స్విస్ అధ్యక్షుడు పార్మెలిన్ భేటీ

### వాణిజ్య, ఎఐ, రక్షణ ఉత్పత్తి, అణుశక్తి, టెక్నాలజీ అంశాలపై చర్చలు

### ఉక్రెయిన్ యుద్ధం, యుఎన్ సంస్కరణలపైన ఒకే మాట

**న్యూఢిల్లీ, అక్టోబరు 5:** ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, స్విస్ అధ్యక్షుడు గై పార్మెలిన్ సోమవారం న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో భారత్- స్విట్జర్లాండ్ సంబంధాల పూర్తిస్థాయిని సమీక్షిస్తూ విస్తృత చర్చలు జరిపారు. సుస్థిర మౌలిక సదుపాయాల అభివృద్ధి, యువ నిపుణుల మార్పిడి, ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, వ్యవస్థాపకత >>2

# సస్పెండ్ చేయలేం

### సిఇసి జ్ఞానేశ్ విధులకు ఆటంకం కలిగించలేమన్న సుప్రీం కోర్టు

### నిర్ణయాలు చట్టవిరుద్ధమని తేలితే రద్దు చేస్తాం

### కేంద్రం, ఇసికి నోటీసులు జారీ

### వారంలో వివరణ ఇవ్వాలని ఆదేశం



**న్యూఢిల్లీ, అక్టోబరు 5:** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అధికారాల వినియోగంపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు నేడు విచారణ చేపట్టింది. ఇతర కమిషనర్లతో సంప్రదించకుండా సీఈసీ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్లను స్వీకరించిన సర్వోన్నత న్యాయస్థానం, ఈ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వానికి, భారత ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. వారం రోజుల్లోగా తమ స్పందన తెలియజేయాలని ఆదేశించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ జరిపింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఫారం 6లో మార్పులు వంటి పలు కీలక నిర్ణయాలను సీఈసీ జ్ఞానేశ్ కుమార్ మిగతా ఇద్దరు కమిషనర్ల ఆమోదం లేకుండా ఏకపక్షంగా తీసుకున్నారని పిటిషనర్లు ఆరోపించారు. ఎన్నికల సంఘం వంటి బహుళ సభ్యుల కమిషన్‌లో నిర్ణయాలు ఏకగ్రీవంగా లేదా మెజారిటీ ప్రాతిపదికన జరగాలని, కానీ ఇక్కడ అలా జరగలేదని వారు కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, ఈసీ తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తామని స్పష్టం చేసింది. "రాజ్యాంగబద్ధమైన సంస్థలు చట్టానికి లోబడి పనిచేయాలి. ఒకవేళ తీసుకున్న నిర్ణయాలు చట్టవిరుద్ధమని తేలితే, వాటిని రద్దు చేస్తాం అని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. అయితే, సీఈసీగా జ్ఞానేశ్ కుమార్ విధులకు ఆటంకం కలిగించేలా లేదా ఆయనను సస్పెండ్ చేసేలాఎలాంటి మధ్యంతర ఉత్తర్వులుజారీ చేయడానికి కోర్టు నిరాకరించింది. రాజ్యాం గంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఎన్నికల సంఘానికి ఉన్నఅధికారాలను సీఈసీ ఒక్కరే కాకుండా, ముగ్గురు సభ్యుల కమిషన్ సంయుక్తంగా వినియోగించేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్లు తమ పిటిషన్‌లో కోరారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు నోటీసులతో ఈ వ్యవహారంపై కేంద్రం, ఈసీ ఎలాంటి వివరణ ఇస్తాయనేది ఆసక్తికరంగా మారింది.

**ఫారమ్-6లో మార్పులకు మా ఆమోదంలేదు..!**

కొత్తఓటర్ల నమోదు కోసం ఎన్నికల సంఘం (ఈసీ) వినియోగించే ఫారం 6లోఎలాంటి సవరణలకు తాము ఆమోదం >>2



### 90 లక్షల మంది

# ఓటుపై వేటు

### ఢిల్లీ సమావేశంలో పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, అక్టోబరు 5,ప్రభాతవార్త:** తెలంగాణలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో 90 లక్షల మంది ఓటుహక్కును తొలగించారని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆవేదన చెందారు. ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కెసి >>2

## భీంగల్ పిఎస్ ఆరవరణలో టీ స్టాల్ యజమాని ఆత్మహత్య

### పెట్రోల్‌తో నిప్పంటించుకొన్న సుధాకర్

### పోలీసుల తప్పు లేదన్న కమిషనర్ చైతన్య

**హైదరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త:** నిజామాబాద్ జిల్లా భీంగల్ పోలీసు స్టేషన్ ఆవరణలో సోమవారం ఉదయం టీ స్టాల్ యజమాని వు న్నట్లుండి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జిల్లా వ్యాప్తంగా సంచలనం రేపింది. భీంగల్‌కు చెందిన పి. సుధాకర్ (35) పాత బస్టాండులో టీ స్టాల్ నిర్వహిస్తున్నాడు. ఇదే ప్రాంతంలో ఒక సిగరెట్ దుకాణం కూడా వుంది. రెండు రోజుల క్రితం ఒక వ్యక్తి వచ్చి టీ స్టాల్ నుంచి సిగరెట్ కొనగా జర్నలిస్టులుగా చెప్పుకున్న ఇద్దరు వ్యక్తులు వచ్చి సిగరెట్లు అమ్మే దుకాణంలో వీటిని, టీ స్టాల్‌లో కొనరాదని హెచ్చరించారు. దీని తరువాత మరుసటి రోజున అర్ధరాత్రి సమయంలో టీ స్టాల్‌తో పాటు దుకాణాలు నడుపుతున్న వారిపై పోలీసులు ఈ పెట్టి కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు. తన టీ స్టాల్‌పై ఈ పెట్టి కేసు నమోదు చేయడంపై మనస్తాపం చెందిన సుధాకర్ ఉదయం 9.45 గంటల సమయంలో నేరుగా భీంగల్ పోలీసు స్టేషన్‌కు >>2



ఏక్తానగర్‌లో సోమవారం జరిగిన చింతన్ శిబిర్‌లో కేంద్ర మంత్రి గడ్కరీతో భేటీ అయిన మంత్రి కోమటిరెడ్డి

# '5 రోప్‌వే'లకు అనుమతించండి

### కేంద్రమంత్రి గడ్కరీని కోరిన మంత్రి కోమటిరెడ్డి

### గుజరాత్ చింతన్ శిబిర్‌లో ప్రత్యేక భేటీ

### ఎన్‌హెచ్ 65 6+2 లేన్ల విస్తరణ, ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర-దక్షిణ భాగాలు, హైదరాబాద్-అమరావతి ఎక్స్‌ప్రెస్‌వేపై చర్చ

### తెలంగాణ కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులకు కేంద్రం సహకరించాలని వినతి

**హైదరాబాద్,అక్టోబరు5,ప్రభాతవార్త:** తెలంగాణలో పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలకు మెరుగైన కనెక్టివిటీ కల్పించేందుకు పార్వతమాల పథకం కింద రూ.1,230 కోట్ల అంచనా వ్యయంతో ఐదు రోప్‌వే ప్రాజెక్టులకు మంజూరు ఇవ్వాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. గుజరాత్ రాష్ట్రం నర్మదజిల్లాలోని ఏక్తానగర్ స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ప్రాంగణంలో జరుగుతున్న చింతన్ శివిర్-2026 రెండు రోజుల కార్యక్రమాన్ని సోమవారం రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కేంద్ర రోడ్డు రవాణా,జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి అట్టహాసంగా ప్రారంభించారు. మొదటిరోజు సమావేశంలో పలు రోడ్ కనెక్టివిటీ ప్రాజెక్టుల్లో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల మధ్య సమన్వయం వంటి వివిధ అంశాలపై జరిగిన చర్చ అనంతరం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మంత్రి కోమటి రెడ్డి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులు, కేంద్రం నుంచి రావాల్సిన అనుమతులు, నిధుల మంజూరీలు, జాతీయ రహదారుల అభివృద్ధి అంశాలపై ఇరువురు సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రోడ్ ఇన్ఫ్రాపై ప్రత్యేకదృష్టి సారించిందని మంత్రి వివరించారు. తెలంగాణలో జాతీయ రహదారుల అభివృద్ధి, సేతు బంధన్,సిఆర్ఐఎఫ్ కింద 33 పనులకు రూ.1227.75 కోట్లు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, నల్గొండ హనుమాన్ హిల్, నాగార్జునసాగర్-నాగార్జునకొండ, పెద్దపల్లి జిల్లా మంథని రామగిరి కోట, నిజామాబాద్ కిల్లా రామాలయం ప్రాంతాల్లో ఈ రోప్‌వేలను ప్రతిపాదించినట్లు తెలిపారు. ఇవి భక్తులు,పర్యాటకులు, స్థానిక ప్రయాణికులకు సౌకర్యం కల్పించడంతో పాటు పర్యావరణహిత రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయడానికి దోహదపడతాయని వివరించారు. హైదరాబాద్ తూర్పు ప్రాంతంలో పెరుగుతున్న ట్రాఫిక్‌రద్దీకి శాశ్వత పరిష్కారం చూపేందుకు ఎల్బినగర్ నుంచి హయత్‌నగర్ వరకు సుమారు 6 కి.మీ. మేర డబుల్ డెక్కర్ విధానంలో ఎలివేటెడ్ కారిడార్‌ను >>2



## హైకోర్టు తాత్కాలిక సిజెగా జస్టిస్ సామ్ కోషి

### సుప్రీంకోర్టు జడ్జిలుగా జస్టిస్ అపరేష్, మరో ఇద్దరు నియామకం

### రాష్ట్రపతి నోటిఫికేషన్ విడుదల

**హైదరాబాద్,అక్టోబరు5,ప్రభాతవార్త:** తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. ఆయనతో పాటు జస్టిస్ సునీతా అగర్వాల్ (గుజరాత్ హైకోర్టు ప్రధానన్యాయమూర్తి నుండి), జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ (ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నుండి) కూడా సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతులు పొందారు. హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులను సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమిస్తూ ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం,రాష్ట్రపతి కార్యాలయం సోమవారం అధికారికంగా నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ కొత్త నియామకాలతో సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 37కి చేరింది,(సుప్రీంకోర్టులో మొత్తం మంజూరైన న్యాయమూర్తుల పోస్టుల సంఖ్య38). కాగా, తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ పి.సామ్ కోషి నియమితులయ్యారు. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్‌కుమార్ సింగ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్నారు. >>2





## ఆకాశంలో హైటెన్షన్

### హఠాత్తుగా 28 వేల అడుగులు కిందకు దిగిన విమానం

### లండన్ నుంచి చికాగో వెళ్తుండగా ఆందోళనకర పరిణామం

**లండన్, అక్టోబరు 5:** లండన్ నుంచి అమెరికాలోని చికాగోకు వెళ్తున్న బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానం సోమవారం ఐర్లాండ్ గగనతలంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. విమానం ఒక్కసారిగా సుమారు 28వేల అడుగుల మేరకు కిందికి దిగినట్లు ఫ్లైట్ ట్రాకింగ్ డేటా వెల్లడించింది. బ్రిటిష్ ఎయిర్‌వేస్‌కు చెందిన బిఎ295 విమానం లండన్ హీత్రో విమానాశ్రయం నుంచి చికాగో ఓహేర్‌కు వెళ్తోంది. ఐర్లాండ్ మీదుగా ప్రయాణిస్తున్న సమయంలో విమానం అంతర్జాతీయ అత్యవసర ట్రాన్స్‌పాండర్ కోడ్ 7700ను స్క్వాక్ చేసినట్లు సమాచారం. బోయింగ్ 777-200ఈఆర్ రకం ఈ విమానం జీ7-ఎ రిజిస్ట్రేషన్‌తో ఉంది. ఉదయం సుమారు 11.50 గంటలకు లండన్ హీత్రో విమానాశ్రయంలోని >>2

### కాంగ్రెస్ నుంచే బరిలోకి

-దానం నాగేందర్

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), అక్టోబరు 5, ప్రభాతవార్త:** ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో తాను కాంగ్రెస్ పార్టీ నుంచే బరిలోకి దిగుతానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పష్టం చేశారు. కుందన్ బాగ్‌లో, మెథడిస్ట్ కాలనీ, ఉమానగర్ కాలనీలో ఆయన పర్యటించి అక్కడ నిర్వహించిన కార్యక్రమాలలో పాల్గొన్నారు.



వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కని దానిని తొలగించే హక్కు ఎవరికి >>2





# జిఎస్టీలో సంస్కరణలు!

### అరెస్టు నిబంధన తొలగింపుపై పరిశీలన

### జైలుశిక్షలకు బదులుగా భారీ జరిమానాలు

### తొమ్మిది నేరాలను తొలగించే అవకాశం

**న్యూఢిల్లీ, అక్టోబరు 5:** జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పన్ను విధానంలో పలు కీలక సంస్కరణలను పరిశీలించే అవకాశం ఉందని ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన ఓ అధికారి తెలిపారు. ముఖ్యంగా జీఎస్టీ చట్టంలోని అరెస్టు నిబంధనలను తొలగించడం, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పరిధిని విస్తరించడం, రిఫండ్ల ప్రక్రియను వేగవంతం చేయడం వంటి అంశాలపై చర్చ జరిగే అవకాశం ఉంది. 2017లో జీఎస్టీ అమల్లోకి వచ్చిన సమయంలో ఏర్పాటు చేసిన పలు కఠిన నిబంధనలను ప్రస్తుతం సడలించే అవకాశం ఉందని అధికారి పేర్కొన్నారు. విక్రేతలు సమర్పించే ఇన్వాయిస్ వివరాలను కొనుగోలుదారులు క్లెయిమ్ చేసే ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌తో అనుసంధానం చేసే ఇన్వాయిస్ మ్యాచింగ్ వ్యవస్థతో పాటు, ఇన్‌పుట్, ఔట్‌పుట్ లెడ్జర్లను సమ్మరీ రిటర్న్‌లతో అనుసంధానం చేయడం ద్వారా పన్ను లావాదేవీలను పూర్తిస్థాయిలో ట్రాక్ చేసే అవకాశం ఏర్పడిందని చెప్పారు. జీఎస్టీ చట్టం నుంచి అరెస్టు నిబంధనలను తొలగించే ప్రతిపాదనను పరిశీలించే అవకాశం ఉందని సమాచారం. వివాదాలను అరెస్టుల ద్వారా కాకుండా పన్ను, వడ్డీ, జరిమానాల వసూలు ద్వారా పరిష్కరించే విధానం తీసుకురావచ్చని అధికారి తెలిపారు. అలాగే క్రిమినల్ ప్రాసిక్యూషన్‌కు సంబంధించిన పరిమితిని ప్రస్తుత రూ.1 కోటి నుంచి రూ.5 కోట్లకు పెంచే అవకాశం ఉంది. మొత్తం 9 నేరాలను పూర్తిగా నేర పరిధి నుంచి తొలగించే అవకాశం ఉండగా, మరో నేరాన్ని పాక్షికంగా డీక్రిమినలైజ్ చేసే ప్రతిపాదన ఉంది. మరో 24 నేరాలకు సంబంధించిన జరిమానాలను సడలించే అవకాశం ఉండగా, 11నేరాలకు ప్రస్తుత నిబంధనలను కొనసాగించే అవకాశం ఉంది. కనీస జైలు శిక్షను కూడా తొలగించి, అన్ని కేసుల్లోనూ >>2



సోమవారం అయోధ్యలోని రామమందిరంలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం అభిమానులు ఇచ్చిన గదతో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

## ఆకాశంలో హైటెన్షన్

>> టెర్మినల్5 నుంచి బయలుదేరింది. సుమారు 8 గంటల 40 నిమిషాల ప్రయాణంతో చికాగో వైపు వెళ్తోంది. ఫ్లైట్ ట్రాకింగ్ డేటా ప్రకారం, విమానం మొదట సుమారు 37,000 అడుగుల ఎత్తుకు చేరుకుంది. అనంతరం ఐర్లాండ్ మీదుగా ప్రయాణిస్తున్న సమయంలో వేగంగా దిగుతూ దాదాపు 9,000 అడుగుల ఎత్తుకు చేరుకుంది. బిఎ295 విమానం తిరిగి లండన్ హీత్రో విమానాశ్రయం వైపు మళ్లినట్లు తెలుస్తోంది. దీంతో చికాగో ప్రయాణాన్ని విమానం మధ్యలోనే నిలిపివేసినట్లు భావిస్తున్నారు. అత్యవసర పరిస్థితికి అసలు కారణం ఏమిటన్నది వెంటనే స్పష్టంగా తెలియలేదు. అట్లాంటిక్ సముద్రం మీదుగా ప్రయాణం ప్రారంభించిన సుమారు గంట తర్వాత విమానం వేగంగా కిందికి దిగడం ప్రారంభించినట్లు సమాచారం. విమానంలో తలెత్తిన సమస్య స్వరూపానికి సంబంధించి మరిన్ని వివరాలు వెంటనే అందుబాటులోకి రాలేదు. ఈ ఘటనపై బ్రిటిష్ ఎయిర్‌వేస్ కూడా వెంటనే ఎలాంటి వివరాలను వెల్లడించలేదు. విమానం ఎందుకు దారి మళ్లించిందన్న విషయాన్ని కూడా సంస్థ అధికారికంగా ధృవీకరించలేదు.

## వైద్యశాస్త్రంలో ముగ్గురికి నోబెల్

>> (స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ), జర్మనీకి చెందిన పీటర్ హెగెమాన్ (హంబోల్ట్ యూనివర్సిటీ), జార్జ్ నాజెల్ (వుర్జ్‌బర్గ్ యూనివర్సిటీ) ఈ గౌరవాన్ని దక్కించుకున్నారు. కాంతి ఆధారిత అయాన్ చానెళ్లు, ఆప్టోజెనెటిక్స్‌పై వారు చేసిన అద్భుతమైన ఆవిష్కరణలకు గాను నోబెల్ కమిటీ వారిని ఎంపిక చేసినట్లు సోమవారం ప్రకటించింది. ఈ ఆవిష్కరణ న్యూరోసైన్స్ (నాడీశాస్త్రం) రంగంలో ఒక కొత్త శకానికి నాంది పలికింది. మన మెదడు జ్ఞాపకాలను, భావోద్వేగాలను, ప్రవర్తనలను ఎలా నియంత్రిస్తుందనేది ఎన్నో శతాబ్దాలుగా ఒక పెద్ద మిస్టరీ. 20వ శతాబ్దంలో శాస్త్రవేత్తలు మెదడులోని ఏయే ప్రాంతాలు ఏయే పనులను ప్రభావితం చేస్తాయో పరిశోధించడం మొదలుపెట్టారు. అప్పటి పద్ధతులతో కచ్చితమైన కారణాలను నిర్ధారించడం సాధ్యపడలేదు. వారి వద్ద ఉన్న మెదడు చిత్రం, ఎన్నో ప్రశ్నలతో, ఖాళీలతో నిండిన ఒక చిత్తుపటంగానే మిగిలిపోయింది. అయితే, ఆప్టోజెనెటిక్స్ రాకతో ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. "ఒకప్పుడు కల అనుకున్న మెదడును మ్యాపింగ్ చేసే అవకాశాన్ని ఆప్టోజెనెటిక్స్ సాకారం చేసింది" అని నోబెల్ కమిటీ ఛైర్మన్ పెర్ స్వెన్నింగ్‌సన్ వ్యాఖ్యానించారు. ఈ అద్భుత ఆవిష్కరణకు పునాది వేసింది పీటర్ హెగెమాన్ జిజ్ఞాస. క్లామిడోమోనాస్ అనే ఒకే కణం కలిగిన నాచు (ఆల్గే) కాంతి ఉన్నవైపు ఎలా ఈదగలుగుతోందని ఆయన ఆలోచించారు. 2000ల ప్రారంభంలో, ఆయన తన సహచరుడు జార్జ్ నాజెల్‌తో కలిసి ఆ నాచు కణం ఉపరితలంపై ఛానెల్‌రోడోప్సిన్‌అనే ఒక ప్రత్యేకమైన ప్రొటీన్‌ను కనుగొన్నారు. దీనిపై నీలి రంగు కాంతి పడినప్పుడు, ఆ ప్రొటీన్‌లో ఒక మార్గం (ఛానెల్) తెరుచుకుని, అయాన్లు కణం లోపలికి ప్రవహించి ఒక విద్యుత్ సంకేతాన్ని సృష్టిస్తాయని వారు గుర్తించారు.
ఈ ప్రొటీన్‌ను ఏ కణంలో ప్రవేశపెట్టినా, ఆ కణం కాంతికి స్పందించేలా మారుతుందని నిరూపించారు. ఈ పరిశోధనను కార్ల్ డీస్సెరొత్ మరో స్థాయికి తీసుకెళ్లారు. ఆయన ఛానెల్‌రోడోప్సిన్ జన్యువును ఎలుకల మెదడులోని నరాల కణాలలోకి ప్రవేశపెట్టారు. ఆ తర్వాత వాటిపై నీలి కాంతిని ప్రసరింపజేసి, నరాల సంకేతాలను విజయవంతంగా ప్రేరేపించగలిగారు. 2005లో ఆయన ఈ ప్రయోగాన్ని ప్రచురించగా, రెండేళ్ల తర్వాత 2007లో బతికున్న ఎలుకల మెదడులో ఈ ఖికాంతి ఆధారిత స్విచ్ఖి పనిచేసేలా చేసి సంచలనం సృష్టించారు. ప్రస్తుతం ఆప్టోజెనెటిక్స్ అని పిలుస్తున్న ఈ పద్ధతి ప్రపంచవ్యాప్తంగా వేగంగా ప్రాచుర్యం పొందింది.

## 90 లక్షల మంది ఓటుపై వేటు

>> వేణుగోపాల్ అధ్యక్షతన సోమవారం ఢిల్లీలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణలో ఉన్న ప్రజాసంఘాలు, కుల సంఘాలకు, ఓట్లు గల్లంతైన వారి ఓట్లను పరిరక్షించుకునే విధంగా లేఖ రాస్తామని తెలిపారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ధర్నాలు, ర్యాలీలు రానున్న రెండు నెలల పాటు నిరంతర కార్యక్రమాలు నిర్వహించి ప్రజలలో తమ ఓటు హక్కు భద్రంగాలేదని అవగాహనకల్పించడానికి కృషిచేస్తామని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఒత్తిడితోనే ఎన్నికల కమిషనర్ రాజ్యాంగ వ్యతిరేకశక్తిగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని మహేశ్ గౌడ్ డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండాలని రాహుల్ గాంధీ చెప్పారని అన్నారు. ఈ నెల 6,7వ తేదీల్లో గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు టిపిసిసి ఆధ్వర్యంలో ధర్నాలు, ర్యాలీలు నిర్వహిస్తామని వెల్లడించారు. అక్టోబరు 8వ తేదీన లోక్‌భవన్ ఎదుట ఆందోళన నిర్వహిస్తామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కాగా, ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (ఎఐపిసి) ఛైర్‌పర్సన్‌గా నియమితులైన మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ సోమవారం ఢిల్లీలోని 10 జన్‌పథ్‌లో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎఐపిసి భవిష్యత్ కార్యాచరణ, సంస్థాగత విస్తరణ, దేశవ్యాప్తంగా ప్రొఫెషనల్స్‌ను ఏకం చేయడం, పాలసీ మేకింగ్‌లో నిపుణుల భాగస్వామ్యం తదితర అంశాలపై చర్చించారు. రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగుణంగా ప్రొఫెషనల్స్‌ను రాజకీయాలు, పాలసీ రూపకల్పన, ప్రజా సమస్యలు, దేశ నిర్మాణంతో అనుసంధానం చేయడమే తిశిది ప్రధాన లక్ష్యమని మధుయాష్కీ గౌడ్ గారు తెలిపారు. విద్య, వైద్యం, ఉద్యోగాలు, గృహ నిర్మాణం, జీవన వ్యయం, పన్నుల భారం, ఉద్యోగ భద్రత, పిల్లల భవిష్యత్ వంటి అంశాలపై వాస్తవాలు, డేటా ఆధారంగా అధ్యయనం చేసి ప్రత్యామ్నాయ విధానాలను రూపొందిస్తామన్నారు. యువత, గ్రాడ్యుయేట్లు, ఉద్యోగార్థులు, స్టార్టప్‌లకు చెందిన యువ ప్రొఫెషనల్స్‌తో విస్తృతంగా సంభాషించి వారి సమస్యలను తెలుసుకుంటామని తెలిపారు. దేశంలోని ప్రతి రాష్ట్రంలో ప్రొఫెషనల్స్ డైలాగ్ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు మధుయాష్కీ తెలిపారు. విద్య, వైద్యం, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, టెక్నాలజీ, పన్నులు, జీవన వ్యయం, ఉద్యోగ భద్రత, గిగ్ వర్కర్ల సామాజిక భద్రత వంటి అంశాలపై నిపుణులతో చర్చించి పాలసీ ప్రతిపాదనలు రూపొందిస్తామన్నారు.

## సస్పెండ్ చేయలేం

>> తెలుపలేదని సుప్రీం కోర్టు సోమవారం స్పష్టం చేసింది. అయితే ఈ మార్పులు ఎవరు చేశారో నిర్ధారించేందుకు సంబంధిత రికార్డులను తాము పరిశీలిస్తామని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సూర్య కాంత్ తెలిపారు. సవరించిన ఫారం 6కు తాము ఆమోదం తెలుపలేదని, ఈ విషయంలో చాలా స్పష్టంగా ఉన్నామని ఆయన చెప్పారు. ఆ రికార్డులను సుప్రీంకోర్టుకు సమర్పించినప్పుడు ఫారం 6లో ఎవరు మార్పులు చేశారో మేము చూడాలనుకుంటున్నాం అని ఆయన అన్నారు. మిగతా ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఏకాభిప్రాయం లేకుండా ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారన్న ఆరోపణలపై ఆయనను సస్పెండ్ చేస్తూ ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. తమకు స్పందన అందేంత వరకు ఈసీ నిర్ణయాలు చట్టానికి అనుగుణంగానే ఉన్నాయని తాము భావిస్తామని ధర్మాసనం పేర్కొంది. ఆ నివేదిక కచ్చితమైనది కావచ్చు, కాకపోవచ్చు. కానీ దానిఆధారంగా మేము ఉత్తర్వులు జారీ చేయలేం. మేము వారి స్పందన కోసం వేచి ఉండాలని సీజేఐ సూర్య కాంత్ పేర్కొన్నారు. మరోవైపు ఫారం 6 అనేది ఓటర్ల నమోదు నియమావళి 1960లోఒక భాగం. దీనిని కేవలం ఒక సవరణ ద్వారా మాత్రమే మార్చడం సాధ్యమవుతుంది. అయితే ఫారం 6కు ఒక అనుబంధ పత్రం జతచేయాలని 2025లో ఈసీ పేర్కొంది. ఓటరు జాబితాల సవరణ ప్రక్రియ (సర్)లో భాగంగా కొత్త ఓటర్లు తమ తల్లిదండ్రులు లేదా తాత, నానమ్మలు లేదా తాత, అమ్మమ్మల గత ఓటర్ల జాబితాలతో అనుసంధానించే వివరాలను అందించాలని కోరడంవివాదస్పదమైంది. అయితే తమకు తెలియకుండా లేదా తమ సిఫార్సు లేకుండా ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియ (సర్), ఫారం 6 సవరణకు సంబంధించి సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారని, ఉత్తర్వులు జారీ చేశారంటూ ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి ఆరోపించినట్లు ఆంగ్ల దినపత్రిక వార్తా కథనాన్ని ప్రచురించింది. ఆ ఇద్దరు ఎన్నికల కమిషర్లు గత 10 నెలల్లో కనీసం 14 సార్లు రికార్డుల్లో తమ అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో "సర్ ప్రక్రియపై వివాదం తారాస్థాయికి చేరింది. సెప్టెంబర్ 28న ఈ వివాదంపై ఈసీ స్పందించింది. ఫారం 6 సవరణకు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపినట్లు పేర్కొంది. అలాగే జత చేయాల్సిన డిక్లరేషన్‌ను కూడా సుప్రీంకోర్టు సమర్థించినట్లు ఈసీ వెల్లడించింది. అయితే ఫారం 6లో ఎలాంటి సవరణలకు తాము ఆమోదం తెలుపలేదని సుప్రీంకోర్టు సోమవారం స్పష్టం చేసింది.
ఈ మార్పులు ఎవరు చేశారో నిర్ధారించేందుకు సంబంధిత రికార్డులను తాము పరిశీలిస్తామని సీజేఐ సూర్య కాంత్ పేర్కొన్నారు.

### వారం - వర్జ్యం

**06-10-2026, మంగళవారం,**
**శ్రీ పరాభవ నామ సంవత్సరం,**
**భాద్రపద మాసం, దక్షిణాయణం,**
**వర్ష ఋతువు, కృష్ణపక్షం, హస్తకార్తె,**
తి. ఏకాదశి రా.12.36,
న. ఆశ్లేష రా.10.19,
వ.ఉ .11.31 -మ.1.03,
దు.ఉ.8.21- ఉ.9.09,2)రా.10.36-రా.11.27,
రాహు. మ.3.00- మ.4.30,
శుభ. స. ఉ.7.00 - ఉ .8.00.

### వార్తాఫలం

**మేషం :** బ్యాంక్ లావాదేవీల పైన ప్రత్యేక దృష్టిని సారిస్తారు. దూరప్రాంత విషయాలు సానుకూల దిశలో ఉంటాయి.

**వృషభం :** మీరంటే ఇష్టం లేని వారు మిమ్మల్ని నిందారోపణలకు గురి చేస్తారు. సంతాన విషయమై ఆలోచనలు చేస్తారు.

**మిథునం :** కొత్త వ్యక్తులు పరిచయమై నూతన వ్యాపారాలకు శ్రీకారం చుడతారు. చర్చలు సఫలం. ప్రయాణాలు

**కర్కాటకం :** సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు. శుభవార్తలు వింటారు. విద్య, ఉద్యోగావకాశాలు వుంటాయి.

**సింహం :** వర్గ రాజకీయాలను సమర్ధవంతంగా నడుపుతారు. జీవిత భాగస్వామి సలహాలను పాటిస్తారు.

**కన్య :** ఆత్మస్థైర్యం కొండంత అండగా నిలుస్తుంది. ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

**తుల :** కొత్త పనులకు శ్రీకారం చుడతారు. ఇంటర్వ్యూలలో పాల్గొంటారు. బంధువుల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**వృశ్చికం :** నూతన ఉద్యోగ ప్రాప్తి. సంఘంలో ఆదరణ లభిస్తుంది. వ్యవహారాలల్లో విజయం సాధిస్తారు.

**ధనుస్సు :** గృహ నిర్మాణ ఆలోచనలు సాగిస్తారు. వ్యాపారాలలో స్వల్ప మార్పులు ఉంటాయి. పనుల్లో ఆటంకాలు.

**మకరం :** ఉద్యోగాలలో స్వల్పమార్పులు. పనులు నిదానంగా పూర్తి చేస్తారు. కుటుంబ సభ్యులను కలిసి ఉల్లాసంగా గడుపుతారు.

**కుంభం :** దూరప్రాంతాల నుండి కీలక సమాచారం అందుతుంది. ఆస్తి వివాదాలు పరిష్కారమై లబ్ది పొందుతారు.

**మీనం :** స్వయం కృతాపరాధాలు చోటు చేసుకుంటాయి. చెల్లించవలసిన ఇన్స్టాల్మెంట్ వాయిదా వేస్తారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# '5 రోప్‌వే'లకు అనుమతించండి

>> నిర్మించాలని మంత్రి కోరారు. ఇప్పటికే ఎన్‌హెచ్ 65లో ఎల్‌బీనగర్-మల్కాపూర్ సెక్షన్‌ను సర్వీస్ రోడ్లతో సహా ఆరు(6+2) లేన్లుగా అభివృద్ధి చేసేందుకు రూ.545 కోట్లతో కేంద్రం అనుమతులు ఇచ్చిందని తెలిపారు. ఎక్కువగా నిర్మాణాలు ఉన్న ప్రాంతాల్లో ఆర్‌ఇవాల్‌కు బదులుగా వయాడక్ట్ విధానంలో నిర్మాణం చేపట్టాలని ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయని వివరించారు. మియాపూర్-ఎల్‌బీనగర్ మెట్రో రైలు కారిడార్‌ను రెండో దశలో హయత్‌నగర్ వరకు పొడిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో, మెట్రోతో సమన్వయం ఉండేలా డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు 2026-27 వార్షిక ప్రణాళికలో చోటు కల్పించి మంజూరు చేయాలని కోరారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సేతు బంధన్ పథకం కింద భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం బైపాస్ వద్ద నాలుగు లేన్ల రైల్వేఓవర్‌బ్రిడ్జి, పెద్దపల్లి జిల్లాలో సుల్తానాబాద్ వద్ద రెండు లేన్ల ఆర్‌ఓబి, నల్గొండ జిల్లాలో పగిడిపల్లి-నడికుడి రైల్వే సెక్షన్‌లో నాలుగు లేన్ల ఆర్‌ఓబి నిర్మాణ ప్రతిపాదనలను కేంద్రం పరిశీలించాలని కోమటిరెడ్డి వెంకటరెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కలిపే హైదరాబాద్-విజయవాడ-మచిలీపట్నం ఎన్‌హెచ్ 65ను ఆరు(6+2) లేన్లుగా విస్తరించే ప్రాజెక్టును వేగవంతం చేయాలని మంత్రి కోమటి రెడ్డి, నితిన్ గడ్కరీని కోరారు. ప్రస్తుతం ఈ రహదారిపై ట్రాఫిక్ 1.20 లక్షలకు పైగా పిసియు కు చేరిందని, అనేక ప్రమాదకర ప్రాంతాలు, బ్లాక్‌స్పాట్లు ఉన్నాయని తెలిపారు. పెరుగుతున్న ట్రాఫిక్ అవసరాలకు అనుగుణంగా రహదారిని విస్తరించడంతో పాటు రోడ్డు భద్రతను మెరుగుపరచడం అత్యవసరమని చెప్పారు. ఈ ప్రాజెక్టుకు అలైన్‌మెంట్ ఆమోదం, పిఎటి ఎస్‌సి, పిపిపిఎసి ఆమోదాలు ఇప్పటికే లభించాయని, సిసిఇఎ ఆమోదం కోసం సిఫారసు చేసిన నేపథ్యంలో త్వరగా తుది ఆమోదం లభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. హైదరాబాద్-శ్రీశైలం ఎన్ హెచ్ 765లో టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి మంజూరు ఇవ్వాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. అటవీ ప్రాంతంలో రహదారి విస్తరణకు ఎదురవుతున్న సమస్యలకు ఎలివేటెడ్ కారిడార్ పరిష్కారంగా నిలుస్తుందని, శ్రీశైలం వెళ్లే భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించడంతో పాటు నల్లమల అటవీ ప్రాంత పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ఇది దోహదపడుతుందని వివరించారు. హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డులోని ఉత్తర భాగానికి ఆర్థిక, కేంద్ర మంత్రివర్గ ఆమోదం త్వరగా ఇవ్వాలని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోరారు.
సంగారెడ్డి- నర్సాపూర్-తూప్రాన్- గజ్వేల్- జగదేవ్‌పూర్-భువనగిరి-చౌటుప్పల్ మార్గంలో 161.518 కి.మీ. మేర నిర్మించనున్న ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగానికి భూసేకరణ వ్యయంలో 50 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. ఇప్పటికే 90 శాతానికి పైగా భూములకు అవార్డులు ఆమోదమయ్యా యని, ఎన్‌హెచ్‌ఎఐ టెండర్లు కూడా ఆహ్వానించినందున వీలైనంత త్వరగా ఆర్థిక, కేబినెట్ ఆమోదాలు ఇవ్వాలని కోరారు. అదే సమయంలో హైదరాబాద్ చుట్టూ పూర్తి రింగ్‌ను ఏర్పాటు చేసేందుకు ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగాన్ని కూడా ఉత్తర భాగంతో సమానంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీ, పారిశ్రామిక పార్కులు, రేడియల్ రోడ్లు తదితర భవిష్యత్ మౌలిక వసతులకు దక్షిణ ఆర్‌ఆర్‌ఆర్ కీలకంగా మారుతుందని వివరించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య భవిష్యత్ కనెక్టివిటీని మరింత బలోపేతం చేసే హైదరాబాద్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేకు సంబంధించి డిపిఆర్ ప్రక్రియను వేగవంతం చేసి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలని మంత్రి కోరారు. ఈ ఎక్స్‌ప్రెస్‌వేను తెలంగాణలోని డ్రైపోర్టుతో అనుసంధానం చేయడం ద్వారా సరుకు రవాణా సులభతరం అవుతుందని, ఆర్థిక కార్యకలాపాలు, పారిశ్రామిక అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. బందర్ పోర్టుకు స్పర్ కనెక్టివిటీ కల్పించే అవకాశం కూడా ఉందని వివరించారు. తెలంగాణ అభివృద్ధికి కీలకమైన ఈ ప్రాజెక్టులన్నింటినీ సానుకూలంగా పరిశీలించి, కేంద్ర స్థాయిలో అవసరమైన అనుమతులు, నిధుల మంజూరీలు, కేబినెట్ ఆమోదాలను త్వరితగతిన పూర్తి చేసి రాష్ట్రానికి సహకరించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. మంత్రి రాష్ట్ర ప్రాజెక్టుల కోసం చేసిన విజ్ఞప్తుల పట్ల నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారు. మంత్రి వెంట ఆర్ అండ్ బి స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, చీఫ్ ఇంజనీర్లు బి.వి రావు, ధర్మారెడ్డి, వసంత్ నాయక్ పలువురు అధికారులు ఉన్నారు.

# జిఎస్టీలో సంస్కరణలు

>> ప్రత్యామ్నాయంగా జరిమానా విధించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. నిజాయితీగా వ్యవహరించే కొనుగోలుదారులకు కూడా జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఊరట కల్పించే ప్రతిపాదన ఉంది. చెల్లుబాటు అయ్యే ఇన్వాయిస్ కలిగి ఉండి, సరఫరాదారుకు చెల్లింపు చేసిన కొనుగోలుదారుడు ఐటీసీని పొందిన తర్వాత సరఫరా గొలుసులో పైస్థాయిలో ఉన్న మరో వ్యాపారి డిఫాల్ట్ చేసినా ఆ క్రెడిట్‌ను కొనసాగించుకునే అవకాశం కల్పించనున్నారు. అటువంటి సందర్భాల్లో వసూలు చర్యలను డిఫాల్ట్ చేసిన వ్యక్తిపై తీసుకునే విధానం ప్రతిపాదిత మార్పుల్లో ఉంది. ప్రస్తుతం ఐటీసీకి పరిమితులు ఉన్న పలు విభాగాలకు కూడా క్రెడిట్‌ను విస్తరించే అవకాశం ఉంది. ఇందులో ఉద్యోగుల కోసం సంస్థలు కొనుగోలు చేసే ఆరోగ్య, జీవిత బీమా పాలసీలు, 13 మంది వరకు ప్రయాణించగల సామర్థ్యం ఉన్న వాహనాలు, వాటికి సంబంధించిన బీమా, సర్వీసింగ్, లీజింగ్ సేవలు ఉన్నాయి. అలాగే టెలికాం టవర్లు, ఫ్యాక్టరీ ప్రాంగణం వెలుపల ఏర్పాటు చేసిన పైప్‌లైన్లు, ఉచిత నమూనాలు, చట్టపరమైన నిబంధనల కారణంగా గడువు ముగిసి ధ్వంసం చేయాల్సిన వస్తువులకు కూడా ఐటీసీ అవకాశం కల్పించే అంశాన్ని పరిశీలించనున్నారు. సేవలు, ప్లాంట్, మెషినరీపై చెల్లించిన పన్నులకు కూడా రిఫండ్ పొందే అవకాశం కల్పించే ప్రతిపాదన ఉంది. ప్లాంట్, మెషినరీకి సంబంధించిన రిఫండ్‌ను ఐదేళ్లలో దశలవారీగా చెల్లించే అవకాశం ఉంది. రీఫండ్ దరఖాస్తులను 10 రోజుల్లోగా అంగీకరించాల్సి ఉంటుంది. నిర్దేశిత సమయంలో అధికారి చర్య తీసుకోకపోతే దరఖాస్తు ఆటోమేటిక్‌గా అంగీకరించినట్లుగా పరిగణించే అవకాశం ఉంది. రూ.10వేల కంటే తక్కువ మొత్తానికి సంబంధించిన పన్ను డిమాండ్లపై షోకాజ్ నోటీసులు జారీ చేయకూడదనే నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. 2017 నుంచి ఇప్పటివరకు ఇలాంటి సుమారు 11.3 లక్షల నోటీసులు జారీ అయినట్లు అధికారులు తెలిపారు. రూ.5 కోట్ల వరకు టర్నోవర్ కలిగి, కేవలం రిజిస్టర్ కాని వ్యక్తులకు మాత్రమే సరఫరా చేసే పన్ను చెల్లింపుదారులకు త్రైమాసిక పన్ను చెల్లింపులతో కూడిన ఐచ్ఛిక వార్షిక రిటర్న్ విధానానికి సూత్రప్రాయ ఆమోదం లభించే అవకాశం ఉంది. చిన్న పన్ను చెల్లింపుదారులపై విధించే ఆలస్య రుసుములను కూడా మాఫీ చేసే అవకాశం ఉంది. ఆటోమేటిక్ రూట్‌లో జీఎస్టీ రిజిస్ట్రేషన్ ప్రస్తుతం మొత్తం రిజిస్ట్రేషన్లలో 61 శాతం వరకు ఉంది. ఈ విధానంలో రిజిస్ట్రేషన్ మూడు పని దినాల్లోనే పూర్తి చేసే ప్రక్రియ కొనసాగనుంది. ఎగుమతిదారు తన విదేశీ బ్రాంచ్‌కు సరఫరా చేసిన వస్తువులు లేదా సేవలను ఎగుమతులుగా పరిగణించే అవకాశం ఉంది. అలాగే విదేశీ క్లయింట్‌కు చెందిన వస్తువులపై భారత్‌లో చేపట్టే జాబ్‌వర్క్, విదేశీ కొనుగోలుదారు సూచనల మేరకు వస్తువులను నేరుగా ప్రత్యేక ఆర్థిక మండలికిపంపే లావాదేవీలను కూడా ఎగుమతులుగా పరిగణించే అవకాశం ఉంది. చిన్న ఈకామర్స్ విక్రేతలు తమ సొంత రాష్ట్రంలో ఒకసారి వెరిఫికేషన్ పూర్తి చేసిన తర్వాత, ఇతర రాష్ట్రాల్లో ప్లాట్‌ఫామ్‌కు చెందిన గోదామును తమ వ్యాపార స్థలంగా ఉపయోగించుకునే అవకాశం కల్పించే ప్రతిపాదన ఉంది. హోటళ్లు, రెస్టారెంట్లు, ఫిట్‌నెస్ సేవలకు ఐటీసీ వ్యాపార అవసరాల కోసం కొనుగోలు చేసే రాత్రికి రూ.7,500 వరకు ఖర్చయ్యే హోటల్ గదులు, రెస్టారెంట్, క్యాటరింగ్ సేవలు, అలాగే అదే వ్యాపార రంగంలో తిరిగి విక్రయించేందుకు కొనుగోలు చేసే ఫిట్‌నెస్ సేవలపై కూడా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను అనుమతించే అవకాశం ఉంది. దిగుమతి చేసుకునే మందులకు సంబంధించి మినహాయింపు జాబితాలో మరో ఏడు అరుదైన వ్యాధులను చేర్చే అవకాశం ఉందని ఆర్థిక మంత్రిత్వ శాఖ అధికారి తెలిపారు. ఈనెల 7న జరిగే 57వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఈ ప్రతిపాదనలపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.




బీహార్ పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్ ప్రధాన పరీక్ష రద్దుకు వ్యతిరేకంగా సోమవారం పాట్నాలో నిర్వహించిన 'సిఎం ఘెరావ్' ర్యాలీలో ఆందోళన చేస్తున్న అభ్యర్థులు

# స్విస్ పెట్టుబడులు

>> వంటి పలు రంగాలలో తమ సహకారాన్ని మరింతగా పెంపొందించుకోవడానికి భారత్, స్విట్జర్లాండ్ పలు అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశాయి. వాణిజ్యం, పెట్టుబడులు, ఆవిష్కరణలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైనిక మార్పిడులు, రక్షణ ఉత్పత్తి, అణుశక్తి, సైన్స్ అండ్ టెక్నాలజీ, ప్రజల మధ్య సంబంధాలలో సహకారాన్ని మరింతగా పెంపొందించే మార్గాలపై నాయకులు చర్చించారు. భారత్ ఇఎఫ్‌టిఎ వాణిజ్య, ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (టిఇపిఎ) కింద ఆర్థిక సహకారంలో పెరుగుతున్న వేగాన్ని ఇద్దరు నాయకులు గుర్తించారు. ఆవిష్కరణల ఆధారిత భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లడానికి తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు. రవాణా, చలనశీలత, మౌలిక సదుపాయాలు, వలసలు, చలనశీలత, యువ నిపుణుల రంగాలను కొత్త ఒప్పందాలు, కార్యక్రమాలు కవర్ చేస్తాయి. ఈ చర్చల ఫలితంగా ఆరోగ్యం, స్వచ్ఛ ఇంధనం, అంతరిక్షం రంగాలను కవర్ చేస్తూ కొత్త ఉమ్మడి పరిశోధన కార్యక్రమాలు కూడా ప్రారంభమయ్యాయి. ప్రధాని మోడీ, అధ్యక్షుడు పార్మెలిన్ శాంతి, దౌత్యం, ప్రపంచ సంస్థల సంస్కరణల పట్ల తమ నిబద్ధతను పునరుద్ఘాటించడంతో పాటు, ద్వైపాక్షి క, ప్రాంతీయ, అంతర్జాతీయ సమస్యలపై కూడా అభిప్రాయాలను పంచుకున్నారు. భారత్- స్విట్జర్లాండ్ స్నేహం శతాబ్దాల నాటిదని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కొనియాడారు. కీలక రంగాల్లో ద్వైపాక్షి క సహకారాన్ని మరింత పటిష్టం చేసేలా అవగాహన ఒప్పందాలు చేసుకున్నారు. రాబోయే 15యేళ్లలో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు, పది లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలు లక్ష్యంగా ప్రతిష్టాత్మక ఆర్థిక రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరించారు. స్విస్ అధ్యక్షుడు గై పార్మెలిన్‌తో ద్వైపాక్షి క చర్చల అనంతరం నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో ప్రధాని మోడీ ఈ మేరకు ప్రకటన చేశారు.
"టిఇపిఎ కింద, నాలుగు ఇఎఫ్‌టిఎ దేశాలైన స్విట్జర్లాండ్, నార్వే, ఐస్‌లాండ్, లీచ్‌టెన్‌స్టైన్, 15 సంవత్సరాలలో భారతదేశంలో 100 బిలియన్ల పెట్టుబడులను సులభతరం చేయడానికి కట్టుబడి ఉన్నాయి. దీని ద్వారా 10 లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలు సృష్టించబడే అవకాశం ఉంది. ఈ గణాంకాలు ఇప్పటికే అందిన పెట్టుబడులను లేదా సృష్టించబడిన ఉద్యోగాలను కాకుండా, ఒప్పందం దీర్ఘకాలిక లక్ష్యాన్ని సూచిస్తాయి. ఈ ఒప్పందం పెట్టుబడి, ఆవిష్కరణ, ఉద్యోగాలు, పరస్పర శ్రేయస్సు ప్రతిష్టాత్మక ప్రణాళిక" అని మోడీ అభివర్ణించారు. కాగా అంతర్జాతీయ సంఘర్షణలు, రోజురోజుకూ ముక్కలవుతున్న ప్రపంచంలో దౌత్యం పాత్ర గురించి కూడా నాయకులు చర్చించారు. "అనేక సంఘర్షణ కేంద్రాలు, ముఖ్యంగా ఉక్రెయిన్‌లో యుద్ధం కూడా చర్చనీయాంశాలుగా ఉన్నాయి" అని పార్మెలిన్ సంయుక్త పత్రికా సమావేశంలో తెలిపారు. ఐక్యరాజ్యసమితి, బహుళపక్ష సంస్కరణలు, అంతర్జాతీయ దౌత్యానికి ఒక వేదికగా జెనీవా పాత్ర వంటి అంశాలపై చర్చలు జరిగాయని ఆయన చెప్పారు. అనేక ప్రపంచ సమస్యలపై భారత్, స్విట్జర్లాండ్‌ల మధ్య ఏకాభిప్రాయం ఉందని కూడా ఆయన పేర్కొన్నారు.

## కాంగ్రెస్ నుంచే బరిలోకి

>> లేదన్నారు. ఓటు హక్కును తొలగించడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. దేశ వ్యాప్తంగా ఓటు చోరీ జరిగిందని అన్ని పార్టీలు, ప్రముఖులు, సీజేపీ తదితర సంస్థలు ఆందోళన చేస్తున్నాయన్నారు. దానిపైన స్పందించాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు ఉందో లేదో పరిశీలించుకోవాలన్నారు. ఓటు విషయంలో నియోజకవర్గంలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. నియోజకవర్గంలోని ఒక డివిజన్‌లో సుమారు 17వేలు ఓట్లు తొలగించారన్నారు. ఎన్నికల కమిషన్ దీనిపై దృష్టి సారించాలన్నారు. తాను కాంగ్రెస్ నుంచి పార్లమెంటు సభ్యుడిగా కొట్లాడాను కాబట్టి అనర్హత వేటుకు గురయ్యానని అన్నారు. విజయారెడ్డి వేసిన పిటీషన్‌పై ఆయన స్పందిస్తూ అనర్హత వేటు వేయడంతోపాటు, ఉప ఎన్నికలకు వెళ్లమని సుప్రీంకోర్టు తేల్చేప్పుందన్నారు. దానం వెంట మాజీ కార్పొరేటర్ వనం సంగీతయాదవ్, కాంగ్రెస్ నేతలు వనం శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## టీ స్టాల్ యజమాని ఆత్మహత్య

>> వచ్చాడు. అనంతరం అక్కడి సిబ్బంది చూస్తుండగానే ఒంటి పై పెట్రోల్ పోసుకున్నాడు. అయితే అక్కడ విధుల్లో వున్న పోలీసు సిబ్బంది అతన్ని వారిస్తూనే వున్నా వినిపించుకోకుండా క్షణాల వ్యవధిలో నిప్పంటించుకున్నాడు. దీంతో పోలీసు సిబ్బంది ఒక్కసారిగా షాక్‌కు గురై వెంటనే స్టేషన్ కిటికీలకు వున్న పరదాలను అతనిపై కప్పి మంటల ను ఆర్పారు. అయితే అప్పటికే సుధాకర్ 90 శాతానికి పైగా కాలిపోయాడు. అనంతరం పోలీసులు వెంటనే సుధాకర్‌ను జిల్లా ఆసుపత్రికి తర లించగా గంట తరువాత చనిపోయాడు. కాగా ఈ ఘటనలో భీంగల్ పోలీసు స్టేషన్ సిబ్బందికి ఎలాంటి గాయాలు కాలేదు. ఈ ఘటన జిల్లా వాప్తంగా సంచలనం రేపింది. దీనిపై భీంగల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేబట్టారు. ఈ ఘటనపై పోలీసు కమిషనర్ సాయి చైతన్య స్పందిస్తూ సుధాకర్ అనే వ్యక్తి ఆత్మహత్యలో పోలీసుల తప్పిదం ఏమీలేదని తెలిపారు. ఈ పెట్టి కేసులు నిబంధనలు పాటించని అనే క మంది వ్యాపారులపై నమోదు చేయడం జరిగిందని, అందులో సుధాకర్ స్టాల్ కూడా వుందని ఆయన తెలిపారు. దీనికి మనస్తాపం చెందిన సుధాకర్ పోలీసు స్టేషన్‌లో ఆత్మహత్య చేసుకున్నాడని, ఇందులో పోలీసుల ప్రమేయం ఏమీలేదని ఆయన వెల్లడించారు.

## సిజెగా జస్టిస్ సామ్ కోషి

>> ఈ నేపథ్యంలో.. ఆయన స్థానంలో జస్టిస్ సామ్ కోషి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్నారు. జస్టిస్ పి.సామ్ కోషికి సుదీర్ఘ న్యాయ అనుభవం ఉంది. 1967 ఏప్రిల్ 30న జన్మించిన ఆయన.. 1987లో కామర్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ, 1990లో న్యాయశాస్త్రంలో డిగ్రీ పూర్తి చేశారు. 1991 మార్చి 9న న్యాయవాదిగా నమోదు చేసుకుని న్యాయవృత్తిలోకి ప్రవేశించారు. సివిల్, రాజ్యాంగ, సర్వీస్, కార్మిక చట్టాలకు సంబంధించిన కేసుల్లో వాదనలు వినిపించారు. తొలుత మధ్యప్రదేశ్ హైకోర్టు జబల్‌పూర్‌లో 1991 నుంచి 2000 అక్టోబర్ వరకు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. అనంతరం 2000 నవంబర్ నుంచి ఛత్తీస్‌గఢ్ హైకోర్టు బిలాస్‌పూర్‌లో ప్రాక్టీస్ చేస్తూ దాదాపు 13 ఏళ్ల పాటు న్యాయవాదిగా కొనసాగారు. న్యాయవాదిగా ఉన్న సమయంలో ప్రభుత్వానికి కూడా న్యాయసేవలు అందించారు. 2002 నుంచి 2004 వరకు ఛత్తీస్‌గఢ్ హైకోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా పనిచేశారు. 2005-06లో డిప్యూటీ అడ్వకేట్ జనరల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. హిదాయతుల్లా నేషనల్ లా యూనివర్సిటీ, రాయ్‌పూర్ అకాడమిక్ కౌన్సిల్‌లో సభ్యుడిగా కూడా పనిచేశారు. న్యాయవాదిగా ఉన్న సమయంలో సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే, కోల్ ఇండియా లిమిటెడ్, సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్, నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, హిందుస్థాన్ పెట్రోలియం, భారత్ పెట్రోలియం తదితర ప్రముఖ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు న్యాయపరమైన వ్యవహారాల్లో ప్రాతినిధ్యం వహించారు. సుదీర్ఘ న్యాయవాద వృత్తి అనంతరం 2013 సెప్టెంబర్ 16న ఛత్తీస్‌గఢ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా జస్టిస్ సామ్ కోషి నియమితులయ్యారు. అనంతరం 2016 మార్చి 8న శాశ్వత న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. న్యాయమూర్తుల బదిలీలో భాగంగా తెలంగాణ హైకోర్టుకు బదిలీ అయిన ఆయన.. 2023 జూలై 27న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు.
అప్పటి నుంచి తెలంగాణ హైకోర్టులో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ సీనియర్ న్యాయమూర్తిగా కొనసాగుతున్నారు. జస్టిస్ సామ్ కోషికి తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి బాధ్యతలు నిర్వహించడం ఇది మొదటిసారి కాదు. గతంలో 2025 జూలై 18 నుంచి 19 వరకు అప్పటి ప్రధాన న్యాయమూర్తి అందుబాటులో లేని సమయంలో తాత్కాలికంగా చీఫ్ జస్టిస్ విధులను నిర్వహించారు.
ఇప్పుడు జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన నేపథ్యంలో మరోసారి తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ పి. సామ్ కోషి బాధ్యతలు చేపట్టనున్నారు.

# పెరుగుతున్న విద్యుత్ డిమాండ్

## ముందస్తు ప్రణాళికతో చర్యలు

### ఉత్తర తెలంగాణ విద్యుత్ సంస్థ సిఎండి వరుణ్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావం, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, రబీ, వేసవి కాలంలో మరింత విద్యుత్ వినియోగం పెరిగే అవకాశాలు ఉన్నాయని ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి కె వరుణ్‌రెడ్డి తెలిపారు. విద్యుత్ సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో వ్యవహరించనున్నట్లు వెల్లడించారు. ఇందుకు గాను విద్యుత్ మౌలిక వసతులను బలోపేతం చేయాలన్నారు. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని ముందుగానే అంచనా వేసి అవసరమైన చోట సామర్థ్య పెంపు చేపట్టాలని చెప్పారు. మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్లను ఆలస్యం లేకుండా రిపేర్ చేసి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. ప్రతి సర్కిల్‌లో అధికారులు తమ హెడ్‌క్వార్టర్లలో అందుబాటులో ఉంటూ, క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటించి విద్యుత్ మౌలిక వసతుల పరిస్థితిని స్వయంగా పరిశీలించాలన్నారు. కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు అదనంగా ఏర్పాటు చేయడం, ఇప్పటికే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచే పనులను వేగవంతం చేయాలని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్‌ను నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. 60 శాతానికి పైగా లోడ్ ఉన్న డీటీఆర్‌లను ముందుగానే గుర్తించి, అవసరమైన ప్రాంతాల్లో సామర్థ్య పెంపు లేదా అదనపు డీటీఆర్‌ల ఏర్పాటు చేపట్టాలని ఆదేశించారు. టాంగ్ టెస్టర్ రీడింగ్‌లను క్రమం తప్పకుండా తీసుకుని లోడ్ బ్యాలెన్సింగ్ చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే 33 కేవీ, 11 కేవీ విద్యుత్ లైన్లు, సబ్‌స్టేషన్లలో అవసరమైన ప్రాంతాలను గుర్తించి కెపాసిటర్ బ్యాంకులు, కెపాసిటర్ సెల్స్ ఏర్పాటు చేసి పవర్ ఫ్యాక్టర్‌ను మెరుగుపరచాలని పేర్కొన్నారు. వినియోగదారులకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

# ఓటుకు నోటు కేసులో సుప్రీంకోర్టుకు మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్

**హైదరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన 2015 నాటి ఓటుకు నోటు కేసులో నాటి ఫిర్యాదిదారుడు మాజీ మాజీ ఎంఎల్‌ఎ స్టీఫెన్‌సన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో తన వాదనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా అదనపు వాదనలు వినిపించేందుకు తనకు అవ కాశం కల్పించాలని స్టీఫెన్‌సన్ తన పిటిషన్‌లో కోరారు. ప్రధాన ఫిర్యాదుదారుగా తన వాదనలను వినడం నిష్పక్షపాత విచారణకు అత్యంత కీ లకమని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు నివేదించారు. ఈ ఇంప్లీడ్ పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం ప రిగణనలోకి తీసుకుంటూ, తదుపరి విచారణను వాయిదా వేసింది. కాగా ఇదే కేసులో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ సిఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించడం తెలిసిందే. ఈ పిటిషన్‌పై విచారణ జరుగుతున్న తరుణంలో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పి టిషన్ దాఖలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.



సింగరేణి భవన్ ముందు బైఠాయించిన కవిత, టిఆర్ఎస్ నేతలు

# సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఆమరణ దీక్ష

### ముట్టడిలో టిఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్,అక్టోబరు 5,ప్రభాతవార్త:** రెండు నెలల్లోకా సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించకుంటే హైదరాబాద్ లోని సింగరేణి భవన్ ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న కార్మికులను అన్ ఫిట్ చేయడంతో పాటు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హెచ్ఎంఎస్, తెలంగాణ రక్షణ సేన నాయకులతో కలిసి సోమవారం లక్డీకాపూల్ లోని సింగరేణి భవన్ ను ముట్టడించారు. గంటకు పైగా నడి ఎండలో రోడ్డుపై బైఠాయించి కార్మికుల కోసం ఆందోళన చేపట్టారు. సింగరేణి యాజమాన్యం దిగివచ్చి తమతో చర్చలు జరిపే వరకు అక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించుకొని కూర్చున్నారు. హెచ్ఎంఎస్, టీఆర్ఎస్ ఆందోళనతో సింగరేణి భవన్ ఎదుట పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించింది. దీంతో సింగరేణి యాజమాన్యం తరపున అధికారులు బయటికి వచ్చి ఆందోళన చేస్తున్న కల్వకుంట్ల కవిత, హెచ్ఎంఎస్ నాయకులతో చర్చలు జరిపారు. సింగరేణి సీఎండీ సెక్రటేరియట్ లో సమావేశంలో ఉన్నారని.. ఆయన ఆదేశాల మేరకు తాము చర్చలకు వచ్చామని తెలిపారు. సింగరేణి కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కవిత స్పందిస్తూ రెండు నెలల్లో పరిష్కారం కాకపోతే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, సింగరేణిలో మెడికల్ బోర్డుకు అప్లయ్ చేసుకున్న వాళ్లందరినీ అన్ ఫిట్ చేసి వాళ్ల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండు నెలల్లోగా ఈ ప్రక్రియ ప్రారంభం కావాలని.. లేదంటే హైదరాబాద్ లోని సింగరేణి భవన్ గేటు ఎదుట ఆమరణ దీక్ష చేపడతానని హెచ్చరించారు.

# యాదాద్రి థర్మల్‌కు 16 వేల టన్నుల బొగ్గు

## నైనీ గనులను సందర్శించిన జెన్కో సిఎండి హరీశ్

=**హైదరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త :** యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి అదనంగా రోజుకు 16 వేల టన్నుల బొగ్గు సరఫరాకై తెలంగాణ విద్యుత్ ఉత్పతి సంస్థ జెన్కో ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా సింగరేణికి సంబంధించి ఒడిశాలోని నైనీ బొగ్గు గనులను సోమవారం జెన్కో సిఎండి డాక్టర్ ఎస్ హరీష్, సంస్థ డైరక్టర్ బి నాగ్య తో కలసి సందర్శించారు. తమ నిర్వహణలోని యాదాద్రికి ఇంధన అవసరాలను తీర్చే కీలక చర్యలో భాగంగా ఒడిశాలోని అంగుల్ జిల్లా చెండిపాడ ఉన్న సింగరేణి కాలరీస్ యాజమాన్యంలోని నైని బొగ్గు గనుల్లో పర్యటించి, సమీక్షించారు. ఈ వ్యూహాత్మక పర్యటనలో ప్రధానంగా లాజిస్టికల్ సమస్యలను పరిష్కరించడం, యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ కు రోజువారీ బొగ్గు సరఫరాను పెంచేందుకు ఒక పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికను అమలు చేయడంపై దృష్టి సారించారు. బొగ్గు రవాణాను పెంచడానికి కార్యాచరణ ప్రణాళికలను వేగవంతం చేయనున్నారు. ఇందులో భాగంగా రోజుకు 16,000 టన్నుల నాణ్యమైన బొగ్గును తరలించడం లక్ష్యంగా ఈ కార్యాచరణ ఉన్నట్లు ఈ సందర్భంగా జెన్కో సిఎండి డాక్టర్ హరీష్ తెలిపారు. ఇందువల్ల ప్లాంట్ యొక్క ప్రస్తుత లాజిస్టిక్స్‌కు గణనీయమైన ఊతం లభిస్తుందన్నారు. ఒడిశాలోని నైని బొగ్గు గనుల నుండి యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌కు నిరంతరాయ బొగ్గు సరాఫరా కోసం,, రైల్వే వ్యాగన్ల లభ్యతను పెంచడం, స్థానిక రవాణా అడ్డంకులను తొలగించడంపై దృష్టి సారించినట్లు తెలిపారు. ఇందుకు అవసరమైన రవాణా మౌలిక సదుపాయాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ విదంగా యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ కు పెరిగిన బొగ్గు సరఫరా, ప్లాంట్ విద్యుత్ ఉత్పత్తి పెంపొందిచ దంతో పాటు, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తుందని వెల్లడిం చారు. యా దాద్రి థర్మల్ విద్యుత్ కేంద్ర అల్ట్రా సూపర్‌క్రిటికల్ స్టేషన్ కు నైని బ్లాక్ నుండి సేకరించిన నాణ్యమైన బొగ్గు చాలా అవసరమని చెప్పారు. జెన్కో, సింగరేణి మధ్య ఈ సహకారం, ఇంధన భద్రత, సరఫరా లోటులను తగ్గించడంతో పాటు, యాదాద్రి విద్యుత్ కేంద్రం నుండి విద్యుత్ ఉత్పత్తి పెంపొందించడం ద్వారా గృహ, వ్యవసాయ, పారిశ్రామిక వర్గాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరాను అందించే దిశగా దోహద పడుతుందని తెలియచేసారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో మళ్లీ కదలిక

### కాంగ్రెస్ నేత కోదండరెడ్డిని విచారించిన సిట్ అధికారులు

**హైదరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మళ్లీ కదలిక వచ్చింది. ఈ కేసుకు సంబంధించి నాలుగు నెలల తరువాత బాధితుడుగా వున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రైతు కమిషన్ కమిటీ ఛైర్మన్ కోదండ రెడ్డిని సిట్ అధికారు లు సోమవారం విచారించారు. గత అసెంబ్లీ ఎన్నికల తరువాత ఈ స్కాం వెలుగు చూడడం తెలిసిందే. 2024 మార్చి నెలలో ఇది వెలుగు చూడగా అనంతరం జరిగిన పరిణామాల్లో ఒక విశ్రాంత డిసిపితో పాటు సర్వీసులో వున్న మరో ముగ్గురు పోలీసు అధికారులు అరెస్టవడం వి 2దితమే. ఈ కేసులో కీలక నిందితుడు, సూత్రధారి అయిన నాటి ఎస్ఐబి బాస్ ప్రభాకర్ రావు సుప్రీం కోర్టు నుంచి అరెస్టు కాకుండా మధ్యం తర ఉత్తర్వులు పొందారు. దీంతో పాటు మీడియా అధినేత శ్రావణ్ రావు కూడా అరెస్టు నుంచి మధ్యంతర ఉత్తర్వులు పొందారు. అప్పట్లో కో దండ రెడ్డి ఫోన్ ట్యాపింగ్ గురైనట్లు సిట్ అధికారులు గుర్తించడం తెలిసిందే.

అప్పట్లో ప్రతిపక్షంలో వున్న కాంగ్రెస్ నేతలతో పాటు ఇతర ప్ర ముఖుల ఫోన్‌లు ట్యాపింగ్ గురవగా బాధితులుగా వున్న వీరిని సిట్ అధికారులు వరుసగా విచారించి వాంగ్మూలం నమోదు చేశారు. ఈ క్రమ ంలో కోదండ రెడ్డికి సిట్ అధికారులు ఇటీవలే నోటీసు ఇచ్చి విచారణకు రావాలని కోరారు. అయితే కోదండ రెడ్డిఅనారోగ్యం, వయస్సు రీత్యా సిట్ అధికారులు ఆయన కార్యాలయానికి వెళ్లి 40 నిమిషాల పాటు విచారించి నాటి ఘటనలపై వాంగ్మూలం తీసుకున్నారు. సిట్ విచారణలో కోదండ రెడ్డి నాటి ఘటనకు సంబంధించి అనేక విషయాలను సిట్ అధికారులకు వివరించారు. తన ఫోన్‌తో పాటు చాలా మంది ఫోన్‌లు అ ప్పట్లో ట్యాపింగ్‌కు గురైనట్లు ఆయన తెలిపారు. ఈ నేరానికి పాల్పడిన వారిని కచ్చితంగా శిక్షించాలని ఆయన కోరారు. కాగా కోదండ రెడ్డి వి చారణ దరిమిలా మరికొందరు బాధితులను సిట్ విచారించే వీలుందని తెలిసింది.

# పండుగల వేళ అదనపు ప్రత్యేక రైళ్లు

### ప్రధాన స్టేషన్లలో రద్దీ నిర్వహణకు ఏర్పాటు:న

### ద.మ.రైల్వే జిఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ



సమావేశంలో మాట్లాడుతున్న జిఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ

**హైదరాబాద్ (తార్నాక), అక్టోబరు 5, ప్రభాతవార్త :** దసరా, దీపావళి, ఛత్ పండుగల నేపథ్యంలో రైల్వే స్టేషన్లలో పెరగనున్న ప్రయాణికుల రద్దీని సమర్థవంతంగా నియంత్రించడంతో పాటు రైలు కార్యకలాపాల భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. సోమవారం సికిందరా బాద్‌లోని రైల్ నిలయంలో పండుగల సందర్భంగా ప్రధాన రైల్వే స్టేషన్లలో చేపట్టాల్సిన జనసమూహ నిర్వహణ ప్రణాళికలు, జోన్ వ్యాప్తంగా రైళ్ల భద్రతపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. సమీక్షా సమావేశంలో అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్‌తో పాటు వివిధ శాఖల ప్రధానాధిపతులు పాల్గొన్నారు. సికిందరా బాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమా వేశానికి హాజరయ్యారు. పండుగల సందర్భంగా ప్రధాన స్టేషన్లలో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున అధికారులు, పర్యవేక్షకులు అప్రమత్తం గా ఉండాలని జీఎం సూచించారు. స్టేషన్ ప్రాంగణం, ప్లాట్‌ఫార మ్‌లు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో ప్రయాణికుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రద్దీ పెరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించి భద్రతా విభాగం, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో చురుకైన చర్యలు చేపట్టాలని తెలిపారు.

ప్రధాన స్టేషన్లలో ప్రయాణికుల రద్దీ నియంత్రణ కోసం టికెట్ తనిఖీ సిబ్బంది, రైల్వే రక్షణ దళం సిబ్బందితో ప్రత్యేక క్షేత్రస్థాయి బృందాలను ఏర్పాటు చేసి మోహరిం చాలని సూచించారు. స్టేషన్ ప్రాంగణాల్లో జరుగుతున్న నిర్మాణ పనుల ప్రాంతాలను పూర్తిగా బారికేడ్లతో మూసివేసి ప్రయాణికులకు భద్రత కల్పిం చాలని ఆదేశించారు. ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో ఉన్న అడ్డంకులను తొలగించి రాకపోకలు సజావుగా సాగేలా చూడాలన్నారు. పండుగ రద్దీని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ప్రయాణికుల డిమాండ్, ప్రయాణ సరళిని నిరంతరం పర్యవేక్షించాలని జీఎం సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో అదనపు ప్రత్యేక రైలు సర్వీసులను ముందస్తుగా ప్రణాళిక రూపొందించి నడపాలని అధికారులను ఆదేశించారు. భద్రతకు అత్యంత ప్రాధాన్యంరైలు కార్యకలాపాల భద్రతపై సమీక్ష సందర్భంగా జోన్ వ్యాప్తంగా భద్రతా చర్యలను మరింత పటిష్టం చేయాలని సంజయ్ కుమార్ శ్రీవాస్తవ స్పష్టం చేశారు.

# ఆంధ్రలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ

### అప్రమత్తమైన తెలంగాణ .. కోళ్ల దిగుమతులపై నియంత్రణ దిశగా చర్యలు

**హైదరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త:** పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో బర్డ్‌ఫ్లూ కలకలం రేకెత్తిస్తుండటంతో రాష్ట్ర అధికారులు అప్రమత్తమయ్యారు. పక్క రాష్ట్రాల నుండి తెలంగాణకు వస్తున్న కోళ్ల ద్వారా బర్డ్‌ఫ్లూ వ్యాపించే ప్రమాదం ఉండటంతో వాటిని నియంత్రించే దిశగా రాష్ట్ర పశుసంవర్ధక శాఖ అధికారులు ఆలోచన చేస్తున్నారు. పక్క రాష్ట్రంలోని అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం సిద్ధరాంపురంలో బర్డ్ ఫ్లూ కలకలం రేపింది. ఓ కోళ్ల ఫామ్‌లో 2 వేలకు పైగా కోళ్లు మృతి చెందడంతో అధికారులు నమూనాలను పరీక్షలకు పంపారు. భోపాల్ హై సెక్యూరిటీ యానిమల్ డిసీజెస్ ల్యాబొరేటరీలో బర్డ్ ఫ్లూ పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో అక్కడి అధికారులు అప్రమత్తమయ్యారు. విజయవాడ నుంచి వెళ్లిన ప్రత్యేక అధికారుల బృందం క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టింది. ఫలితాలు పాజిటివ్‌గా రావడంతో వైరస్ ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. ఆయా పరిసర ప్రాంతాల్లో ఆ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించి, కోళ్ల ఫామ్‌ల యజమానులకు, స్థానికులకు తగిన జాగ్రత్తలు సూచించారు. ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ, చికెన్, గుడ్లను సరిగ్గా ఉడికించి తినాలని, అనవసరంగా భయాందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేస్తున్నారు. కోళ్ళకు బోర్డ్ ఫ్లూ వైరస్ సోకడంతో నాన్ వెజ్ ప్రియులు చికెన్ కి బదులు సీ ఫుడ్స్ పై ఆసక్తి చూపుతున్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని ఆంధ్రా నుండి వచ్చే కోళ్ల విషయంలో పక్క రాష్ట్రాలకు వ్యాపించకుండా ఉండేందుకు రాష్ట్ర అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ముఖ్యంగా ఆంధ్రా సరిహద్దు జిల్లాలకు చెందిన అధికారులు కూడా అప్రమత్తమై పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు అధికారవర్గాలు వెల్లడించాయి.



అవార్డు అందుకుంటున్న ఎయిర్‌పోర్టు ప్రతినిధులు

# నేషనల్ ఎనర్జీ లీడర్‌గా జిఎంఆర్ ఎయిర్‌పోర్ట్

### సిఐఐ నేషనల్ అవార్డ్స్-2026లో వరుసగా ఎనిమిదోసారి

### వరుసగా పదో యేడాది ఎక్సలెంట్ ఎనర్జీ ఎఫిషియెంట్ యూనిట్‌గా కూడా గుర్తింపు

**శంషాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త:** జిఎంఆర్ శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జీహెచ్ఐఏఎల్) మరో ప్రతిష్ఠాత్మక గుర్తింపును సొంతం చేసుకుంది. 27వ సీఐఐ నేషనల్ అవార్డ్స్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ ఎనర్జీ మేనేజ్‌మెంట్-2026లో వరుసగా ఎనిమిదో యేడాది 'నేషనల్ ఎనర్జీ లీడర్' అవార్డును దక్కించుకుంది. అలాగే వరుసగా పదో యేడాది 'ఎక్సలెంట్ ఎనర్జీ ఎఫిషియెంట్ యూనిట్'గా గుర్తింపు పొందింది. ఎనర్జీ ఎఫిషియెన్సీ, ఎనర్జీ మేనేజ్‌మెంట్, సస్టెయినబిలిటీ రంగాల్లో అత్యుత్తమ పనితీరును కనబరిచిన సంస్థలకు సీఐఐ ఈ అవార్డులను అందిస్తోంది. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 700కుపైగా సంస్థలు పాల్గొనగా, సెప్టెంబర్ 16 నుంచి 18 వరకు హైదరాబాద్‌లో అవార్డుల కార్యక్రమం నిర్వ హించారు. ఎనర్జీ వినియోగాన్ని తగ్గించడం, పునరుత్పాదక ఇంధనాన్ని వినియో గించడం, ఆధునిక సాంకేతికతలను అమలు చేయడం, సమర్థవంతమైన కార్యకలాపాలను కొనసాగించడం ద్వారా జీహెచ్ఐఏఎల్ సస్టెయినబుల్ ఎయిర్‌పోర్ట్‌గా ముందుకు సాగుతోంది. ఎనర్జీ కన్జర్వేషన్, ఇన్నోవేటివ్ ప్రాజెక్టులు, సస్టెయినబిలిటీ లీడర్‌షిప్, ఐఎస్ఓ 50001:2018 ఎనర్జీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అమలు, కమ్యూనిటీ అవేర్‌నెస్ వంటి అంశాలపై నిర్వహించిన సమగ్ర మూల్యాంకనంలో ఈ గుర్తింపులు లభించాయి. ఈ సందర్భంగా జీహెచ్ఐఏఎల్ సీఈఓ కధీర్ కధీరవన్ మాట్లాడుతూ.. సస్టెయినబిలిటీ తమ కార్యకలాపాల్లో అంతర్భాగమని తెలిపారు. ఎనర్జీ ఎఫిషియెంట్ టెక్నాలజీలు, రెన్యూవబుల్ ఎనర్జీ, స్మార్ట్ ఆపరేషనల్ విధానాల్లో నిరంతరం పెట్టుబడులు పెడుతున్నామని పేర్కొన్నారు. వరుసగా ఎనిమిదోసారి 'నేషనల్ ఎనర్జీ లీడర్', పదోసారి 'ఎక్సలెంట్ ఎనర్జీ ఎఫిషియెంట్ యూనిట్'గా సీఐఐ గుర్తించడం ఉద్యోగులు, భాగస్వాముల సమష్టి కృషికి నిదర్శనమని అన్నారు. ఈ అవార్డులు విమానాశ్రయం చేపడు తున్న ఇంధన పొదుపు, సాంకేతిక ఆవిష్కరణలు, పర్యావరణ పరిరక్షణ చర్యలకు మరింత ప్రోత్సాహాన్ని అందించనున్నాయి.

# సచివాలయంలో తాగునీటికి కటకట

**హైదరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త:** సెక్రటేరియెట్లో ఉద్యోగులు, సిబ్బందికి తాగునీటిని సరఫరా చేసే ఏజెన్సీలు నీటి సరఫరాను నిలిపివేయడంతో కొన్నిరోజులుగా నీటి కటకటను ఎదుర్కొంటున్నారు. రూ.50లక్షల నీటి బిల్లులు చెల్లించకుండా వాయిదా వేస్తుండటంతో నీటిని సరఫరా చేసే చేతులు ఎత్తివేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలుస్తోంది. సెక్రటేరియెట్లో తాగునీటి సరఫరా కోసం నాలుగు ఏజెన్సీలతో ఒప్పందాలు చేసుకున్నారు అయితే ఆయా ఏజెన్సీలకు చెల్లించాల్సిన బిల్లులు రూ.50 లక్షలవరకు పేరుకు పోవడంతో నీటి సరఫరాపై ప్రభావం పడింది. సెక్రటేరియట్‌లోని ప్రతి డిపార్ట్మెంట్ నుంచి లక్షల్లో బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయట దీనితో బకాయిలు చెల్లించకపోవడంతో కొన్ని ఏజెన్సీలు ఇప్పటికే సరఫరాను నిలిపివేశాయి. దీనికి తోడు సెక్రటేరియెట్లోని మంచి నీటి ఫిల్టర్లు పని చేయడం ఆగిపోవడంతో ఉద్యోగులు బయట నుంచి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్ని రోజులుగా నీటి సమస్య కొనసాగుతుండటంతో ఉద్యో గులు ఇబ్బందులు పడుతున్నారు. చివరకు ఉద్యోగులు తమ ఇళ్ల నుంచే తాగునీటి బాటిళ్లు తెచ్చుకొంటున్నారని తెలిసింది. ఇంతేకాదు సెక్రటేరి యెట్‌లో ఉద్యోగులకు అందించే మధ్యాహ్న భోజనం విషయంలోనూ ఇబ్బం దులు ఎదురవుతున్నాయని చర్చించుకొంటున్నారు. పెండింగ్ బిల్లులు, ఇతర సమస్యల నేపథ్యంలో లంచ్ బంద్ చేసేశారని తెలిసింది. ఇప్పుడు తాగునీటి సరఫరా కూడా నిలిచిపోవడంతో ఉద్యోగుల్లో అసంతృప్తి వ్యక్త మవుతోంది. భారీస్థాయిలో బిల్లులు పెండింగ్‌లో ఉండటంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని ఉద్యోగులటున్నారు. బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారు? నీటిసరఫరా ఎప్పటి లోగా పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తారని ఉద్యోగుల్లో అనిశ్చితి నెలకొంది.




# ఎసిబికి పట్టుబడిన రంగారెడ్డి జిల్లా డిఎంహెచ్ఒ

## మరో ఇద్దరు ఉద్యోగులు కూడా..

## లక్ష రూపాయలు లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టివేత



లక్ష రూపాయలు లంచం తీసుకుంటూ ఎసిబికి దొరికిపోయిన రంగారెడ్డి జిల్లా డిఎంహెచ్ఒ డాక్టర్ స్వర్ణకుమారి సహ ఇద్దరు ఉద్యోగులు

**హైదరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త:** సర్కారీ విభాగాల్లో ఉన్నతస్థానాల్లో వున్న వారు లంచాలు మేస్తూ ఎసిబికి పట్టుబడుతున్న ఉదంతాలు కొనసాగుతూనే వున్నాయి. రంగారెడ్డి జిల్లా డిఎంహెచ్ఓగా వున్న డాక్టర్ స్వర్ణ కుమారితో పాటు హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, కారు డ్రైవర్ కృ ష్ణయ్యలను లక్ష రూపాయల లంచం కేసులో ఎసిబి అధికారులు సోమవారం సాయంత్రం అరెస్టు చేశారు. శివార్లలోని శివరాంపల్లి బస్తీలో వు న్న రంగారెడ్డి జిల్లా డిఎంహెచ్ఓ కార్యాలయంలో ఈ ఘటన జరిగింది. జిల్లాలో అనధికారికంగా నడుస్తున్న ఫిజియోథెరపీ సెంటర్‌ను యధా విధిగా కొనసాగించేందుకు డిఎంహెచ్ఓ డాక్టర్ స్వర్ణకుమారి రెండు లక్షల రూపాయలు డిమాండ్ చేశారు. అయితే దీని నిర్వాహకుడు లక్ష రూపాయలు ఇచ్చేందుకు అంగీకరించి, దీనిపై ఎసిబి అధికారులకు సమాచారం అందించాడు.

దీనిపై పక్కాగా వ్యవహరించిన ఎసిబి అధికారులు సాయంత్రం నాలుగు గంటల సమయంలో డిఎంహెచ్ఓ కార్యాలయం వద్ద కాపుకాశారు. ఫిజియోథెరఫీ నిర్వాహకుడు లక్ష రూపాయలతో కారా ్యలయంలో వెళ్లి డిఎంహెచ్ఓ డాక్టర్ స్వర్ణ కుమారిని సంప్రదించగా ఆమె దీని గురించి హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్‌తో మాట్లాడాలని సూచించారు. అనంతరం బాధితుడు శ్రీనివాస్‌తో మాట్లాడగా లంచం సొమ్మును తన కారు డ్రైవర్ కృష్ణయ్యకు ఇవ్వాలని ఆదేశించాడు. దీని తరువాత బాధితుడు లక్ష రూపాయలను డ్రైవర్ కృష్ణయ్యకు ఇవ్వగానే సమీపంలోనే వున్న ఎసిబి అధికారులు ఒక్కసారిగా దాడిచేసి అతన్ని పట్టుకున్నారు . అనంతరం అతన్ని విచారించగా హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్ పేరు చెప్పాడు. హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్‌ను విచారించగా డిఎంహెచ్ఓ స్వర్ణ కుమారి బండారం రట్టయ్యింది. అనంతరం లంచం కేసులో డిఎంహెచ్ఓ స్వర్ణ కుమారితో పాటు హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, కారు డ్రైవర్ కృష్ణయ్యను అరెస్టు చేశారు. దీని తరువాత డిఎంహెచ్ఓ కార్యాలయంలో ఎసిబి అధికారులు సోదాలు చేసి కొన్ని పత్రాలను జప్తు చేశా రు. అనంతరం ముగ్గురిని అరెస్టు చేసి నాంపల్లి ఎసిబి కార్యాలయానికి తరలించి ప్రశ్నిస్తున్నారు.

వార్త

బలహీనమైన మనస్సు సంపద కిందనే గాక, పేదరికం కింద కూడా కృశించిపోతుంది.

- హేర్

# ఓటుహక్కు అజేయమేనా?

కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ వ్యవహారశైలిపై ఒక్కసారిగా అన్ని వైపుల నుంచీ ఆరోపణల దాడి మొదలైంది. ముగ్గురు కమిషనర్లు కలిసి ఉన్నంతకాలం అంతా గుంభనంగా ఉన్నా ఫారమ్ 6 అనంతరం కార్యాచరణ బెడిసికొట్టి అన్నీ సిఇసి జ్ఞానేశ్‌కుమార్ మెడకు చుట్టుకున్నాయి. నిన్నామొన్నా విపక్షాలు జంతర్ మంతర్ వద్ద జ్ఞానేశ్‌కుమార్ వ్యవహారంపై నినదిస్తూ ఆయన రాజీనామాకు డిమాండ్ చేశాయి. ఆలిండియా స్టూడెంట్ అసోసియేషన్ నేతలు, కార్యకర్తలు, మూడు రోజులుగా జంతర్ మంతర్ వద్ద కదంతొక్కాయి. నిరసనకారులను పోలీసులు ఈడ్చుకువెళ్లారు. బలవంతంగా వాహనాలు ఎక్కించి నిరసన కారులపై లాఠీలు ఝుళిపించారు. 'సర్' మీద తాజాగా వచ్చిన ఆరోపణల నేపథ్యంలో జ్ఞానేశ్ కుమార్ నిర్ణయాలు తిరగదోడే పరిస్థితి ఎదురయ్యింది. త్రిసభ్య కమిషనర్‌గా ఉన్న సిఇసిలో జ్ఞానేశ్‌కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారన్న ఆరోపణ ప్రధానమైనది. ఈ సందర్భంగానే ఈ మధ్యకాలంలో మిగతా ఇద్దరు కమిషనర్లు తమకు తెలియకుండానే 14 నిర్ణయాలు ఏకపక్షంగా జరిగిపోతున్నాయని గగ్గోలుపెట్టారు. ఆనక తమ నిర్ణయాలన్నీ సమిష్టివనే చెప్పుకున్నా, ఒకసారి బయటికొచ్చిన సంగతులు గందరగోళం లేకుండా మూసివేయబడవు. ఇప్పుడదే జరిగింది. ఇదిలా ఉండగా జ్ఞానేశ్ కుమార్‌ను వేలెట్టి చూపే అన్ని సంఘటనలు తాజాగా చర్చనీయాంశమయ్యాయి. జ్ఞానేశ్ కేరళం కేడర్ ఐఎఎస్ అధికారి. కేరళం స్టేట్ ట్రాన్స్‌పోర్టు ప్రాజెక్టులో గతంలో జరిగిన నిర్ణయాలపై విజిలెన్స్ విచారణకు కేరళ హోంమంత్రి రమేశ్ చెన్నితాల ఆదేశించారు. దేశవ్యాప్తంగా 'సర్' పేరిట ఎంతో మంది ఓటు హక్కు నిర్ణయాలపై ఏకపక్షంగా వ్యవహరించారన్న అంశంపై దేశమంతా అట్టుడికిపోతోంది. కేరళం ప్రాజెక్టులో అవకతవకలు జరగడం, అదే ప్రాజెక్టులో పనిచేసిన మలేసియా ఇంజినీర్ ఆత్మహత్య చేసుకోవడంతో ఆ కేసు విషయంలో కూడా జ్ఞానేశ్ పాత్రపై విచారణ జరిపే పరిస్థితి తెలిసింది. జ్ఞానేశ్ బిజెపికి అనుకూలంగా వ్యవహరించడం వలనే విపక్షాలు ఆరోపణలతో దండెత్తాయని తెలిసిందే. లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్షం కేరళంలో రాజ్యపాలన చేస్తున్నందున జ్ఞానేశ్ కుమార్ అల్లరిపాలు చేసే పనిని తన నెత్తినెత్తుకున్నట్లుంది. చాన్నాళ్ల క్రితం కేసులో జ్ఞానేశ్‌పై విచారణకు ఆదేశించడంపై సర్వత్రా చర్చనీయాంశమైంది. ఇలా ఒకదానికొకటి జ్ఞానేశ్‌ను ప్రశ్నిస్తున్నాయి. 2006లో కేరళంలోని అంగమాలి నుంచి తిరువనంతపురం వరకు 215 కోట్ల ప్రపంచ బ్యాంక్ నిధులతో చేపట్టిన పునర్నిర్మాణ పనుల విషయంలో దాన్ని చేపట్టిన మలేసియా సంస్థ ఇంజినీర్ పలు అవినీతి అవకతవకల ఆరోపణలు చేశారని, ఆ తర్వాత స్వదేశం వెళ్లి ఆత్మహత్య చేసుకున్నప్పుడు రాసిన సుసైడ్ లేఖల్లో జ్ఞానేశ్ పేరును ఉదహరించారన్నది ప్రధాన ఆరోపణ. ఇలాంటి అంశం బయటకు వచ్చిందంటే ఆయన పేరు ప్రతిష్ఠల మీద దాడి జరుగుతున్నట్టేననుకోవాలి. దీన్నిపాత విచారణకు ఇది కొనసాగింపేనని చెబుతున్నా దీని గమ్యం ఎటువైపునకు చేరుతుందో చెప్పలేం. జ్ఞానేశ్‌కు రాజ్యాంగ వెసులుబాటుఉందని చెబుతున్నా అది ఏ కేసులకు వర్తిస్తుందో మళ్లీ సుప్రీంకోర్టు నిర్ణయించాల్సిందే. ఏది ఏమయినా జ్ఞానేశ్‌కిది తలపోటు వ్యవహారమే. తాజాగా న్యాయవ్యవస్థ జోక్యానికి సిఇసిసర్ వ్యవహారం చేరడంతో జనం నోళ్లల్లో నానుతోంది. 'సర్' సామాన్యుడినే కాక అత్యున్నత స్థాయిలో ఉన్నవారి 'ఓటు హక్కు' మీద కూడా దాడి చేయడంతో ఎక్కడ చూసినా జ్ఞానేశ్‌పైనే చర్చ. ఇదిలా ఉండగా పౌరులను ఓటు హక్కు ఉన్నవారు లేని వారనే రెండు వర్గాలుగా విభజించడాన్ని భారత రాజ్యాంగం ఒప్పదని సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఉజ్వల్ భుయాన్ 'ఓటుహక్కు' విషయంలో ఎలాంటి అవకతవకలు జరిగినా సమర్థనీయం కాదని ఆదివారం హైదరాబాద్‌లో19వ నల్సార్ జస్టిస్ సాహ్నీ మెమోరియల్ మూట్‌కోర్టు పోటీల ముగింపు సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వివరించారు. కోట్లాది మందిని ఓటుహక్కుకుదూరం చేయడం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేశారు. భారతీయ పౌరుడి ఓటుహక్కు రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణంలో ఒక భాగమని స్పష్టం చేశారు. ఏదైనా ఓ ప్రక్రియ ద్వారా ఓటు హక్కుకు దూరమైతే ఓటు హక్కును కోల్పోయిన పౌరులు సొంతదేశంలోనే ద్వితీయ శ్రేణి పౌరులుగా మిగిలిపోతే ఆ నిర్ణయం ఏకపక్షమే అవుతుందన్నారు. సిఇసి నిర్దేశించిన 'సర్' ఓటుహక్కు ప్రమాణాలు తాజాగా సుప్రీం కోర్టులో వాదనలను ఎదుర్కొనాల్సి వచ్చింది. పరిపాలనా ప్రక్రియల ద్వారా పౌరుల ఓటుహక్కును హరించకూడదని రాజ్యాంగ బద్ధ నియమేనన్నది అందరూ విశ్వసించే విషయం. సుప్రీంకోర్టు గత తీర్పుల్లో ఓటుహక్కు అనేది రాజ్యాంగ బద్ధమైన హక్కుగానే పేర్కొంది. సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన కేంద్రఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, మరి ఇద్దరు ఎన్నికల కమిషనర్లకు నోటీసులు జారీ చేసింది. 'సర్' విషయంలో ఏకపక్ష నిర్ణయాలపై దాఖలైన పిటిషన్ల విచారణ సందర్భంగా అనేక విషయాలను స్పృశించింది. కేంద్రానికి కూడా సుప్రీంకోర్టు నోటీసులిచ్చింది. ఎంతో కీలకమైన అంశం అయినందునే తీవ్రంగా స్పందించింది. ఇప్పటికే ఎన్నికల వ్యవస్థ విశ్వసనీయతపై ఉన్న తీవ్ర ఆందోళనకు అద్దంపట్టే సంఘటనలు ఎన్నో జరిగాయి. ఎన్నికలసంఘానికి ఎన్ని అధికారాలున్నా ఓటుహక్కు తొలగించే విషయంలో తాతల తండ్రుల ఓటు హక్కు ప్రామాణికంగా తీసుకోరాదన్న చర్చకూడా నడుస్తోంది. ఎన్నికల సంఘ నిర్ణయాలు రాజ్యాంగానికి లోబడే ఉండాలంటూ తమ ముందు కొచ్చిన పిటిషన్లను సమీక్షించేందుకు అత్యున్నత ధర్మాసనం నిర్ణయించింది. జ్ఞానేశ్‌కుమార్ ఏమాత్రం ఏకపక్షంగా వ్యవహరించారని ఈ విచారణలో తేలినా ప్రభుత్వమే నవ్వులపాలయ్యే భయంలేకపోలేదు.



మరణం కన్నా మరణించబోతున్నామన్న భావన భయంకరమైనది.

హెన్రీ ఫీల్డింగ్



ప్రతి ఒక్కరూ తనకు నచ్చిన దారిలో స్వర్గానికి చేరాలి కనుక అన్ని మతాలను సహన భావంతో చూడాల్సిందే.

ఫ్రెడరిక్ ది గ్రేట్

## ప్రజావాక్కు



### మూఢనమ్మకాలను నమ్మవద్దు

కల్కి ఆశ్రమంలో కల్కి భార్య అయిన పద్మావతి ఫోటో నుండి విభూది, తేనె, మట్టి, మసానము రాలుతుందని ఒక ప్రచారం జరుగుతుంది. అది ఒక మూఢనమ్మకం. ఎవరు నమ్మవద్దు. అలాంటి మహిమలు ఉంటే కల్కి అనే మోసగాడు ఎందుకు చనిపోయాడు. ప్రజలు ఆలోచించాలి. వాళ్ళు సంపాదించిన ఆస్తిని కాపాడుకునేందుకు ఆశ్రమం వారు వేస్తున్న ఎత్తుగడ. ఫోటో నుండి ఏమి రాదు. అంతకు ముందు ఏదైనా పూసినట్లైతే, ఎండిన తరువాత రాలిపోతుంది. ఇలాంటి మూఢ నమ్మకాలను ప్రచారం చేస్తున్న కల్కి ఆశ్రమం వారిని అరెస్ట్ చేసి జైల్లో పెట్టాలి. మూఢనమ్మకాలను ప్రచారంచేసేవారిని అరెస్ట్‌చేసి, వాటిని అరికట్టడం ప్రభుత్వబాధ్యత. ఇలాంటి వారిని ది డ్రగ్స్ అండ్‌మ్యాజిక్‌రెమెడీ యాక్ట్1954క్రింద అరెస్ట్ చెయ్యాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### పెరుగుతున్న నిరుద్యోగులు

2047 నాటికి భారతదేశాన్ని వికసిత దేశంగా తీర్చిదిద్దాలన్నలక్ష్యంఎంత గొప్పదైనా, దాని విజయాన్ని కేవలం జీడీపీ గణాంకాలు లేదామౌలిక వసతుల ఆధారంగా కొలవలేం. దేశ యువతకునాణ్యమైన, స్థిరమైన, గౌరవప్రదమైనఉపాధి అవకాశాలు కల్పించినప్పుడే ఆ లక్ష్యానికి నిజమైన అర్థంలభిస్తుంది. భారతదేశం ప్రపంచంలోనే అతి పెద్ద యువ జనాభా కలిగిన దేశం. జనాభాలో సుమారు 65 శాతం మంది 35 ఏళ్లలోపు వారే. ఈ యువశక్తిని సరైన దిశలో వినియోగించగలిగితే అది అభివృద్ధికి బలమైన ఇంధనంగా మారుతుంది. అయితే యువతకు తగిన ఉపాధి అవకాశాలు కల్పించలేకపోతే ఇదే జనాభా వరం భారంగా మారేప్రమాదంఉంది. విద్యావంతులైన యువతలో నిరుద్యోగిత అధికంగా ఉండటం ఆందోళనకరం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ప్రజలు ముందుండాలి

జమ్మూ రాష్ట్రానికి తిరిగి ఆహోదా కల్పించాలానే డిమాండ్ చాలాకాలంగా ఉంది. జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర హోదాను తొలగించి దానిని కేంద్రపాలిత ప్రాంతం చేసి ఆ రాష్ట్రాన్ని రెండుగా విభజించి అనిల్ బైజుల్‌ను లెఫ్టెంట్‌గా చేసి సున్నిత ప్రాంతం ఉగ్రవాద ప్రేరేపితం అని చెప్పి, మసి పూసి మారేడు కాయ చేసిన కేంద్రం అవసరం అయినా సమయంలో మళ్ళీ రాష్ట్ర హోదా పునరుద్దరించడం అని చెపుతూ వస్తుంది.

-భారత అవినాష్, జనగామ

### మన బాధ్యత

మెట్రో రైలు మన ప్రయాణాన్ని సులభంగా, వేగంగా చేస్తోంది. అయితే కొందరు తలుపుల పక్కనే నిలబడి ఉండటం వల్ల రైలులోకి ఎక్కేవారికి, దిగేవారికి ఇబ్బంది కలుగుతోంది. రైలులో తలుపుల దగ్గర నిలబడవద్దని పదేపదే ప్రకటనలు వస్తున్నా, కొందరు వాటిని పట్టించుకోకుండా అక్కడే నిలబడుతున్నారు. దయచేసి తలుపుల పక్కన నిలబడకుండా కొంచెం లోపలికి వెళ్లినిలబడండి. ముఖ్యంగా రద్దీ సమయంలో తలుపుల దగ్గర ఖాళీగా ఉంచడం చాలా అవసరం. లేకపోతే దిగాల్సిన స్టేషన్ వచ్చినప్పుడు ఇతరులు సులభంగా బయటకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. మనం కొంచెం వెనక్కి జరిగి నిలబడితే ఎక్కేవారికి, దిగేవారికి సౌకర్యంగా ఉంటుంది. ముందుగా దిగేవారికి దారి ఇచ్చి, తరువాత ఎక్కడం అందరికీ మంచి పద్ధతి. చిన్న సహకారం వల్ల ప్రయాణం మరింత సౌకర్యంగా మారుతుంది. ఇతర ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా బాధ్యతగా వ్యవహరించాలి.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఉద్యోగులకు లేదా ఉపాధ్యాయులకుకు ప్రమోషన్ సీనియారిటీ బేస్మెంట్ కావాలి. కానీ సీనియారిటీలో అనేక కేటగిరిస్ తీసుకొని అందులో సీనియర్స్‌ని కేటగిరి వైజ్ ముందు పెడుతున్నారు. ఒక్కొక్కసంవత్సరం ఒక్కోవిధంగా పెడుతున్నారు. తత్‌ఫలితంగా సీనియర్ మోస్ట్ ఉద్యోగులు ఉపాధ్యాయులు ఎలాంటి ప్రమోషన్‌కు నోచుకోకుండా ఉద్యోగ విరమణ చేయవలసి వస్తూ ఉన్నది. పదవీ విరమణ ఒక అందని ద్రాక్షగా మారిపోయింది. ఈ సమస్యను పరిష్కరించాలి.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### బ్యాంకు ఖాతాదారుల విజ్ఞప్తి

స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా ఖాతాదారులు బ్యాంక్ అధికారులు చేస్తున్న తప్పిదలతో చాలా ఇబ్బంది పడుతున్నారు. కేవలం ఇద్దరు వ్యక్తులు ఒకే పేరుకలిగి ఉండడం వలన అధికారులు తప్పిదం వలన ఒకరు లాభం జరిగి ఒకరికి నష్టం చాలా జరుగుతుంది. ఇద్దరు వ్యకులు వేరు వేరు. బ్యాంక్ అకౌంట్ నెంబర్, ఇతర వివరాలన్నీ వేరువేరు. ఒక వ్యక్తి కొన్ని బ్యాంక్‌ల ద్వారా అప్పుగా తీసుకొన్న డబ్బులు ఇంకో వ్యక్తి ఖాతాలో చూపెట్టడం చాలాఅన్యాయం. ఇద్దరు వ్యక్తు లువేరు వేరు అయినా కూడా రెండవ వ్యక్తికి అప్పు ఇవ్వడం లేదు. ఇబ్బంది పెడుతున్నారు.

- కదురు శ్రీనివాస్, వరంగల్

# 'చిప్‌ఫ్లేషన్'తో భారత్‌కు కొత్త సవాళ్లు!

**ప్రయోగశాలలో రూపొందించిన ప్రాసెసర్ మార్కెట్‌లో ఉపయోగించే ఉత్పత్తిగా మారినప్పుడే దాని అసలు విలువ తెలుస్తుంది. దేశీయ కంపెనీలు దాన్ని ఉపయోగించాలి. దానికి అవసరమైన సాఫ్ట్‌వేర్ అందుబాటులో ఉండాలి. పెద్ద సంఖ్యలో తయారు చేయగల సామర్థ్యం రావాలి. ఇందుకు పరిశోధనతో పాటు నిపుణుల తయారీ, పెట్టుబడులు, తయారీ సదుపాయాలు అవసరం. ప్రభుత్వ సంస్థలు, దేశీయ కంపెనీలు ఉపయోగించగలిగిన చోట స్వదేశీ సాంకేతికతకు తొలి అవకాశాలు ఇవ్వడం కూడా ఈ వ్యవస్థ పెరగడానికి ఉపయోగపడుతుంది. చిప్‌ఫ్లేషన్ భారత్‌కు ఒక విషయం స్పష్టం చేస్తోంది. ప్రపంచంతో కలిసి నడవడం అవసరమే. కానీ కీలకమైన సాంకేతికత కోసం పూర్తిగా ఇతరదేశాలపైనే ఆధారపడటం ప్రమాదకరం. ఎలక్ట్రానిక్స్ తయారీలో భారత్ ఇప్పటికే పెద్ద అడుగు వేసింది. ఇక ఆ పరికరాల వెనుక ఉన్న భాగాలు, పరిజ్ఞానం కూడా దేశంలో పెరగాలి. ప్రపంచంలో చిప్‌లధరలు పెరిగిన ప్రతిసారీ భారత పరిశ్రమ ఇబ్బందుల్లో పడకుండా ఉండాలంటే దిగుమతులను ఆపడం కాదు, అవసరమైన చోట దేశీయ సామర్థ్యాన్ని పెంచుకోవడమే మార్గం.**

డి జె మోహన రావు

కృత్రిమ మేధ విస్తరణ ఇప్పుడు చిప్‌ల ధరలపైనా ప్రభావం చూపుతోంది. చిప్‌లకు డిమాండ్ పెరిగిన వేగానికి తగ్గట్టుగా వాటి తయారీ పెరగకపోవడంతో ధరలు పెరగడాన్నే 'చిప్‌ఫ్లేషన్' అంటున్నారు. ఏఐ కోసం నిర్మిస్తున్న భారీ సమాచార కేంద్రాలకు పెద్ద మొత్తంలో డేటాను నిల్వ చేయడానికి, వేగంగా పనిచేయడానికి అవసరమైన చిప్‌లు కావాలి. దీంతో తయారీ సంస్థలు వాటికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఫలితంగా ఫోన్లు, కంప్యూటర్లలో ఉపయోగించే సాధారణ చిప్‌ల సరఫరాపైనా ఒత్తిడి పెరుగుతోంది. 2026 మూడో త్రైమాసికంలో సాధారణ మెమరీ చిప్‌ల ధరలు 13-18 శాతం, డేటాను నిల్వ చేసే చిప్‌ల ధరలు 10-15 శాతం పెరగవచ్చని అంచనాలున్నాయి. అంటే ఏఐ విస్తరణకు సాంకేతిక ప్రయోజనాలతో పాటు అదనపు ఖర్చు కూడా తోడవుతోంది. ఇది సాధారణంగా వచ్చిపోయే ధరల పెరుగుదల కాదు. ఏఐ అవసరాలు కొన్ని నెలల్లోనే వేగంగా పెరుగుతున్నాయి. కానీ కొత్త చిప్‌తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి సంవత్సరాలు పడతాయి. భారీ పెట్టుబడులు, ఖరీదైన యంత్రాలు, ప్రత్యేక నైపుణ్యం ఉన్న సిబ్బంది అవసరం. దీంతో తయారీ సంస్థలు ఎక్కువ డిమాండ్ ఉన్న ఏఐ, సమాచార కేంద్రాల అవసరాలకే తమ సామర్థ్యాన్ని మళ్లిస్తున్నాయి. ఫలితంగా సాధారణ పరికరాలకు అవసరమైన చిప్‌లు ఖరీదవుతున్నాయి. సాంకేతికతను చౌకగా చేసి పనితీరును పెంచాల్సిన ఏఐ దాన్ని నడిపించే పరికరాలను మాత్రం ఖరీదుగా మారుస్తున్న విరుద్ధ పరిస్థితి ఇది. దీని ప్రభావం వినియోగదారుడి వరకు చేరుతోంది. ఫోన్‌లో ఉపయోగించే చిప్‌ల ధర పెరిగితే తయారీ ఖర్చు పెరుగుతుంది. ఆ భారాన్ని కంపెనీ భరించాలి లేదా ఫోన్ ధర పెంచాలి. భారత్‌లో 2026 రెండో త్రైమాసికంలో స్మార్ట్‌ఫోన్ రవాణాలు ఏడాది క్రితంతో పోలిస్తే 13 శాతం తగ్గి 3.39 కోట్లకు చేరాయి. పెరుగుతున్న చిప్ ఖర్చులు, ఫోన్ల ధరలు పెరగడం, కొనుగోలుదారులపై భారం పెరగడం ఇందుకు కారణాల్లో ఉన్నాయి. షియోమీ ఫోన్ రవాణాలు 26 శాతం తగ్గాయి. అయితే సమస్య ఫోన్లతో ముగియదు. కార్లు, విద్యుత్ వాహనాలు, టెలికాం పరికరాలు, వైద్య యంత్రాలు, పరిశ్రమల్లో ఉపయోగించే యంత్రాలు, రక్షణ పరికరాలు, విద్యుత్ రంగం ఇలా అనేక రంగాల్లో చిప్‌లు కీలకంగా మారాయి. చిప్‌ల ధరలు ఎక్కువకాలం పెరిగితే తయారీ ఖర్చులు, పెట్టుబడులపైనా ప్రభావం పడుతుంది. భారత్‌కు ఈ సమస్య మరింత ముఖ్యమైనది. దేశంలో ఎలక్ట్రానిక్స్ తయారీ వేగంగా పెరిగింది. 2025-26లో ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి రూ.13.11 లక్షల కోట్లకు, ఎగుమతులు రూ.4.24 లక్షల కోట్లకు, మొబైల్ ఫోన్ ఉత్పత్తి రూ.6.27 లక్షల కోట్లకు చేరాయి. దేశంలోనే తయారయ్యే భాగాల వాటాకూడా పెరుగుతోంది. అయినా ఫోన్లు, కంప్యూటర్లు, ఇతర పరికరాలకు అవసరమైన మెమరీ, ప్రాసెసర్లు, ఇతర ముఖ్యమైన భాగాల కోసం విదేశాలపై ఆధారపడాల్సి వస్తోంది. అందువల్ల ప్రపంచంలో చిప్‌ల ధరలు పెరిగితే ఆ



ప్రభావం భారత తయారీ సంస్థలకు కూడా చేరుతుంది. దేశంలో పరికరాన్ని తయారు చేస్తున్నామా అన్నదే కాదు దాని వెనుక ఉన్న ముఖ్యమైన భాగాలను ఎంతవరకు మనమే తయారు చేయగలుగుతున్నా మన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న. ఈ నేపథ్యంలో 'శక్తి'వంటి దేశీయ ప్రయత్నాలకు ప్రాధాన్యం ఉంది. ఐఐటీ మద్రాస్ అభివృద్ధి చేస్తున్న 'శక్తి' కార్యక్రమం ద్వారా కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల్లో కీలకంగా పనిచేసే ప్రాసెసర్లను దేశంలోనే రూపొందించే సామర్థ్యాన్ని పెంచుకోవాలని ప్రయత్నిస్తున్నారు. సులభంగా చెప్పాలంటే, పరికరానికి ఏ పని చేయాలో ఆదేశించే కీలక భాగాన్ని మనమే రూపొందించుకో వాలన్న ప్రయత్నం ఇది. ప్రపంచంలో ఏర్పడిన చిప్ కొరతను శక్తి వెంటనే తీర్చదు. కానీ ఇలాంటి ముఖ్యమైన సాంకేతికత కోసం పూర్తిగా ఇతర దేశాలపైనే ఆధారపడే పరిస్థితిని తగ్గించగలదు. ఐఐటీ మద్రాస్, ఇస్రో కలిసి అభివృద్ధిచేసిన ఐరిస్ చిప్ అంతరిక్ష, వ్యూహాత్మక అవసరాల్లో దేశీయరూప కల్పనను ఉపయోగించుకునే అవకాశం ఉందని చూపించింది. అయితే చిప్‌ను రూపొందించడం ఒక్కటే సరిపోదు. దాన్ని పెద్ద సంఖ్యలో తయారు చేయాలి. నాణ్యతను పరీక్షించాలి. ఇతర భాగాలతో కలిపి పరికరాల్లో ఉపయో గించాలి. కంపెనీలు వాటిని మార్కెట్‌లోకి తీసుకురావాలి. అందుకే భారత్ తాను ఉపయోగించే ప్రతి చిప్‌ను దేశంలోనే తయారు చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్లాల్సిన అవసరం లేదు. మనకు బలమైన అవకాశం ఉన్నరంగాల్లో ప్రపంచస్థాయి సామర్థ్యాన్ని సాధించడం ముఖ్యం. ఇతర దేశాల నుంచి తెచ్చుకునే భాగాలకు ప్రత్యామ్నాయ సరఫరా మార్గాలను కూడా సిద్ధంగా ఉంచుకోవాలి. ఒక్క దేశం లేదా ఒక్క సంస్థపైఅధికంగా ఆధారపడకుండా చూడాలి. ఇక్కడ ప్రభుత్వానికి మరో పెద్ద పరీక్ష ఉంది. ప్రాజెక్టులను ప్రకటించడం, పెట్టుబడులకు అనుమతులు ఇవ్వడం ఒక విషయం, వాటిని విజయవంతమైన పరిశ్రమలుగా మార్చడం మరో విషయం. కర్మాగారాలు సమయానికి రావాలి. ఉత్పత్తి ప్రారంభం కావాలి. భారతీయ కంపెనీలు ప్రపంచ మార్కెట్‌లో పోటీ పడగల ఉత్పత్తులు తయారు చేయాలి. దేశంలో పరిశోధన పెరగాలి. నైపుణ్యం ఉన్న యువతకు అవకాశాలు రావాలి. ముఖ్యమైన భాగాలను తయారు చేసే సంస్థలు పెరగాలి. ప్రభుత్వ సాయం ఉన్నంతకాలమే కాకుండా ఆ సాయం తగ్గిన తర్వాత కూడా ఈ పరిశ్రమలు తమంతట తాము నిలబడగలగాలి. ఇదే పరీక్ష శక్తికీ వర్తిస్తుంది. ప్రయోగశాలలో రూపొందించిన ప్రాసెసర్ మార్కెట్‌లో ఉపయోగించే ఉత్పత్తిగా మారినప్పుడే దాని అసలు విలువ తెలుస్తుంది. దేశీయ కంపెనీలు దాన్ని ఉపయోగించాలి. దానికి అవసరమైన సాఫ్ట్‌వేర్ అందుబాటులో ఉండాలి. పెద్ద సంఖ్యలో తయారు చేయగల సామర్థ్యం రావాలి. ఇందుకు పరిశోధనతో పాటు నిపుణుల తయారీ, పెట్టుబడులు, తయారీ సదుపాయాలు అవసరం. ప్రభుత్వ సంస్థలు, దేశీయ కంపెనీలు ఉపయోగించగలిగిన చోట స్వదేశీ సాంకేతికతకు తొలి అవకాశాలు ఇవ్వడం కూడా ఈవ్యవస్థ పెరగడానికి ఉపయోగపడుతుంది. చిప్‌ఫ్లేషన్ భారత్‌కు ఒక విషయం స్పష్టం చేస్తోంది. ప్రపంచంతో కలిసి నడవడం అవసరమే. కానీ కీలకమైన సాంకేతికత కోసం పూర్తిగా ఇతరదేశాలపైనే ఆధారపడటం ప్రమాదకరం. ఎలక్ట్రానిక్స్ తయారీలో భారత్ ఇప్పటికే పెద్ద అడుగువేసింది. ఇక ఆ పరికరాల వెనుక ఉన్న భాగాలు, పరిజ్ఞానం కూడా దేశంలో పెరగాలి. ప్రపంచంలో చిప్‌లధరలు పెరిగిన ప్రతిసారీ భారత పరిశ్రమ ఇబ్బందుల్లో పడకుండా ఉండాలంటే దిగుమతులను ఆపడంకాదు, అవసరమైన చోటదేశీయ సామర్థ్యాన్ని పెంచుకోవడమే మార్గం. ●

# విఫలమైనా అమెరికా వెనక్కి తగ్గదా?

భాగ్యనగర్ భాస్కర్‌కుమార్

అమెరికా, ఇజ్రాయెల్ రెండు దేశాలు ఏ లక్ష్యసాధన కోసం ఇరాన్‌పై యుద్ధం ఈ సంవత్సరం మొదలు పెట్టాయో అవి సాధించడంలో విఫలం కాగా ఫ్లైదుబాయ్ వంటి ఘటనలు తెరపైకి వచ్చి యుద్ధం ఏ రూపంలో సామాన్యుడిని మూల్యం చెల్లించుకొనేలా చేస్తుందో అనే అభద్రతకు ప్రపంచంలోని మానవాళిని నెట్టింది. ఇరాన్‌ను అణ్వాయుధాలను తయారు చేయకుండా నిరోధించడంపైకి కనపడే ఉద్దేశ్యమే కానీ, అక్కడి ప్రభుత్వం ప్రపంచపటంలో ఆదేశం లేకుండా చేయలన్నదే అగ్రరాజ్యం అసలుఉద్దేశ్యం. ఇరాన్ తన పౌర అణుకార్యక్రమాన్ని దుర్వినియోగం చేయలేదనీ అంతర్జాతీయ అటామిక్ ఎనర్జీఏజెన్సీ భద్రతలఅనుగుణంగా వ్యవహరిస్తోందని నిజనిర్ధారణ తనిఖీ సూచిస్తుంది. ఇరాన్ 2015లో అణు ఒప్పందానికి కూడా ఇష్టపూర్వకంగా అంగీకరించింది. ఇరాన్‌తో కుదుర్చుకున్న చారిత్రత్మక ఒప్పందం నుంచి వైదొలుగుతున్నట్లు 2018 మే8 అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అమెరికా ఆంక్షలుపెట్టి ఇరాన్‌ను ఇరాకాటంలో పెట్టడానికి అనేక విధాలుగా ప్రయత్నించింది. చర్చలు జరుగుతున్న దశలోనేఇజ్రాయెల్ జూన్ 2025లో ఇరాన్‌పై దాడి చేసింది, ఫలితంగా 12 రోజుల యుద్ధం జరిగింది. ఇరాన్‌ను లొంగదీసుకోవడంలో విఫలమైనందున, అమెరికా ,ఇజ్రాయెల్ మళ్ళీ ఫిబ్రవరి 28న ఇరాన్‌పై ఉమ్మడి దాడులను ప్రారంభించాయి, ఇరాన్ నాయకులను అనేక మందిని చంపారు. 40 రోజులపాటు ఇరాన్ పౌర మౌలిక వసతులపై కనికరం లేకుండా బాంబు దాడి చేశారు. ఇరాన్ అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక (ఎన్‌పిటి) ఒప్పందంలో ఉండి, తాను అణుబాంబును నిర్మించడం లేదని పేర్కొంది. అమెరికా ఇంతగా వెంటాడి వేధించినా అణ్వాయుధ కార్యక్రమాన్ని కొనసాగించవద్దని సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ఇచ్చిన ఆదేశాలకు ప్రపంచం పెద్దఎత్తున కృతజ్ఞతలు తెలుపాల్సిన అంశం కూడా. టెహ్రాన్ అణుకార్యక్రమం ఈ సంవత్సరం ఇరాన్‌పై దాడి చేయడానికి ఒకసాకు మాత్రమేనని దీని అర్థం. హమాస్ హిజ్బుల్లాలను బలహీనపరిచిన తరువాత, ఇజ్రాయెల్ 'గ్రేటర్ ఇజ్రాయెల్'ను స్థాపించాలనే ఆలోచనను ప్రారంభించింది. ఇరాన్ ప్రభుత్వం తన ఆశయాలకుప్రధాన అడ్డంకిగా ఉంది. జూన్ 2025లో ఇరాన్ ప్రభుత్వాన్ని తొలగించేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమైనందున, ఫిబ్రవరి 28న ఇరాన్‌పై ఉమ్మడి దాడి చేసేందుకు నెతన్యాహు ట్రంప్‌ను ఒప్పించారు. ఈ దుస్సాహసానికి అంగీకరించేలా రెండు అంశాలు ట్రంప్‌ను ప్రోత్సహించినట్లు తెలుస్తోంది. అతను జనవరిలో వెనిజులాలో అధ్యక్షుడు నికోలస్ మదురో ప్రభుత్వాన్ని విజయవంతంగా తొలగించాడు. ద్రవ్యోల్బణం కారణంగా ఇరాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అక్కడి ప్రజలు భారీ నిరసనలను చేపట్టడం చూసింది. ఇదే అదనుగా భావించి అమెరికా సంయుక్త రాష్ట్రాలు, ఇజ్రాయెల్ నాయకత్వం కొన్నిరోజుల్లో ఇరాన్ పాలనను తుడిచిపెట్టగలదని తప్పుగా అంచనా వేసింది. ఇరాన్‌కు సంబంధించి సుదూర క్షిపణి కార్యక్రమాన్ని నాశనం చేయడంలో అమెరికా విఫలమైంది. ఇరాన్ యాక్సిస్ ఆఫ్ రెసిస్టెన్స్‌ను బలహీనపరచడంలో విజయం అమెరికా, ఇజ్రాయిల్ సాధించారు. ఇరాన్ పై పెద్దఎత్తున దాడులు చేసి నాయకత్వం నిర్మూలించినా, మౌలికవసతులు ధ్వంసం చేసినా, ఆర్థిక నష్టం చేసినా నిండా మునిగిన వాడికి చలి ఉండదన్న రీతిలో మారింది. మరో వైపు ఇరాకీ మిలీషియాలు సౌదీ అరేబియా తూర్పుపశ్చిమ పైప్‌లైన్‌ను లక్ష్యంగా చేసుకొని దాడులు చేసి నష్టపరిచారు. యెమెన్‌లోని హౌతీలు సౌదీ నగరాలు, చమురు సంస్థాపనలపై దాడి చేయడంతో యుద్ధంను ఇరాన్ సమాంతరంగావిస్తరించింది. ఎర్ర సముద్రం వెంబడి ఉన్న అన్ని కీలక స్థానాలు, దీవులను హౌతీలు స్వాధీనం చేసుకున్నందున బాబ్ అల్ మండేబ్ కూడా మూసివేసే ప్రమాదం ఏర్పడింది. ఇప్పటికే భద్రత ప్రశ్నార్థకంగా మారి ఐరోపా ఆసియా దేశాలనౌకలు ఆఫ్రికా నుంచి రావాల్సివస్తోంది. చమురు ధరల పెరుగుదలతో, చాలా దేశాలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులనుఎదుర్కొన్నాయి. స్వయం ప్రకటిత విశ్వగురువు భారతదేశం మన దేశంలో సైనిక విన్యాసంలో పాల్గొని స్వదేశానికి బయలుదేరిన ఇరాన్ నావికాదళం నౌకను ముంచి అనేకమంది చావుకు కారణమైన అమెరికా తెంపరితనాన్ని ఖండించకపోవడం విషాదం. అక్టోబరు 27న ఇజ్రాయెల్ పార్లమెంటరీ ఎన్నికలు, నవంబర్ 3న అమెరికాలో మధ్యంతర కాంగ్రెషనల్ ఎన్నికలు జరగనుండగా, ఇరాన్‌తో యుద్ధాన్ని ఎలా ఉభయకుశలోపరి అనే రీతిలో ముగించడానికి అమెరికా ఆలోచిస్తోంది. మరో పెద్దఎత్తున సైనిక దాడిని ఆశ్రయించాలనే కసరత్తుకూడా చేస్తోందినీ ఇరాన్ ఆరోపణనతో యుద్ధ సన్నద్ధతకు పిలుపునిచ్చింది. ఇంతకుముందు సైనిక సంఘర్షణతో ఏమి జరిగిందో మననం చేసుకొని, మరొక ఘర్షణ వేరే ఫలితాన్ని ఇచ్చేఅవకాశం లేదని అమెరికా తోకముడుచుకొని కూర్చొంటే దానికి, ప్రపంచానికి, పర్యావరణానికి మంచిది. పాకిస్థాన్, ఖతార్, చైనా ఇతరులు శాంతి కోసం తమ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. చైనా, గల్ఫ్‌నుండి వచ్చే చమురు ప్రవాహాలపై ఎక్కువగా ఆధారపడినందున 2023లో ఇరాన్ సౌదీ అరేబియా మధ్య సయోధ్యకలిగేందుకు విజయవంతంగా మధ్యవర్తిత్వం వహించింది. అదే స్ఫూర్తితో చైనా మధ్యవర్తిగా అడుగుపెట్టవలసిన సమయం ఆసన్నమైందనీ పశ్చిమాసియా ప్రజలు భావిస్తున్నారు. ●

# వ్యవసాయంలో 'అంతర్జాతీయ దారి'లోకి ఎపి

నీరుకొండ ప్రసాద్

నాడు హైదరాబాద్‌లో ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బి)ఏర్పాటుకు చొరవ చూపి ప్రపంచ స్థాయి మేనేజ్‌మెంట్ విద్యను హైదరాబాద్‌కు తీసుకురావడం ద్వారా యువతలో నాయకత్వం, వ్యాపార దక్షత, అంతర్జాతీయ ఆలోచనా విధానానికి వేదికను నిర్మించిన చంద్రబాబు నేడు తన దూరదృష్టిని మరో కీలక రంగం వ్యవసాయం వైపు మళ్లించారు. అందుకే ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బి)నుంచి ఇంటర్ నేషనల్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ దిశగా ఆలోచన చేసారు. ఇది వ్యవసాయాన్ని ఒక కొత్త ఆర్థిక శక్తిగా మలిచే ఆలోచన అని చెప్పాలి. రాయలసీమను ఉద్యాన హబ్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో రూ. లక్ష కోట్ల భారీ ప్రణాళిక సిద్ధం చేసింది కూటమి ప్రభుత్వం. ఇది ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ తరహాలో ఆధునిక వ్యవసాయ విద్య, పరిశోధన, అగ్రిబిజినెస్, మార్కెట్ ఇంటెలిజెన్స్‌పై దృష్టి పెట్టే సంస్థగా రూపుదిద్దుకోనున్నది. రిలయన్స్ భాగస్వామ్యంతో మదనపల్లె గడ్డపై రూపుదిద్దుకోబోతున్న ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ నేటి తరానికి, భావి భారత వ్యవసాయ రంగానికి ఒక అక్షయ పాత్రగా నిలవనుంది. చంద్రబాబు దూరదృష్టికి, రిలయన్స్ పారిశ్రామిక శక్తి తోడైతే ఫలితం ఎలా ఉంటుందో గతంలో ఐటీ రంగం నిరూపించింది. ఇప్పుడు అదే మ్యాజిక్ ఉద్యాన రంగంలో పునరావృతం కాబోతోంది. ఈ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ రాయలసీమ అన్నదాతల తలరాతను మార్చి, దేశపటంలో ఈ ప్రాంతాన్ని గర్వంగా తలెత్తుకునేలా చేసే సరికొత్త మైలురాయి కానున్నది. రైతులను చాంపియన్‌ఫార్మర్స్‌గా తీర్చిదిద్దే దిశగా! కరువు సీమను గ్లోబల్ ఫ్రూట్ బౌల్‌గా మార్చే ఆలోచనతో గతంలో బిజినెస్ మేధావులను తయారు చేసిన మోడల్‌లోనే, నేడు వ్యవసాయాన్ని సైన్సుతో, టెక్నాలజీతో ముడిపెట్టేందుకు రిలయన్స్ భాగస్వామ్యంతో ఈ అంతర్జాతీయ వ్యవసాయ పాఠశాలను ఏర్పాటు చేస్తున్నారు. వ్యవసాయాన్ని కేవలం సంప్రదాయ పద్ధతుల్లో కాకుండా, ఆధునిక వ్యాపార దృక్పథంతో లాభసాటిగా మార్చేందుకు కార్పొరేట్ రీసెర్చ్ ఇది. రాయలసీమ అనగానే మన మెదళ్లలో మెదిలే బతుకుదెరువు కోసం తరలివెళ్లే వలసజీవుల దృశ్యాలే. నేడు ఆనిరాశాజనక చరిత్రకు చరమ గీతం పాడుతూ, అదే రాయలసీమను ప్రపంచస్థాయి ఉద్యాన పంటల కేంద్రంగా గ్లోబల్ ఫ్రూట్ బౌల్ మార్చేందుకుసరికొత్త ప్రణాళిక రూపొందించారు. సియం చంద్రబాబు ఆలోచనల నుంచి పురుడుపోసుకున్న 'రైజింగ్ రాయలసీమ' ఈ ప్రాంతంలో ప్రపంచస్థాయి ఉద్యాన పంటల కేంద్రంగా మార్చాలనే లక్ష్యంతో పండ్ల తోటలు, ఉద్యాన పంటలు, మైక్రో ఇరిగేషన్, ఫుడ్ ప్రాసెసింగ్, ఎగుమతులు, ఆధునిక




వ్యవసాయ సాంకేతికత గుర్తుకు వచ్చేలా ఒక కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతున్నారు. కరవును కేవలం సమస్యగా చూడకుండా, అందుబాటులో ఉన్న నేల, వాతా వరణం, రైతుల అనుభవాన్ని ఆర్థికఅవకాశంగా మలిచే దిశగా గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌రైజింగ్ రాయలసీమ కార్యక్రమం రూపుదిద్దుకొంటుంది. రాయలసీమ ఉద్యాన రంగాన్ని ప్రపంచస్థాయికి తీసుకెళ్లేందుకు మూడేళ్లలో దాదాపు రూ.లక్ష కోట్ల పెట్టుబడుల ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందులో సుమారు రూ.40,352 కోట్లు ప్రభుత్వ పెట్టుబడిగా, మరో రూ.60 వేల కోట్ల వరకు ప్రైవేటు పెట్టుబడులను సమీకరించాలన్నది లక్ష్యం. ఈ ప్రణాళిక కేవలం ఒక ప్రాంతానికో, ఒకపంటకో పరిమితం కాకుండా 10 జిల్లాల్లో 201 క్లస్టర్లుగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ పెట్టుబడుల్లో మూడు కీలక రంగాలకు భారీకేటాయింపులు చేశారు. సాగునీటి రంగానికి సుమారు రూ.20,884 కోట్లు, ఉద్యానరంగానికి రూ.14,906 కోట్లు, గ్రామీణ రహదారుల అభివృద్ధికి రూ.4,562 కోట్లకుపైగా కేటాయింపులు ప్రతిపాదన చేశారు. ఇది నీరు, రహదారి, ఉత్పత్తి, నిల్వ, రవాణా, మార్కెటింగ్ వరకు మొత్తం వ్యవస్థను అనుసంధానించే ప్రయత్నం అని చెప్పాలి. వ్యవసాయాన్ని వృత్తిగా మాత్రమే కాకుండా విలువ సృష్టించే పరిశ్రమగా, రైతును లబ్ధిదారుడిగా మాత్రమే కాకుండా ఆర్థిక భాగస్వామిగా, పంటను ఉత్పత్తిగా మాత్రమే కాకుండా ప్రపంచ మార్కెట్‌లో పోటీ పడే బ్రాండ్‌గా మార్చగలిగితేనే వ్యవసాయానికి నిజమైన భరోసా లభిస్తుంది. వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు దేశంలో ఇప్పటికే ఉన్నాయి. కానీ ప్రపంచ స్థాయి వ్యవసాయ విద్య, ఆధునిక ఉద్యాన సాంకేతికత, అగ్రి బిజినెస్, ఫుడ్ ప్రాసెసింగ్, ఎగుమతులు, అంతర్జాతీయ మార్కెట్ అవసరాలను ఒకే వ్యవస్థలో అనుసంధానం చేయడం ద్వారా కొత్త తరహా మోడల్‌ను నిర్మించవచ్చు. గ్లోబల్ మార్కెట్ అనుసంధానం వల్ల స్థానిక రైతులు పండించే ఉద్యాన పంటలకు అంతర్జాతీయ స్థాయి మార్కెట్ వసతులు, కోల్డ్ స్టోరేజ్ చైను, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి ఇది వేదిక కానుంది. కేవలం వ్యవసాయం చేయడమే కాకుండా, అగ్రికల్చర్ బిజినెస్, ఫుడ్‌ప్రాసెసింగ్ రంగాల్లో సరికొత్త ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి. వలస ప్రాంతాలుగా పేరున్న రాయలసీమ జిల్లాలను ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఇండియాగా, అంతర్జాతీయ ఉద్యాన ఎగుమతుల కేంద్రంగా మార్చడమే ఈ భారీ ప్రణాళిక ప్రధాన ఉద్దేశం. 'ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ బిజినెస్' ద్వారా మేధావులను, పారిశ్రామికవేత్తలను తయారు చేసిన చంద్రబాబు ఇప్పుడు 'ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్' భావనతో రైతన్నను ఒక వ్యాపారవేత్తగా, ఆర్థిక శక్తిగా మార్చే ప్రయత్నం చేస్తున్నారు. సంప్రదాయ సాగు పద్ధతులకు చరమ గీతం పాడి, ఆధునిక సాంకేతికత, వ్యాపార దృక్పథం తోడైతేనే రైతన్న తలరాత మారుతుందనడానికి ఈ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ నిదర్శనంగా నిలవనుంది. రిలయన్స్ భాగస్వామ్యంతో ఏర్పాటుకానున్న అంతర్జాతీయ వ్యవసాయ పాఠశాలకేవలం చదువుల కేంద్రమే కాదు, రాయలసీమ యువతకు, రైతులకు సరికొత్త భవిష్యత్తును నిర్మించే ఉపాధి కర్మాగారం. కష్టాలను కన్నీళ్లుగా మార్చుకున్న సీమ రైతన్న ఇకపై పండ్ల ఎగుమతులతో ప్రపంచ మార్కెట్‌ను శాసించే స్థాయికి ఎదగాలి. ప్రభుత్వ సంకల్పం, కార్పొరేట్ నైపుణ్యం, రైతుల శ్రమ మూడూ కలిస్తే కరువు సీమ కల్పవృక్షంగా మారుతుందనడంలో ఏమాత్రం సందేహం లేదు. ●

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)



# చంద్రుడిపై అణురియాక్టర్ల ఏర్పాటుకు అగ్రదేశాల పోటీ!

## అమెరికా, చైనా, రాష్ట్రాల దృష్టి దానిపైనే

**న్యూయార్కు, అక్టోబరు 5:** చంద్రుడిపై శాశ్వత స్థావరాలు ఏర్పాటు చేసేందుకు అగ్రరాజ్యాలు సిద్ధమవుతున్నాయి. అమెరికా, చైనా, రష్యా ఇప్పుడు చంద్రుడిపై అణు రియాక్టర్ల ఏర్పాటుపై దృష్టి పెట్టాయి. భవిష్యత్తులో చంద్రుడిపై ఎక్కువ కాలం మనుషులు ఉండాలన్నా, అక్కడి వనరులను అన్వేషించాలన్నా విద్యుత్ కీలకం. అందుకే ఈ మూడు దేశాలు అణుశక్తిని ప్రత్యామ్నాయంగా చూస్తున్నాయి. ఓ చిన్న అణు రియాక్టర్ తయారీకి కంపెనీల నుంచి ఆగస్టులో నాసా ప్రతిపాదనలు కోరినట్లు వెలుగులోకి వచ్చింది. చంద్రుడి దక్షిణ ధ్రువం సమీపంలో పనిచేసేలా దీన్ని రూపొందించనున్నారు. 2030 డిసెంబరు నాటికి ప్రయోగానికి సిద్ధం చేయాలన్నది లక్ష్యం. ఈ రియాక్టర్ 20 కిలోవాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ ఐదేళ్ల పాటు మానవ జోక్యం లేకుండా పనిచేసేలా రూపొందించాలని భావిస్తున్నారు. చైనా కూడా చంద్రుడిపై అణుశక్తిని ఉపయోగించే ప్రణాళికలతో ముందుకెళ్తోంది. చైనాతో కలిసి రష్యా సెలీనా పేరుతో రియాక్టర్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు సమాచారం. 2036 నాటికి దీన్ని సిద్ధం చేయాలని రష్యా లక్ష్యంగా పెట్టుకుంది. ఇది 10 కిలోవాట్ల వరకు విద్యుత్ అందిస్తూ పదేళ్ల పాటు సొంతంగా పనిచేసేలా రూపొందించనున్నారు. చంద్రుడిపై ఒక రాత్రి రెండు వారాలకు పైగా ఉంటుంది. దీంతో సౌర విద్యుత్‌పై పూర్తిగా ఆధారపడటం కష్టం. ప్రారంభ దశలో అమెరికా, చైనా సౌర విద్యుత్, రేడియోఐసోటోప్ వ్యవస్థలను ఉపయోగించాలనుకుంటున్నాయి. అయితే పెద్ద స్థావరాలు ఏర్పడితే ఎక్కువ విద్యుత్ అవసరమవుతుంది. అక్కడే అణు రియాక్టర్లు కీలకంగా మారనున్నాయి. చంద్రుడిపై అణు రియాక్టర్ ఏర్పాటు అంత సులభం కాదు. రాకెట్ ప్రయోగం విఫలమైతే అణు పదార్థాల విషయంలో ప్రమాదం తలెత్తే అవకాశం ఉంది. చంద్రుడిపై రియాక్టర్‌ను భద్రపరచడం, నిర్వహించడం కూడా కష్టమే. వ్యోమగాములు, పరికరాల భద్రత కోసం రియాక్టర్ చుట్టూ కొన్ని ప్రాంతాలను పరిమితం చేయాల్సి రావచ్చని నిపుణులు చెబుతున్నారు. అమెరికా, రష్యా మాత్రం ప్రయోగ సమయంలో రియాక్టర్లను క్రియాశీలం చేయకుండా తీసుకెళ్లాలని భావిస్తున్నాయి. ఈ పోటీ మరో కీలక ప్రశ్నను కూడా తెరపైకి తెచ్చింది. 1967లో కుదిరిన ఔటర్ స్పేస్ ట్రీటీ ప్రకారం ఏ దేశమూ చంద్రుడిని తన భూభాగంగా ప్రకటించుకోకూడదు. అయితే భవిష్యత్తులో స్థావరాల చుట్టూ ఇతర దేశాల ప్రవేశాన్ని పరిమితం చేయవచ్చా చంద్రుడి నుంచి తీసే వనరులపై హక్కులు ఎవరికి ఉంటాయి అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సాంకేతిక, భద్రతా సవాళ్ల కారణంగా మూడు దేశాల ప్రస్తుత గడువులు మారే అవకాశం కూడా ఉంది.

# ఆహార సంక్షోభంలో ప్రపంచదేశాలు

## జర్మనీలో మ్యూనిచ్ లీడర్ల సమావేశంలో కేంద్ర ఆర్థికమంత్రి సీతారామన్

## కొలిక్కివస్తున్న భారత్ - అమెరికా ట్రేడ్ డీల్ చర్చలు



మ్యూనిచ్, అక్టోబరు 5: ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆహార సంక్షోభం ఎదురయ్యే ప్రమాదం ఉందంటూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సంచలన హెచ్చరిక చేశారు. జర్మనీలో జరిగిన మ్యూనిచ్ లీడర్స్ సమావేశంలో మాట్లాడిన ఆమె, భారత్‌అమెరికా ట్రేడ్ డీల్ నుంచి హోర్ముజ్ జలసంధి సమస్యల వరకు అనేక కీలక అంశాలపై స్పందించారు. ముఖ్యంగా సముద్ర మార్గాల్లో తలెత్తుతున్న ఆటంకాలు ప్రపంచ దేశాలకు ఎంత పెద్ద ముప్పుగా మారాయో స్పష్టంగా వివరించారు. హోర్ముజ్, బాబ్ అల్‌మండేబ్ వంటి ప్రధాన సముద్ర రవాణా మార్గాల్లో అడ్డంకులు ఏర్పడటం వల్ల ప్రపంచ దేశాల ఆహార భద్రత ప్రమాదంలో పడుతుందని నిర్మలా సీతారామన్ హెచ్చరించారు. దీనికి తోడు మలక్కా జలసంధి ప్రస్తావన కూడా తీసుకొస్తూ, ప్రస్తుతం అక్కడ ఎలాంటి ఇబ్బందులు లేవని, కానీ ఒకవేళ అక్కడ కూడా రవాణాకు ఆటంకం ఏర్పడితే పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ గ్లోబల్ ఆహార సంక్షోభాన్ని, సవాళ్లను తట్టుకోవడానికి భారత్ ఇప్పటికే బలమైన చర్యలు చేపట్టిందని ఆర్థిక మంత్రి వెల్లడించారు. ఎరువులను మోసుకొచ్చే షిప్పింగ్ లైన్లపై అదనపు భారం పడకుండా, పెరుగుతున్న ఇన్సూరెన్స్ ప్రీమియంలు, పేమెంట్ల సకాలంలో చెల్లింపులకు సాయం చేసేందుకు ప్రత్యేకంగా ఒక 'షిప్పింగ్ ఎమర్జెన్సీ ఫండ్‌ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎరువుల ధరలు పెరిగిపోవడం, ఓడల లభ్యత తగ్గడం, భారీగా ఇన్సూరెన్స్ ప్రీమియంలు పెరగడం వల్ల ఎరువుల దిగుమతికి తీవ్ర విఘాతం కలుగుతోందని, అందుకే దేశీయంగా యూరియా, ఫాస్ఫేట్ ఉత్పత్తిని పెంచేందుకు భారత్ కృషి చేస్తోందని అన్నారు. అయితే ఈ స్వదేశీ ఉత్పత్తి పూర్తిస్థాయికి చేరుకోవడానికి కొంత సమయం పడుతుందని తెలిపారు. ఇక భారత్ అమెరికా వ్యాపార ఒప్పందం గురించి మాట్లాడుతూ.. రెండు దేశాల మధ్య జరుగుతున్న ట్రేడ్ డీల్ చర్చలు ప్రస్తుతం ఒక నిర్ణీత స్థితికి చేరుకున్నాయని నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈ దశలో ఇరు దేశాలు అంతకుమించి ఇచ్చిపుచ్చుకోవడం లేదా వెనక్కి తగ్గడం చాలా కష్టమైన విషయమని స్పష్టం చేశారు. అలాగే అమెరికా ప్రస్తుతం జరుగుతున్న చర్చల కంటే భిన్నమైన మార్గాల ద్వారా భారత్‌తో ఉన్న వ్యాపార లోటును తగ్గించుకోవాలని చూస్తోందని ఆమె పేర్కొన్నారు.



## మొగుడు కావాలి..

### ఓ అమెరికా యువతి వినూత్న ప్రకటన

**న్యూయార్క్, అక్టోబరు 5:** అందరిలానే తాను కూడా ఎవరినో ప్రేమించిన పెళ్లి చేసుకుంటే ఏం వెరైటీ గా ఉంటుందని భావించిన అమెరికాకు చెందిన ఒక యువతి ఒక వినూత్న మార్గాన్ని ఎంచుకుంది. ఉద్యోగ ఖాళీ తరహాలో ఆమె ఆన్‌లైన్‌లో 'మొగుడు కావాలి' అని ఒక ప్రకటన ఇచ్చింది. న్యూయార్క్ పోస్టు కథనం ప్రకారం.. అప్పటికే డేటింగ్ యాప్స్ లాంటి వాటి ద్వారా తోడు కోసం వెతికి కాలాన్ని వృథా చేసుకుని విసిగి వేసారిన ఎరిన్ పాటర్సన్ అనే యువతి వినూత్నంగా ఒక గూగుల్ ఫామ్‌ను రూపొందించింది. దానిలో ఆమె తనకు కావాల్సిన భర్త గురించి ప్రశ్నలను ఉంచింది. 'నేను ఒక అందమైన, తెలివైన, సహృదయం గల, కాఫీ/డిన్నర్ చేస్తూ మంచి సంభాషణలు ఆస్వాదించే వ్యక్తి కోసం చూస్తున్నా' అని పేర్కొంది. ఆ ఫాంలోని ప్రశ్నావళిలో దరఖాస్తు చేయబోయే వ్యక్తి వృత్తిపరమైన సంబంధాలు, కెరీర్ లక్ష్యాలు, సంబంధాల పట్ల అంచనాలకు సంబంధించిన ప్రశ్నలు ఉన్నాయి. అంతేకాక దరఖాస్తుదారుడి వృత్తిపరమైన లక్ష్యాలు, అతడి రోజువారీ దినచర్య, వ్యాయామ విధానాలు, పెళ్లిపై, కుటుంబంపై అతడి అభిప్రాయాలకు సంబంధించిన ప్రశ్నలు కూడా ఉన్నాయి. ఆమె ప్రకటనకు అనూహ్య స్పందన వచ్చింది. ఆమెను పెళ్లాడటానికి పలువురు క్యూ కట్టారు. ఇప్పటివరకు ఆమెకు 240 దరఖాస్తులు వచ్చాయి. ఇది వినూత్నమైన ఆలోచన అని పలువురు నెటిజన్లు ప్రశంసించారు.

## మచ్చర్‌లా ఉండండి.. కాక్రోచ్‌లా కాదు..

### పుణేలో ఉద్రిక్తతలు రేపుతున్న పోస్టర్లు




**పూణె, అక్టోబరు 5:** మహారాష్ట్రలోని పుణే నగరంలో వెలసిన కొన్ని పోస్టర్లు ఇప్పుడు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. "మచ్చర్ లా ఉండండి, కాక్రోచ్‌లా కాదు" అనే వింత నినాదంతో ఏర్పాటు చేసిన ఈ పోస్టర్లు రాజకీయ దుమారం రేపుతున్నాయి. ఒకవైపు ఫ్లైదుబాయ్ పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను హీరోగా చూపిస్తూ, మరోవైపు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) అనే వ్యంగ్య నిరసన బృందాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ పోస్టర్లను ప్రదర్శించారు. భారతీయ జనతా యువ మోర్చా ఈ పోస్టర్లను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. గత సెప్టెంబర్ నెలలో దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళుతున్న ఫ్లైదుబాయ్ విమానంలో ఒక అనూహ్య ఘటన చోటుచేసుకుంది. విమానం గాల్లో ఉండగా, సహ పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై దాడికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆ క్లిష్ట పరిస్థితుల్లో కెప్టెన్ మచ్చర్ అప్రమత్తమై, విమానాన్ని తిరిగి తన ఆధీనంలోకి తెచ్చుకుని సురక్షితంగా ల్యాండ్ చేశారు. దీంతో ఆయన ధైర్యసాహసాలను అందరూ ప్రశంసించారు. హిందీలో మచ్చర్ అంటే దోమ అని అర్థం. ఆయన ఇంటిపేరును వాడుకుంటూ, ఆయనను సానుకూల దృక్పథానికి ప్రతీకగా ఈ పోస్టర్లలో చూపించారు. ఏమిటీ కాక్రోచ్ జనతా పార్టీ ఇక బొద్దింక ప్రస్తావన వెనుక కూడా ఒక నేపథ్యం ఉంది. ఈ ఏడాది మే నెలలో కొందరు ఉద్యమకారులు, నిరుద్యోగ యువతను ఉద్దేశించి భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ బొద్దింకలు అని వ్యాఖ్యానించినట్లు వార్తలు వచ్చాయి. అయితే, తన మాటలను తప్పుగా ప్రచురించారని ఆయన తర్వాత స్పష్టం చేశారు. ఈ వివాదాన్ని ఆధారంగా చేసుకుని అభిజీత్ దీప్కే అనే సామాజిక కార్యకర్త కాక్రోచ్ జనతా పార్టీ పేరుతో ఆన్‌లైన్‌లో ఒక వ్యంగ్య బృందాన్ని ప్రారంభించారు. పరీక్ష పత్రాల లీకేజీలు, ప్రభుత్వ పాఠశాలల దుస్థితి వంటి అంశాలపై ఈ బృందం వినూత్నంగా నిరసనలు తెలుపుతూ గుర్తింపు పొందింది. ఈ నేపథ్యంలోనే సీజేపీని కించపరిచేలా,

కెప్టెన్ మచ్చర్‌ను హీరోగా చూపిస్తూ ఈ పోస్టర్లు వెలిశాయి. ఒక పైలట్ సాధించిన వ్యక్తిగత ఘనతను, ఆయన ఇంటిపేరును ఇలా రాజకీయ వివాదంలోకి లాగడంపై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వింత పోస్టర్ల వివాదం పుణేలో స్థానిక రాజకీయ వేడిని పెంచడంతో పాటు సాహస పైలట్ కెప్టెన్ మచ్చర్‌తో పాటు సీజేపీని కూడా జాతీయ స్థాయిలో వార్తల్లో నిలిపింది.



## యెమెన్‌లో పోరు ఉధృతం.. కీలక పట్టణం హౌతీల చేతుల్లోకి

**సానా, అక్టోబరు 5:** యెమెన్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరాన్ మద్దతు కలిగిన హూతీ తిరుగుబాటుదారులు దేశంలో మరింత భూభాగాన్ని ఆక్రమించుకున్నారు. కీలకమైన తుర్బా పట్టణాన్ని తమ నియంత్రణలోకి తెచ్చుకున్నారు. హూతీలపై స్థానిక ప్రభుత్వం (పిఎల్‌సి) భారీ సైనిక చర్యను ప్రకటించడానికి కొద్దిసేపటి ముందే ఈ పరిణామం చోటుచేసుకుంది. మరోవైపు యెమెన్ ప్రభుత్వానికి మద్దతుగా ఉన్న సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు.. హూతీలపై విరుచుకుపడుతున్నాయి. కొన్ని రోజులుగా హూతీలు దేశంలోని మూడో అతిపెద్ద నగరమైన తైజ్‌లోకి చొచ్చుకెళ్లేందుకు చూస్తున్నారు. యెమెన్ సర్కారుకు కేంద్రంగా ఉన్న ఏడెన్‌ను, తైజ్‌ను కలిపే ప్రధాన రహదారిపై తుర్బా పట్టణం ఉంది. హూతీల నుంచి తైజ్‌ను రక్షించే ప్రభుత్వ బలగాలకు ఇది కీలక స్థావరంగా ఉంటూ వచ్చింది. అంతకుముందు హూతీలు తైజ్ శివార్లలోని అనేక ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నారు. గత నెలలో మోఖా రేవు పట్టణం, బాబ్ ఎల్ మండెబ్ జలసంధిపై వారు నియంత్రణ సాధించిన విషయం తెలిసిందే.
హూతీల నియంత్రణలో ఉన్న భూభాగాలను తిరిగి స్వాధీనం చేసుకోవడమే లక్ష్యంగా యెమెన్ ప్రభుత్వం 'డాన్ ఆఫ్ యెమెన్' పేరిట ఆదివారం భారీ సైనిక చర్యను ప్రకటించింది. ఈ క్రమంలోనే బాబ్ ఎల్ మండెజ్ జలసంధిని తమ నియంత్రణలోకి తీసుకోవడంలో పైచేయి సాధించామని తాజాగా ప్రకటించింది. ధుబాబ్ అనే తీరప్రాంత పట్టణంతోపాటు, దాని సమీపంలోని విమానాశ్రయాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది.

# ఉద్యోగ వీసాలపై అమెరికా మరింత కఠినం!

**వాషింగ్టన్, అక్టోబరు 5:** అమెరికాలో విదేశీయులకు జారీ చేసే ఉద్యోగ వీసా కార్యక్రమాలపై ట్రంప్ యంత్రాంగం తన వైఖరిని మరింత కఠినతరం చేయనుంది. ముఖ్యంగా హెచ్1బీ వంటి వీసాలపై పర్యవేక్షణను తీవ్రతరం చేస్తూ ఈ వారంలోనే కీలక చర్యలు తీసుకోబోతున్నట్లు అమెరికా కార్మిక శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆంథోనీ డిఎస్పోసిటో స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. ఈ పరిణామంతో విదేశీ ఉద్యోగులలో, వారిపై ఆధారపడిన కంపెనీలలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఆంథోనీ డిఎస్పోసిటో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ వేదికగా చేసిన ఒక పోస్ట్‌లో ఈ విషయాన్ని వెల్లడించారు.

ఈ వారం విదేశీ లేబర్ వీసాల విషయంలో చాలా కీలకమైనది. మేము ఈ అంశాన్ని సరికొత్త స్థాయికి తీసుకెళ్తున్నాం. అమెరికన్ ఉద్యోగాలు అమెరికన్ కార్మికులని ఆయన పేర్కొన్నారు. అయితే, ఏయే వీసా కార్యక్రమాలను లక్ష్యంగా చేసుకుంటున్నారో, ఏ కంపెనీలపై చర్యలు ఉంటాయో లేదా ఎలాంటి దర్యాప్తులు చేపట్టనున్నారో ఆయన తన పోస్ట్‌లో స్పష్టంగా వెల్లడించలేదు. ఈ ప్రకటన రాబోయే చర్యల తీవ్రతను సూచిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇది ట్రంప్ ప్రభుత్వం కొంతకాలంగా అనుసరిస్తున్న విస్తృత విధానంలో భాగమే. ఉపాధి ఆధారిత వలస విధానాలను కఠినతరం చేయడంపై, ముఖ్యంగా హెచ్1బీ వీసా కార్యక్రమంపై, ట్రంప్ సర్కార్ మొదటి నుంచి దృష్టి సారించింది. సెప్టెంబర్‌లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక కీలక కార్యనిర్వాహక ఉత్తర్వుపై (ఎగ్జిక్యూటివ్ ఆర్డర్) సంతకం చేశారు. దీని ప్రకారం హెచ్1బీ వీసాల కోసం దరఖాస్తు చేసుకునే కంపెనీలు అదే విధమైన నైపుణ్యాలు కలిగిన అమెరికన్ ఉద్యోగులను ఇటీవల తొలగించాయా లేదా తొలగించే ప్రణాళికలో ఉన్నాయా అనే విషయాన్ని సంబంధిత ఏజెన్సీలు తప్పనిసరిగా సమీక్షించాలని ఆదేశించారు. దీనికి అనుబంధంగా, అమెరికా వెలుపల ఉన్న కార్మికులకు సంబంధించిన కొన్ని ప్రత్యేక హెచ్1బీ పిటిషన్లపై విధించే లక్ష డాలర్ల ఫీజు ఆవశ్యకతను 2027 సెప్టెంబర్ వరకు పొడిగిస్తూ మరో ప్రకటన జారీ చేశారు. ఈ చర్యల ద్వారా వీసా ప్రక్రియను మరింత నియంత్రించి, అమెరికన్ ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడాలనేది ప్రభుత్వ ఉద్దేశంగా కనిపిస్తోంది. ప్రభుత్వంలోని కీలక వ్యక్తులు కూడా ఇదే తరహా అభిప్రాయాలను బలంగా వినిపిస్తున్నారు. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ హెచ్1బీ వీసా కార్యక్రమాన్ని పూర్తిగా విఫలమైనదిగా అభివర్ణించారు. కొన్ని కంపెనీలు అమెరికన్ ఉద్యోగులను తొలగించి, వారి స్థానంలో తక్కువ జీతాలకు పనిచేసే విదేశీ కార్మికులను నియమించుకోవడానికి ఈ వీసాలను ఒక సాధనంగా వాడుకుంటున్నాయని ఆయన తీవ్రంగా ఆరోపించారు.

ఈ విధానంలోని లోపాలను సరిదిద్దడానికే తమ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని ఆయన స్పష్టం చేశారు. మొత్తం మీద, విదేశీ వీసా కార్యక్రమాలలో జరుగుతున్నాయని ఆరోపిస్తున్న దుర్వినియోగాన్ని అరికట్టి, అమెరికన్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంపై ట్రంప్ యంత్రాంగం పూర్తి స్థాయిలో దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది.

## జైరాం అంత తొందరపడతారనుకోలేదు!

### కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ, అక్టోబరు 5:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్‌పై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోషల్ మీడియా వేదికగా తీవ్రస్థాయిలో స్పందించారు. "జైరాం, నమ్మలేకపోతున్నాను. మీరింత తొందరపడతారని నేను అనుకోలేదు. అక్కడ ఉన్నది టీడీపీ, జనసేన కార్యకర్తలు. తమ నాయకులైన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లతో మాట్లాడాలని వారు ఉత్సాహం చూపారు. కార్యక్రమం తర్వాత బయటకు వచ్చి మాట్లాడతారని గౌరవ ముఖ్యమంత్రి వారికి చెప్పారు. అక్కడ జరిగింది అంతే" అని ఆమె తన పోస్టులో ఘాటుగా బదులిచ్చారు. ఓ చిన్న విషయాన్ని వక్రీకరించి తప్పుడు ప్రచారం చేయడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇటీవల అన్నమయ్య జిల్లా మదనపల్లెలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ నిర్మాణ పనుల ప్రారంభోత్సవ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ప్రసంగిస్తుండగా, సభకు హాజరైన కొందరు యువకులు తమ నాయకులను చూడాలనే ఉత్సాహంతో కేకలు వేశారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కలుగజేసుకుని, కార్యక్రమం ముగిశాక నాయకులు అందరితో మాట్లాడతారని చెప్పి వారిని శాంతపరిచారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను సులేమాన్ ఖాన్ అనే వ్యక్తి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ, మొదట ఉద్యోగాలు ఇవ్వండి అంటూ సభలోని వారు నినాదాలు చేశారని తప్పుడు సమాచారాన్ని జతచేశారు. ఈ పోస్టును జైరాం రమేశ్ రీపోస్ట్ చేస్తూ, "ప్రజల్లో ఎంత ఆగ్రహం ఉందో ఆర్థిక మంత్రి స్వయంగా చూస్తున్నారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని ప్రజలను నిశ్శబ్దంగా మార్చాల్సి వచ్చింది" అని వ్యాఖ్యానించారు. జైరాం రమేశ్ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు,

మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. వాస్తవాలు తెలుసుకోకుండా, ఎవరో పెట్టిన తప్పుడు పోస్టు ఆధారంగా వ్యాఖ్యలు చేయడం తగదని హితవు పలికారు. సభలో కనిపించింది ప్రజాగ్రహం కాదని, తమ నాయకుల పట్ల ప్రజలు, కార్యకర్తలు చూపిన ఉత్సాహం అని వారు స్పష్టం చేశారు. ఈ ఘటనతో ఏపీలోని ఓ కార్యక్రమం చుట్టూ జాతీయ స్థాయిలో సోషల్ మీడియా వేదికగా రాజకీయ మాటల యుద్ధం రాజుకుంది.

## రూ.2.5 లక్షలు లంచంతో పట్టుబడిన డిజిసిఎ అధికారి

**చెన్నై, అక్టోబరు 5:** విమానం ఎయిర్‌వర్తినెస్ సర్టిఫికేషన్ కోసం, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) అధికారి లంచం డిమాండ్ చేశారు. ఒక విమానయాన సంస్థ డైరెక్టర్ నుంచి రూ.2.5 లక్షలు తీసుకున్నారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) దృష్టికి ఇది వెళ్లింది. ఈ నేపపథ్యంలో డీజీసీఏ అధికారితో పాటు విమానయాన సంస్థ డైరెక్టర్‌ను అరెస్ట్ చేసింది. తమిళనాడు రాజధాని చెన్నైలో ఈ సంఘటన జరిగింది. ఏక్వి ఎయిర్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ఒక ట్రైనింగ్ ఫ్లైట్‌కు ఎయిర్‌వర్తినెస్ సర్టిఫికేషన్ సంబంధించి చెన్నై డీజీసీఏ డిప్యూటీ డైరెక్టర్ (ఎయిర్‌వర్తినెస్) సుశీల్ కుమార్ గార్గ్ లంచం డిమాండ్ చేశారు. ఇది సీబీఐ దృష్టికి వెళ్లింది. కాగా, ఆ విమానయాన సంస్థ డైరెక్టర్ సచిన్ కేశవ్ భానే నుంచి డీజీసీఏ అధికారి సుశీల్ కుమార్ గార్గ్ రూ.2.5 లక్షలు లంచం తీసుకుంటుండగా సీబీఐ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

## మహిళలపై నేరాలకు పాల్పడితే నిందితులకు వణుకుపుట్టించాలి :సుప్రీం

**న్యూఢిల్లీ,అక్టోబరు 5:** మహిళలపై నేరాలకు పాల్పడే సామాజిక వ్యతిరేక శక్తుల మనసుల్లో భయాన్ని సృష్టించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నేరం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే, నేరాలు జరగకుండా నివారించడమే అత్యంత ముఖ్యమని ఢిల్లీ పోలీసులకు హితవు పలికింది. ఇటీవల ఢిల్లీజాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్)లో వరుసగా చోటుచేసుకున్న అత్యాచార ఘటనలపై సుమోటోగా విచారణ చేపట్టిన ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా పోలీసుల పనితీరుపై పలు సూచనలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ పార్థీవాలా మాట్లాడుతూ మహిళలపై దాడులకు పాల్పడాలనుకునే దుండగులకు తాము పట్టుబడితే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందనే భయం ఉండాలి. అలాంటి వాతావరణాన్ని మీరు కల్పించాలని పోలీసులను ఆదేశించారు. నేరాలను అరికట్టేందుకు నివారణ చర్యలను మరింత బలోపేతం చేయాలని ఈ సందర్భంగా న్యాయస్థానం నొక్కి చెప్పింది. ఢిల్లీలో మహిళల భద్రతకు సంబంధించి పలు నిర్దిష్ట ఆదేశాలను ధర్మాసనం జారీ చేసింది. సమస్యాత్మక ప్రాంతాల్లో బీట్ పెట్రోలింగ్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని, వెలుతురు సరిగా లేని ప్రదేశాలను గుర్తించి వెంటనే లైటింగ్ సౌకర్యం మెరుగుపరచాలని సూచించింది. అలాగే, నిఘా వ్యవస్థలను పటిష్ఠం చేయాలని తెలిపింది. దుండగులు, పోకిరీలు ఎక్కువగా గుమికూడే అక్రమ తినుబండారాల కేంద్రాలు, మద్యం దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ముఖ్యంగా విద్యాసంస్థల సమీపంలో అమ్మాయిలను వేధించే వారిపై ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేసింది.

దేశ రాజధాని పరిధిలో మైనర్లపై జరిగిన లైంగిక దాడులతో సహా వరుస అత్యాచార ఘటనల నేపథ్యంలో సుప్రీంకోర్టు ఈ కేసును సుమోటోగా విచారణకు స్వీకరించింది. గతంలో కూడా కోర్టు మహిళల భద్రతపై ఆడిట్ నిర్వహించాలని, ఇతర తాత్కాలిక చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. తాజా విచారణలో తీసుకున్న చర్యలపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని ఢిల్లీ పోలీసులను ధర్మాసనం ఆదేశించింది.

## నకిలీ సుప్రీం ఉత్తరువు సాయంతో జీవితఖైదీని విడుదలచేసిన డిఐజి అరెస్టు



**బెంగళూరు, అక్టోబరు 5:** నకిలీ సుప్రీంకోర్టు ఉత్తర్వుతో జీవిత ఖైదీని జైలు నుంచి విడుదల చేసినట్లు ప్రస్తుతం జైళ్ల శాఖ డీఐజీగా ఉన్న పోలీస్ అధికారిపై ఆరోపణలు రావడంతో దర్యాప్తు చేసిన పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణ నిమిత్తం పోలీస్ కస్టడీకి తరలించారు. కర్ణాటకలో ఒక కిడ్నాప్ కేసులో దోషిగా తేలిన శంకర్‌కు ఫాస్ట్ ట్రాక్ కోర్టు 2004లో జీవిత ఖైదు, రూ. 10,000 జరిమానా విధించింది. కర్ణాటక హైకోర్టు, సుప్రీంకోర్టులో అతడు దాఖలు చేసిన అప్పీళ్లలో కూడా ఆ శిక్ష రద్దు కాలేదు. ఆ సమయంలో బెంగళూరు కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీల విభాగంలో సెకండ్ డివిజన్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీకాంత్, సుప్రీంకోర్టు ఉత్తర్వుగా పేర్కొన పత్రాన్ని ఫోర్జరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. నాడు బెంగళూరు సెంట్రల్ జైలు చీఫ్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన సోమశేఖర్ దీనికి సహకరించినట్లు ఆరోపించారు. 2018 నవంబర్ 2న ఉత్తర్వు జారీ చేసినట్లుగా ఉన్న నకిలీ సుప్రీంకోర్టు ఉత్తర్వు ఆధారంగా నవంబర్ 13న శంకర్‌ను జైలు నుంచి విడుదల చేసినట్లు పేర్కొన్నారు. మరోవైపు ఈ ఆరోపణలపై పోలీసులు దర్యాప్తు చేశారు. జైలు నుంచి విడుదలైన శంకర్ భార్యను కూడా ప్రశ్నించారు. దీంతో విడుదల కోసం జారీ చేసిన సుప్రీంకోర్టు ఉత్తర్వు నకిలీ అని తేలింది. ఈ నేపథ్యంలో బెంగళూరు సెంట్రల్ జైలు ఇన్‌ఛార్జ్ సూపరింటెండెంట్ ఈ ఏడాది మే 20న పరప్పన అగ్రహార పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో దీనిపై కేసు నమోదైంది. అయితే ప్రస్తుతం కర్ణాటక జైళ్లు, సంస్కరణ సేవల విభాగం డీఐజీగా ఉన్న ఎం సోమశేఖర్ ఈ కేసు విచారణకు సహకరించలేదని, ఈ కేసుకు సంబంధించిన సమాచారాన్ని ఆయన దాచినట్లు తదుపరి విచారణలో తేలింది. ఈ నేపథ్యంలో అక్టోబర్ 4న పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం పోలీస్ కస్టడీకి తరలించారు.

# సంక్షిప్త వార్తలు

## శరద్రుతువుతో రంగులు మారిన జమ్ముకాశ్మీర్



**శ్రీనగర్, అక్టోబరు 5:** కశ్మీర్ లోయ ప్రకృతి రమణీయతతో కొత్త శోభను సంతరించుకుంది. వలస పక్షుల రాక, కీచురాళ్ల శబ్దాలు, పండిన పంట పొలాల్లో గింజలను ఏరుకునే గువ్వల సందడితో లోయలో శరదృతువు ప్రారంభమైంది. రైతులు వరి కోతలు పూర్తి చేసి ధాన్యాన్ని ఇళ్లకు చేరుస్తుండగా, పండ్ల తోటల యజమానులు యాపిల్స్ కోత పనుల్లో నిమగ్నమయ్యారు. స్థానిక మార్కెట్లు ద్రాక్ష, తామర తూళ్లు, తాజా కూరగాయలతో కళకళలాడుతున్నాయి. వాతావరణంలోనూ స్పష్టమైన మార్పులు గోచరిస్తున్నాయి. ఆకాశం నిర్మలంగా ఉన్నప్పటికీ, పగటిపూట ఎండ తీవ్రత అధికంగానే ఉంటోంది.

## 37 కోట్ల యేళ్లక్రితం ఏర్పడిన ఏమ్స్ ఉల్కాపాతం!



**ఓక్లహామా, అక్టోబరు 5:** అమెరికాలోని ఓక్లహామాలో ఉన్న ఏమ్స్ ఉల్కాపాతం క్రేటర్ (బిలం) వయసును శాస్త్రవేత్తలు సవరించారు. గతంలో భావించినట్లుగా ఇది 46.7 కోట్ల ఏళ్ల క్రితం కాకుండా, సుమారు 37 కోట్ల ఏళ్ల క్రితం ఏర్పడిందని టెక్సాస్ విశ్వవిద్యాలయం పరిశోధకులు తేల్చారు. ఇప్పటివరకు ఉన్న అంచనా కంటే దీని వయసు దాదాపు 10 కోట్ల సంవత్సరాలు తక్కువ. ఈ కొత్త ఆవిష్కరణతో, భూమిపై భారీస్థాయిలో జీవరాశులు అంతరించిన కాలానికి ఈ ఉల్కాపాత సంఘటన దగ్గరగా జరిగినట్లు తెలుస్తోంది. ఓక్లహామాలోని ఏమ్స్ పట్టణం కింద కొన్ని మైళ్ల వెడల్పున ఈ బిలం విస్తరించి ఉంది.

## ఇద్దరు కేంద్ర మంత్రులకు టికెట్ నో!

**లక్నో, అక్టోబరు 5:** ఉత్తరప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అనూహ్య నిర్ణయం తీసుకుంది. పదవీకాలం ముగియనున్న ఇద్దరు కేంద్ర మంత్రులతో సహా ఏ ఒక్క సిట్టింగ్ ఎంపీకి తిరిగి అవకాశం కల్పించకుండా, ఎనిమిది మంది కొత్త ముఖాలను బరిలోకి దింపింది. ముఖ్యంగా కేంద్ర మంత్రులు హర్దీప్ సింగ్ పురి, బీఎల్ వర్మలను పక్కనపెట్టడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఉత్తరప్రదేశ్ నుంచి ఖాళీ అవుతున్న 10 రాజ్యసభ స్థానాలకు అక్టోబర్ 16న పోలింగ్ జరగనుంది. అసెంబ్లీలోని బలాబలాల ప్రకారం బీజేపీ ఎనిమిది, సమాజ్‌వాదీ పార్టీ రెండు స్థానాలను గెలుచుకునే అవకాశం ఉంది.

## గర్ల్‌ఫ్రెండ్‌తో ఎఫ్‌బిఐ డైరెక్టర్ కాష్‌పటేల్ నిశ్చితార్థం



**వాషింగ్టన్, అక్టోబరు 5:** అమెరికా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) డైరెక్టర్ కాశ్ పటేల్ తన వ్యక్తిగత జీవితంలో నూతన అధ్యాయాన్ని ప్రారంభించబోతున్నారు. తన గర్ల్‌ఫ్రెండ్, కంట్రీ సింగర్ అయిన అలెక్సిస్ విల్కిన్స్‌తో నిశ్చితార్థం జరిగినట్లు ఆయన వెల్లడించారు. ఆదివారం సాయంత్రం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ వేదికగా ఈ జంట తమ ఎంగేజ్‌మెంట్‌ను అధికారికంగా వెల్లడించింది. 27 ఏళ్ల అలెక్సిస్ విల్కిన్స్ తన నిశ్చితార్థపు ఉంగరాన్ని ప్రదర్శిస్తూ, 46 ఏళ్ల కాశ్ పటేల్‌తో కలిసి దిగిన బ్లాక్ అండ్ వైట్ ఫోటోను పోస్ట్ చేశారు. ఈ ఫోటోను పటేల్ సైతం రీపోస్ట్ చేశారు.

## అనుమతి లేకుండా దీదీ మెడికల్ రికార్డులు విడుదలపై నోటీసులు



**కోల్‌కతా, అక్టోబరు 5:** పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీ తరపున న్యాయవాది ఎస్ఎస్‌కేఎం ఆస్పత్రితో పాటు బంగుర్ ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ న్యూరోసైన్సెస్‌కు లీగల్ నోటీసులు జారీ చేశారు. దీదీకి చెందిన 2021 నాటి మెడికల్ రికార్డులను అనుమతి లేకుండా రిలీజ్ చేసిన కేసులో ఆ ఆస్పత్రులకు నోటీసు ఇచ్చారు. 2021 నందిగ్రామ్ ఎన్నికల ప్రచారంలో తన కాలుకు గాయమైనట్లు మమతా బెనర్జీ ఫేక్ మెడికల్ రిపోర్టు రిలీజ్ చేసిందని ప్రస్తుత సీఎం సువేంధు అధికారి ఇటీవల ఆరోపించిన విషయం తెలిసిందే.

# సిఇసి జ్ఞానేశ్‌కుమార్ వెంటనే రాజీనామా చేయాలి

### ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే సత్యాగ్రహ దీక్ష : పిసిసి సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్

**హైదరాబాద్,అక్టోబరు6,ప్రభాతవార్త:** భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని, రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేసే కుట్రల చేసిన ఆయనను అరెస్టు చేసి జీవితకాలం వూచలు లెక్కించేలా భారత ఉన్నత న్యాయస్థానం చొరతీసుకోవాలని పిసిసి సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ డిమాండ్ చేశారు. దేశంలో రాజ్యాంగ వ్యవస్థలను భ్రష్టుపట్టిస్తూ, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ పిసిసి సేవాదళ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో సోమవారం శాంతియుత సత్యాగ్రహ దీక్ష అత్యంత స్ఫూర్తిదాయకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిసిసి సేవాదళ్ అధ్యక్షుడు మాట్లాడుతూ ఓటర్ల తొలగింపు కుట్ర అమలు చేయడానికి ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ పేరుతో కేంద్ర ఎన్నికల సంఘం ఏకపక్షంగా వ్యవహరించిందని ఆరోపించారు. 13 కోట్ల మంది అర్హులైన పేదల ఓట్లను తొల గిస్తూ రాజ్యాంగం ప్రసాదించిన వయోజన ఓటు హక్కును కాలరాస్తోందని మండిపడ్డారు. ఎన్నికల సంఘాన్ని బిజెపి ప్రభుత్వం తమ రాజకీయ లబ్ధి కోసం కీలుబొమ్మలా మార్చుకుందని విమర్శించారు. నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన సిఇసి జ్ఞానేశ్ కుమార్ ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువలను మంట కలుపుతున్న ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షాలకు అధికారంలో కొనసాగే నైతిక హక్కు లేదని, వారు వెంటనే తప్పుకోవాలని డిమాండ్ చేశారు.

# బోగస్ ఫారం-7లపై చర్యలు తీసుకోండి

### కలెక్టర్లకు సిఇఒ ఆదేశం



సిఇఒ సుదర్శన్ రెడ్డి

**హైదరాబాద్,అక్టోబరు5,ప్రభాతవార్త:** సర్ అంశానికి సంబంధించి ఫామ్-6, 6ఎ, 7, 8లో తప్పుడు ప్రకటన చేస్తే చర్యలు తప్పవంటూ తెలంగాణ సీఈవో సుదర్శన్ రెడ్డి హెచ్చరించారు. ముఖ్యంగా-7(ఓటర్ల తొలగింపు)లో బల్క్ దరఖాస్తులపై ఫోకస్ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ అప్లికేషన్లు నిజమైనవి కావంటూ ఆరోపణలు రావడంతో తప్పుడు ఇన్ఫర్మేషన్ ఇచ్చిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్లకు సీఈవో ఆదేశాలు జారీ చేశారు. కొన్ని ప్రాంతాల్లో ముందే ప్రింట్ చేసిన ఫారం7లు భారీగా సమర్పిస్తున్నట్లు సమాచారం అందుతోందని సీఈవో తెలిపారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇస్తే చట్ట ప్రకారం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అనర్హులకు ఓటు ఉన్నట్లయితే అభ్యంతరం వ్యక్తం చేస్తూ తొలగించాలని కోరుతూ ఫారం 7 సమర్పించాల్సి ఉంటుంది. అయితే హైదరాబాద్‌లోని ముషీరాబాద్, గోషామహల్, చంద్రాయణగుట్ట నియోజకవర్గాల్లో కొందరి ఓటు తొలగించేందుకు భారీగా బోగస్ ఫారం7లు సమర్పిస్తున్నారని ఇటీవల సీఈవోకు కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేసింది. దీంతో అప్రమత్తమైన సీఈవో కార్యాలయం రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల ఎన్నికల అధికారులకు ఆదేశాలు జరిపింది. ఫారం7లపై క్షుణ్ణంగా విచారణ జరిపిన తర్వాతే ఓటు తొలగించాలని స్పష్టం చేసింది. ఫారం 7తో పాటు కొత్త ఓటు కోసం ఫారం6 ఇతర అప్లికేషన్‌లలో కూడా ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమచారం, డిక్లరేషన్ ఇస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సిందేనని సీఈవో స్పష్టం చేశారు. అభ్యంతరాలు, క్లెయిమ్‌ల గడువు ఎల్లుండితో ముగియనుంది. సర్‌లో భాగంగా తెలంగాణ లో అనేక ప్రాంతాల్లో ఎవరి పేర్లు తొలగించాలో పేర్కొంటూ ప్రింటెడ్ ఫారం-7 పత్రాలు లభించాయి. ముషీరాబాద్ నియోజకవర్గంలోని పోలింగ్ బూత్ పరిధిలో పత్రాలు లభించాయని సుదర్శన్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల విభాగం నేతలు ఫిర్యాదు చేశారు. బహదూర్‌పుర నియోజకవర్గంలో ప్రింటెడ్‌ఫారం7 పత్రాలు శుక్రవారం దర్శనమిచ్చాయి. తాజాగా శనివారం గోషామహల్ నియోజకవర్గంలోనూ లభించాయి. దీంతో అసలు ఈ పత్రాలు ఎక్కడి నుంచి వస్తున్నాయి. ఎవరు వీటిని ప్రింట్ చేస్తున్నారు. బిఎల్‌వో లకు ఎవరు ఇస్తున్నారు. ఎవరైనా ప్రణాళిక ప్రకారం చేస్తున్నారా అనే అనుమానం రాజకీయ పార్టీల్లో నెలకొంది.

ఫారం6ను వినియోగించి కొత్త ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. అదే ఫారం8 ను వినియోగించి అడ్రస్‌లో మార్పులు, పేర్లలో తప్పులను సరిచేసుకొనే అవకాశం ఉంది. అయితే ఫలానా వ్యక్తి ఓటును తొలగించాలని దరఖాస్తు చేసుకోవాంటే ఫారం7ను వినియోగించు కోవాల్సి ఉంటుంది. సంబంధిత ఓటరుపై అనుమానం కలిగినా, అది నకిలీ ఓటు లేదా డూప్లికేట్ ఓటు అని సందేహం కలిగినా, సంబంధిత ఓటరు మృతి చెందినా, వ్యక్తులు సంబంధిత చిరునామాలో లేకపోయినా ఇలా అనేక కారణాలతో ఫారం7 ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఇక్కడి లభించిన వాటిలో తొలగించాల్సిన ఓటరు వివరాలను ఫారం7లో ప్రింట్ చేసి వాటిని కట్టలు కట్టలుగా తెచ్చి బీఎల్‌వోలకు ఇస్తుండటంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అవగాహన ఉన్న బీఎల్‌వోలు ఎవరూ ఇలాంటి ప్రింటెడ్ ఫారాలను తీసుకోరు. ఈ విషయం తెలియని వారు స్వీకరించి ముందుకువెళ్లే అవకాశం ఉంది. అలా జరగడంతోనే ఈ విషయం వెలుగులోకి వచ్చింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఈ తరహా ఘటనలు బయటకు వస్తుండటంతో ఎన్నికల అధికారులు దృష్టి సారించారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో జరిగిన ఘటనపై విచారణకు ఆదేశించారులో తెలంగాణలో ఇప్పటి వరకు ఫలానా వారి ఓట్లను తొలగించాలంటూ ఎన్నికల అధికారులకు దాదాపుగా 29 వేల దరఖాస్తులు అందాయి. దీంతో తప్పుడు ఫారాలు సమర్పిస్తే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సీఈవో ఆదేశించారు.

# మూడు నెలల్లో అదనంగా 97.20 లక్షల మంది ప్రయాణం

### డిమాండ్‌కు అనుగుణంగా ప్రత్యేక సర్వీసులు

### ఆర్టీసీ ఎండి నాగిరెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకంలో గత మూడు నెలల్లో అదనంగా 97.20 లక్షల మంది ప్రయాణించినట్లు ఆర్టీసీ ఎండి నాగిరెడ్డి వెల్లడించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనలో రాష్ట్రంలోని మహిళల ఆర్థిక, సామాజిక సాధికారత దిశగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ఈ పథకానికి రోజురోజుకూ ప్రయాణికుల నుండి ఆదరణ పెరుగుతుండటంతో ప్రయాణికుల అవసరాలకు తగినట్లుగా రవాణా సదుపాయాలను నిరంతరం విస్తరిస్తున్నట్లు చెప్పారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో ప్రయాణించిన మహిళల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపారు. 2025 త్రైమాసికంలో 3,467.91 లక్షల మంది ప్రయాణించగా, ఈ ఏడాది అదే సమయానికి ఏకంగా 3,565.11 లక్షలకు చేరిందని చెప్పారు. కేవలం ఈ మూడు నెలల కాలంలోనే గత ఏడాదితో పోలిస్తే అదనంగా 97.20 లక్షల మంది మహిళలు ఉచిత బస్సు సౌకర్యాన్ని వినియోగించుకున్నారని తెలియచేశారు. అలాగే ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉన్న రూట్లను నిరంతరం పరిశీలిస్తూ, బస్సుల సంఖ్య, ట్రిప్పులను పెంచడం ద్వారా మహిళలకు సౌకర్యవంతమైన, సురక్షితమైన ప్రయాణాన్ని ఆర్టీసీ అందిస్తోందన్నారు. ముఖ్యంగా ఖమ్మం, కొత్తగూడెం అంతర్ జిల్లాల ప్రధాన మార్గాల్లో ట్రిప్పులను అదనంగా పెంచడం జరిగిందని వెల్లడించారు.

# ఆర్టీసీలో సీనియర్ సిటిజన్లకు ఉచిత ప్రయాణానికి కసరత్తు

**హైదరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుతం విజయవంతంగా కొనసాగుతున్న మహాలక్ష్మి పథకం కింద మహిళ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని మరింత విస్తరించడానికి సన్నాహాలు చేస్తోంది. ఇప్పటివరకు కేవలం మహిళలకు మాత్రమే పరిమితమైన ఈ ఉచిత బస్సు సౌకర్యాన్ని, ఇకపై వయోవృద్ధులకు కూడా వర్తింపజేయాలని యోచిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహాలక్ష్మి పథకం కింద పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని ప్రారంభించి దిగ్విజయంగా అమలు చేస్తోంది. ఆధార్ కార్డు చూపిస్తే ప్రయాణించే ఈ వెసులుబాటు ద్వారా నిత్యం లక్షలాది మంది మహిళలు లబ్ధి పొందుతున్నారు. కాగా, సీనియర్ సిటిజన్లకు కూడా ఉచిత బస్సు పాస్‌లు జారీ చేసే ప్రతిపాదనను ఆర్టీసీ అధికారులు సీరియస్‌గా పరిశీలిస్తున్నారు. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే మహిళలతో పాటు, పురుషుల్లోని వయోవృద్ధులకు కూడా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి రానుంది. దీనికి సంబంధించి అర్హులైన సీనియర్ సిటిజన్లు అందరికీ ప్రత్యేక ఉచిత పాస్‌లు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్టీసీ అధికారవర్గాల ద్వారా తెలియవచ్చింది. వాటి ద్వారా ఛార్జీలు లేకుండా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించనున్నారు. ఇందుకు గాను వయో పరిమితి, ఇతర విధివిధానాలు, నిబంధనలు ఖరారు చేసే పనిలో అధికారులు నిమగ్నమై ఉన్నారు. ప్రస్తుతం ఈ పథకం చర్చలు, పరిశీలన దశలోనే ఉన్నందున విధివిధానాలు పూర్తయిన తర్వాత ఎప్పటి నుంచి అమలు చేస్తారనే విషయాన్ని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించనుంది. వృద్ధులకు రవాణా ఖర్చుల భారాన్ని తగ్గించేలా రాబోతున్న ఈ నిర్ణయాన్ని త్వరలో అందుబాటులోకి తీసుకు రానున్నట్లు అధికారవర్గాలు వెల్లడించాయి.

# రాజన్న ఆలయ పనులు చరిత్రలో నిలిచిపోవాలి

### వేములవాడ విస్తరణ, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి: మంత్రి పొన్నం ప్రభాకర్

**సిరిసిల్ల బ్యూరో, ప్రభాతవార్త :** వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ విస్త రణ, అభివృద్ధి పనులు చరిత్రలో నిలిచిపోయేలా ఉండాలని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. పనులన్నింటినీ నిర్ణీత గడువులోగా వేగంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో వేములవాడ పట్టణ పరిధిలో వీటీఏడీఏ ఆధ్వర్యంలో చేపడుతున్న దేవస్థానం విస్తరణ, నిత్యాన్నదాన సత్రం, 80 ఫీట్ల రోడ్డు నిర్మాణం, బద్ది పోచమ్మ ఆలయ అభివృద్ధి పనులపై వివిధ శాఖల అధికారులతో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా రాజన్న ఆలయ పనులు చరిత్రలో నిలిచిపోవాలి సమీక్షించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం వస్తున్న భక్తుల రద్దీతోపాటు భవిష్యత్తులో పెరిగే రద్దీకి అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా అన్ని వసతులు కల్పించాలని సూచించారు.

అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రతి పనికీ గడువు విధిస్తూ పూర్తి చేయాలన్నారు. రాష్ట్రంలో ఆధ్యాత్మిక పర్యాట కాన్ని విస్తరిం చేందుకు ప్రజా ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకెళ్తోందన్నారు. 80 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజన్న ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులను పూర్తిచేసే అవకాశం రావడం పూర్వజన్మ సుకృతమని, అధికారులు పూర్తిస్థాయిలో నిమగ్నమై బాధ్యతగా పనిచేయాలన్నారు. జిల్లాలోని కార్మిక, ధార్మిక ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని వివరించారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రతివారం క్షేత్ర స్థాయిలో పనులను పరిశీలిస్తూ సమీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, ఆర్ అండ్ బీ సీఈ రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 'కాకా' ఆలోచనలు ఆదర్శనీయం

### జి.వెంకటస్వామి 97వ జయంతి వేడుకల్లో వక్తలు



జి. వెంకటస్వామి చిత్రపటానికి పుష్పాంజలితో ఘననివాళులర్పిస్తున్న దత్తాత్రేయ, జానారెడ్డి, కెకె, వివేక్, వినోద్, నరసింహారెడ్డి, వంశీకృష్ణ, పొన్నం ప్రభాకర్ తదితరులు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), అక్టోబరు 5, ప్రభాతవార్త :** సమాజంలోని బడుగు బలహీన అణగారిన వర్గాల కోసం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాకారానికి నిర్విరామంగా పాటుపడిన ప్రజా నాయకుడు గడ్డం వెంకటస్వామి (కాకా) అని, ఆయన ఆలోచనలు, ఆశయాలు అందరికి ఆదర్శనీయం, ఆచరణయోగ్యమని, యువతరం ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాలని వక్తలు అన్నారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో సోమవారం సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి పర్యవేక్షణలో రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి అధ్యక్షతన ప్రభుత్వపరంగా గడ్డం వెంకటస్వామి 97వ జయంతి వేడుకలు నిర్వహించారు. అతిథులుగా హర్యానా, హిమాచల్‌ప్రదేశ్‌ల మాజీ గవర్నరు బండారు దత్తాత్రేయ, రాష్ట్ర బిసి సంక్షేమ, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజరుద్దీన్, ఎంపి గడ్డం వంశీకృష్ణ, కె.జానారెడ్డి, కె.కేశవ రావు, రాజయ్య, వాణీ ప్రసాద్ తదితరులు పాల్గొని జ్యోతి ప్రకాసనంచేసి వెంకట స్వామి చిత్రపటానికి పూలమాలవేసి పుష్పాం జలితో ఘననివాళు లర్పించి ప్రసంగించారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా గడ్డం వెంకటస్వామి వ్యక్తిత్వాన్ని అన్ని పార్టీల నాయకులు గౌరవించాయని పేర్కొ న్నారు. తెలంగాణ ప్రజల హృదయాల్లో కాకాగా ఆయనకు ప్రత్యేకస్థానం కలకాలం ఉంటుందని దత్తాత్రేయ కీర్తించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కె.జానారెడ్డి జి.వెంకటస్వామి దేశంలో ప్రత్యేకంగా నేషనల్ హట్స్ సంస్థను స్థాపించి భారతదేశవ్యాప్తంగా ఉన్న పేదలకు నివాస స్థలాల కోసం పోరాటం చేశారని గుర్తుచేశారు. మతాలకు అతీతంగా దేశ సమగ్రతను కాపాడు కుంటూ ఆయన ఆశయాలను నెరవేర్చేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అధ్యక్షోపన్యాసంలో మంత్రి జి.వివేక్ తన తండ్రి వెంకటస్వామి సూచన మార్గదర్శకంలో ఆయన స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చి తనవంతు ప్రజాసేవ చేస్తున్నానని తెలిపారు. కాకా కుమారుడిగా జన్మించడం తన అదృష్టమని, తండ్రి చూపిన బాటలోనే పయనిస్తూ పేదలు, బలహీనవర్గాల సంక్షేమం కోసం పనిచేయడం తన బాధ్యతగా భావిస్తు న్నానని పేర్కొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ వెంకటస్వామి కార్మిక పక్షపాతిగా కూడా నిరంతరం వారి సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం అహర్నిశలు పనిచేశారని, అంబేద్కర్ విదానాలు, స్ఫూర్తితోనే పేదలకు వివిధ సేవలు, పేద విద్యార్థులు విద్యనభ్యసించేందుకు విద్యాసంస్థను ఏర్పాటుచేసి ఉచిత విద్య అందించారని గుర్తుచేశారు. ఎంపి గడ్డం వంశీకృష్ణ తన తాత వెంకటస్వామి తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొని బుల్లెట్ గాయాలను కూడా లెక్కచేయ లేదన్నారు. సాకారం చేసుకున్న తెలంగాణ రాష్ట్ర సాధనాంతర 10 సంవత్సరాల్లో కాకా ఆశయాలు, ఆశించిన పరిణామాలేవీ చోటుచేసుకోలేదని ఆవేదన వ్యక్తపరుస్తూ ఆయన ఆశయాలు, ఆలోచనలకు అనుగుణంగా భవిష్యత్తులో ముందుకు సాగుతానని, సాగుదామని పిలుపు నిచ్చారు. గడ్డం వినోద్ మాట్లాడుతూ కేంద్రం కాకా, అంబేద్కర్ ఆశయాలకు విరుద్ధంగా పోతుందని, సర్ పేరుతో ప్రతీ రాష్ట్రంలో లక్షలాది ఓట్లు చోరీచేస్తూ ప్రజలకు మోసం చేస్తుందని ఈ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎలుగెత్తి చాటుతూ సర్‌కు విరుద్ధంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన దేశవ్యాప్త పోరాటానికి ముందుండి మద్దతుగా నిలుస్తానని వాగ్దానం చేశారు.

### ఆరోపణలకు సమాధానం చెప్పకుండా

# అసత్యప్రచారం తగదు

### మాజీమంత్రి కెటిఆర్‌పై ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ ఆగ్రహం

**హైదరాబాద్, అక్టోబరు6,ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పార్టీ పదేళ్ల రాష్ట్రంలో అధికారంలో ఉండి రాబందుల్లా రాష్ట్రాన్ని ఏవిధంగా దోచుకున్నారో, కల్వకుంట్ల కుటుంబ ఆస్తులు ఎలా పెరిగాయో ఆధారాలతో సహ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారనీ దానికి సమాధానం చెప్పకుండా అసత్యప్రచారంతో తెలంగాణ సమాజాన్ని అవమానపరస్తున్నారని ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ ఆగ్రహం వ్యక్తంచేశారు. సిఎల్‌పిలో ఆయన సోమవారం మాట్లాడుతూ సిరిసిల్ల సభలో కెటిఆర్ స్టార్ హోటళ్ల భాగోతాన్ని బయటపెట్టారనీ ఆస్తుల వ్యవహారంపై సమాధానం చెప్పే సోయి కెటిఆర్‌కు లేదని అక్రమ సంబధాలు అంటగడుతూ సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని విమర్శించారు. ఇలా అభ్యంతర కరమైన ప్రచారం చేయకూడదనే మనస్సులేదా. మీ ఇంట్లో అక్కా, చెల్లెళ్లు లేరా..? మీ ఇంట్లో ఆడవాళ్లు లేరా..?మీ ఇంట్లో ఆడవాళ్ల మీద అక్రమ సంబంధాలు అంటగట్టి ప్రచారం చేస్తే మీరు ఊరుకుంటారా..? జీర్ణించుకుంటారా..?కొంచెమైనా సోయి ఉందా..?నీ ఇంటి ఆడబిడ్డను బయటకు నెట్టేశావు.. ఆమె ప్రశ్నలకు సమాధానం చెప్పే సోయి లేదు.. అని ప్రశ్నించారు. సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని కెసిఆర్,కెటిఆర్ ఆపించకపోతే మర్యాదగా ఉండదనీహెచ్చరించారు. గతంలో మేం ఇచ్చిన ఫిర్యాదులపై పోలీసు శాఖ సరైన చర్యలు తీసుకోవడం లేదనీ ఇప్పటికైనా తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలనీఆయన డిమాండ్ చేశారు. కట్టుదిట్టమైన కేసులు పెట్టాలనీ కోర్టు ఆదేశాలంటూ పోలీసులు కేసులు పెట్టడం లేదనీ ఆవేదన చెందారు. మహిళలను అవమానించేలా, అధైర్యపరిచేలా బిఆర్ఎస్ చేస్తోందనీ ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు..తెలంగాణలో ఇలాంటి సంస్కృతి ఎప్పుడూ లేదు.. బిఆర్ఎస్ ప్రోత్సహిస్తోంది.. అని అనారు. కెటిఆర్ నీ జాతకం అంతా సోషల్ మీడియాలో పెడితే తలెత్తుకోలేవనీ అన్నారు. కెటిఆర్ నీ చిల్లర చేష్టలు మానుకోవాలి..సోషల్ మీడియాలో విష ప్రచారం సంస్కృతిని ఆపాలి..బాధిత మహిళలు ఆత్మహత్య చేసుకుంటే ఎవరు బాధ్యత వహిస్తారు..? అని ప్రశ్నించారు.

# మైనింగ్‌తో రామప్పకు ముప్పుండదు

### శాస్త్రీయ అధ్యయనం తర్వాతే ముందుకు

### సింగరేణి సిఎండి డాక్టర్ ప్రకాష్

**హైదరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త:** సింగరేణి మైనింగ్‌తో ప్రపంచ వారసత్వ సంపద అయిన రామప్ప గుడికి ముప్పు పొంచి ఉందని వస్తుని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని ఆ సంస్థ సిఎండి డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి స్పష్టం చేశారు. అవన్నీ కేవలం అపోహలు, అవాస్తవాలు మాత్రమే అని సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు. సింగరేణి ఆధ్వర్యంలో ములుగు జిల్లా వెంకటాపూర్ లో చేపట్టాలని తలపెట్టిన వెంకటాపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు విషయంలో సమగ్రంగా, శాస్త్రీయ అధ్యయనం చేసిన తర్వాతే ముందుకు వెళ్లాలని నిర్ణయించామని తేల్చిచెప్పారు. ఈ విషయంలో భారత పురావస్తు శాఖ, ఇతర ప్రతిష్టాత్మక సంస్థలు శాస్త్రీయంగా అధ్యయనం చేసి ఇచ్చే నివేదికల ఆధారంగానే తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని వెల్లడించారు. బాధ్యతాయుతమైన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్న సింగరేణి తెలంగాణకు చెందిన ప్రపంచ వారసత్వ సంపద అయిన రామప్ప గుడికి ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టం చేకూర్చబోదని పునరుద్ఘాటించారు. వారసత్వ సంపద పరిరక్షణకు కట్టుబడి ఉంటుందని వెల్లడించారు. పర్యావరణహితమైన చట్టబద్ధమైన మైనింగ్ కార్యకలాపాలు మాత్రమే సింగరేణి అధిక ప్రాధాన్యాలు అని పేర్కొన్నారు.

# ఉద్యాన శాఖ బలోపేతంపై దృష్టి సారించాలి

### రాష్ట్ర ఉద్యాన శాఖ అధికారుల సంఘం

**హైదరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉద్యాన శాఖ నిర్లక్ష్యానికి గురై, అత్యంత బలహీన స్థితిలో ఉందని ఉద్యాన శాఖ రాష్ట్ర అధికారుల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వాలు శాఖ బలోపేతంపై తగిన దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపింది. రాష్ట్రంలో ఉద్యాన రంగం విస్తరిస్తున్నప్పటికీ, అందుకు అనుగుణంగా శాఖలో మానవ వనరులు పెరగలేదని తెలిపింది. హైదరాబాద్‌లోని ఉద్యాన శిక్షణా సంస్థలో ఉద్యాన శాఖ ఉద్యోగులు, టీజీవో, టీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గం సమక్షంలో శాఖలోని సమస్యలు, ఉద్యాన రంగ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఉద్యాన శాఖను బలోపేతం చేసి, అధికారుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరింది. ప్రస్తుతం ఒక్కో ఉద్యాన అధికారి 5 నుంచి 10 మండలాలకుపైగా బాధ్యతలు నిర్వహించాల్సి వస్తోందని సంఘం తెలిపింది. దీంతో రైతులకు సాంకేతిక సేవలు, పథకాల అమలు, ఫీల్డ్ వెరిఫికేషన్, జియోట్యాగింగ్, రైతు శిక్షణలు తదితర కార్యక్రమాలపై పని భారం పెరిగిందని పేర్కొంది. ఉద్యాన పంటల విస్తీర్ణం, రైతుల సంఖ్య, పథకాలు గణనీయంగా పెరిగినా శాఖలో గతంలో ఉన్న క్యాడర్ స్ట్రెంత్‌తోనే కొనసాగుతున్నామని సంఘం తెలిపింది. 198283 నాటి క్యాడర్ నిర్మాణాన్ని ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా పునఃసమీక్షించి కొత్త క్యాడర్ స్ట్రెంత్ రూపొందించాలని కోరింది. ఉద్యాన రంగం రాష్ట్ర గ్రాస్ వ్యాల్యూ అవుట్పుట్లో సుమారు 30 శాతం వాటా కలిగి ఉండగా, మొత్తం సాగు విస్తీర్ణంలో ఉద్యాన పంటల వాటా సుమారు 6 శాతమేనని సంఘం తెలిపింది.దీర్ఘకాలంగా పనిచేస్తున్న అర్హత కలిగిన అధికారులకు పదోన్నతులు కల్పించాలని, శాఖలోని డైరెక్ట్ రిక్రూట్మెంట్ తిదీ పోస్టులను రద్దు చేయాలని కోరింది. ఉద్యాన అధికారుల డిమాండ్లు వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా శాఖ భవిష్యత్తు, రైతుల సంక్షేమం, రాష్ట్ర వ్యవసాయ రంగ అభివృద్ధికి సంబంధించిన న్యాయమైన డిమాండ్లని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి క్యాడర్ పునఃసమీక్ష, ఖాళీల భర్తీ, పదోన్నతులు, క్షేత్రస్థాయి సిబ్బంది పెంపు వంటి అంశాలపై చర్యలు తీసుకోవాలని ఉద్యాన శాఖ అధికారుల సంఘం కోరింది.

### ఎల్‌నినో నేపథ్యం.. రబీలో వరికి ప్రత్యామ్నాయంగా

# స్వల్పకాలిక పంటల సాగుకు ప్రోత్సాహం

### వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్

**హైదరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త :** ఎల్‌నినో నేపథ్యంలో ఈ రబీ సీజనులో వరికి ప్రత్యామ్నాయ పంట వైపు దృష్టిసారంచాలని వ్యవసాయ శాఖ కార్యదర్శి కె సురేంద్రమోహన్ సూచించారు. రబీ (యాసంగి) 2026-27 కార్యాచరణ ప్రణాళికపై హైదరాబాద్‌లో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యంగా తక్కువ నీటితో సాగయ్యే స్వల్పకాలిక పప్పుధాన్యాలు, నూనె గింజల పంటలతో పాటు, అధిక ఆదాయాన్నిచ్చే కూరగాయల పంటల సాగు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులకు అందుబాటులో ఉన్న నీటి వనరులు, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలన్నారు. పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల వారీగా రబీ సీజన్‌కు సంబంధించిన సమీక్షా సమావేశాలు నిర్వహించాలన్నారు. క్షేత్రస్థాయి నుంచి సేకరించిన అంశాలను క్రోడీకరించి, రబీ కార్యాచరణ ప్రణాళికను రూపొందించి ప్రభుత్వానికి నివేదించనున్నట్లు చెప్పారు. క్షేత్రస్థాయి అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు తక్కువ నీటితో పండే పంటల ఎంపిక, అనువైన విత్తన రకాలు, పంట యాజమాన్య పద్ధతులపై విస్తృతంగా అవగాహన కల్పించాలని చెప్పారు. రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సందేహాలను నివృత్తి చేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని వ్యవసాయ కమిషనరేట్ కార్యాలయంలో ఎరువుల కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. యాసంగి సీజన్‌కు సరిపడా ఎరువుల సరఫరా, ప్రస్తుత నిల్వల స్థితిగతులపై సమీక్షించారు. రాబోయే సీజన్‌లో ఎరువుల కొరత లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ డైరక్టర్ డాక్టర్ బి. గోపి, ఉద్యాన శాఖ డైరక్టర్ డాక్టర్ యాస్మీన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# డిసెంబరు 11 నుంచి 22 వరకు ఖేలో ఇండియా యూత్ గేమ్స్

### ప్రారంభ కార్యక్రమానికి పిఎం మోడీని ఆహ్వానించనున్న రాష్ట్ర సర్కార్

**హైదరాబాద్,అక్టోబరు5,ప్రభాతవార్త:** హైదరాబాద్ సహా ఆరు నగరాల్లో ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను నిర్వహించనున్నారు. కేఐవైజీని ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది. ప్రారంభ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్యఅతిథిగా హాజరయ్యే అవకాశముంది. కేఐవైజీ ఆర్గనైజింగ్ కమిటీ ఛైర్మన్‌గా సీఎం రేవంత్‌రెడ్డి ఉండనున్నారు. కేఐవైజీ ఆర్గనైజింగ్ కమిటీ కోఛైర్మన్‌గా కేంద్ర క్రీడా మంత్రి మన్సుఖ్ మాండవీయను నియమించారు. హైదరాబాద్, హనుమకొండ, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల్లో కేఐవైజీ పోటీలు నిర్వహించనున్నారు. కేఐవైజీలో మొత్తం 27 క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. డిసెంబరు 11 నుంచి 22 వరకు ఖేలో ఇండియా యూత్ గేమ్స్ జరగనున్నాయి.

దేశవ్యాప్తంగా 7,500 మందికి పైగా యువ క్రీడాకారులు, 1,500 మంది సహాయక సిబ్బంది, 1,000 మందికి పైగా సాంకేతిక నిపుణులు ఈ టోర్నీలో పాల్గొననున్నారు. రాష్ట్ర క్రీడా వ్యవస్థను ఒలింపిక్ పతకాలు సాధించే స్థాయికి తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం గతేడాది తెచ్చిన తెలంగాణ స్పోర్ట్స్ పాలసీ2025 స్ఫూర్తితో ఈ వేదికలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 27 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. హనుమకొండలో అథ్లెటిక్స్, కరీంనగర్‌లో జూడో, ఖమ్మంలో ఆర్చరీ, మహబూబ నగర్‌లో కబడ్డీ, నిజామాబాద్‌లో టేబుల్ టెన్నిస్ పోటీలు జరగనుండగా, మిగిలిన క్రీడాంశాలు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, ఎల్‌బీ స్టేడియం, సరూర్‌నగర్, జేఎన్‌టీయూహెచ్, సికింద్రాబాద్, యూసుఫగూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియాల్లో నిర్వహించనున్నారు. తెలంగాణ ఆతిథ్య క్రీడగా రోయింగ్, ప్రదర్శన క్రీడగా సెయిలింగ్ నిలవనున్నాయి. ముఖ్యంగా హుస్సేన్‌సాగర్ వాటర్ స్పోర్ట్స్ కేంద్రంలో నిర్వహించనున్న రోయింగ్, కయాకింగ్, కానోయింగ్ పోటీలు ఈ టోర్నమెంట్‌కే ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి.

ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, సైక్లింగ్, జిమ్నాస్టిక్స్, ఫెన్సింగ్, ఫుట్‌బాల్, హాకీ, జూడో, ఖోఖో, కబడ్డీ, షూటింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, టెన్నిస్, వాలీబాల్, వెయిట్‌లిఫ్టింగ్, రెజ్లింగ్‌తోపాటు గట్కా, మల్లఖంబ్, కలరిపయట్టు, థాంగ్‌టా, యోగాసన వంటి క్రీడలు ఇందులో చోటు దక్కించుకున్నాయి. క్రీడల విజయవంతం కోసం ప్రభుత్వం ఐదు రాష్ట్రస్థాయి కమిటీలను ఏర్పాటు చేసింది. క్రీడాకారులు, అతిథుల వసతి, భోజనం, రవాణా ఏర్పాట్ల పర్యవేక్షణ కోసం ప్రత్యేక ఉన్నత స్థాయి కమిటీ పనిచేయనుంది. హైదరాబాద్‌తో పాటు ఇతర వేదికల్లోని క్రీడాకారుల గదులు, ప్రేక్షకుల సౌకర్యాలు, మరుగుదొడ్లు, స్విమ్మింగ్ పూల్స్, సైక్లింగ్ ట్రాక్‌లు, షూటింగ్ రేంజ్‌లను ఆధునికీకరిస్తూ మెరుగైన వసతులు కల్పించనున్నారు.

# సింగరేణి కార్మికులకు రూ.1,10,250 బోనస్

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త:** రానున్న దసరా, దీపావళి, నవరాత్రుల పండుగల కానుకగా సింగరేణి కార్మికులకు ఒక్కొక్కరికి రూ.1,10,250 చొప్పున బోనస్ ఇవ్వాలని నిర్ణయమైందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. దేశానికి వెలుగులు పంచేందుకు పగలు, రాత్రి కష్టపడి పనిచేస్తున్న సింగరేణి కార్మికుల శ్రమ వెలకట్టలేనిది. సింగరేణి బొగ్గు ఉత్పత్తి సంస్థ మాత్రమే కాదు. సింగరేణి పరిశ్రమ మన తెలంగాణ రాష్ట్రానికి కొంగు బంగారం. లక్షలాది కుటుంబాలకు జీవనాధారం. దేశాభివృద్ధిలో, తెలంగాణ అభివృద్ధిలో కీలక భాగస్వామి. సింగరేణి కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, సింగరేణి భవిష్యత్తు కోసం సింగరేణి యాజమాన్యం, కార్మికులు మరింత సమన్వయంతో పనిచేయాలని కోరుతున్నానని అన్నారు. ప్రస్తుత అవసరాలు, భవిష్యత్తు దృష్ట్యా సింగరేణి కూడా బొగ్గు ఉత్పత్తిని మరింతగా పెంచేందుకు ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని, దేశ ప్రగతిలో, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో సింగరేణి మరింత కీలకపాత్ర పోషించాలని కోరుతున్నాను. తెలంగాణ ప్రభుత్వం కూడా సింగరేణికి ఇవ్వాల్సిన రూ.60 వేల కోట్లను వెంటనే విడుదల చేయాలని కోరుతున్నాను. సింగరేణి కార్మికులకు, ఉద్యోగులు వారి కుటుంబసభ్యులకు దసరా, దీపావళి పండుగల సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

# గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్‌లో ఉత్కంఠ

## ముగ్గురు ఎమ్మెల్సీల పదవీకాలం నవంబరుతో పూర్తి

### సామాజిక సమీకరణాల ప్రామాణికతతో అభ్యర్థుల ఎంపిక.. ఆశావహుల్లో అనిశ్చితి

**హైదరాబాద్, అక్టోబరు 5,ప్రభాతవార్త:** తెలంగాణలో గవర్నర్ కోటా కింద నియామకమైన ముగ్గురు శాసనమండలి సభ్యుల పదవికాలం నవంబర్‌లో ముగిసిపోతుండటంతో వారి స్థానంలో కొత్తవారిని నియామకం చేయడానికి కాంగ్రెస్ పార్టీ ఎంపిక ప్రక్రియకు పదనుపెట్టింది. గవర్నర్ కోటా ఆశించే ఔత్సాహికుల జాబితాను ఏఐసిసికి పంపిపి హైకమాండ్ సమ్మతితో అక్టోబరు చివరి వారంలో జరుగబోయే రాష్ట్ర క్యాబినెట్‌లో చర్చించి మంత్రి మండలి ఆమోదంతో రాజ్‌భవన్‌కు పంపడానికి ప్రభుత్వం ముమ్మురంగా యత్నం చేస్తోన్నది. దసరపండగలోగా హైకమాండ్ రాష్ట్రంలోని ముఖ్యనేతలతో చర్చించి అభ్యర్థుల పేర్లు ఖరారుచేసే అవకాశం ఉంది .ప్రస్తుతం ఎన్నికలు జరుగబోయే రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు అర్థ అంగబలం ప్రాధ్యనతతో రెడ్డి సామాజికవర్గంకు మాత్రమే ఇవ్వడం జరిగింది. నామినేటెడ్‌పోస్టుల విష యంలో అంగఅర్థబలం పెద్దగా అవసరం లేకపోవడంతో బ్రాహ్మణ,ఎస్‌సి,బిసిలకు వీటిని కేటాయించాలని పార్టీ ఒక ముందస్తు నిర్ణయానికి వచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిరిసిల్ల సభలో పద్మశాలి సామాజికవర్గంకు ఇచ్చినహామీకి అనుగుణంగా ఒకరికి అవకాశం కల్పించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

పద్మశాలి సామాజిక వర్గం నుంచి కొండాలక్ష్మన్ బాపూజి కుటుంబ సభ్యులకు లేదా కైలాస్‌నేత, అనిల్ పేర్లను పరిశీలిస్తున్నారని పార్టీలో చర్చ జరుగుతోంది. ఎస్‌సి కోటాలో ఒకటి మాదిగ సామాజికవర్గంకు కేటాయించాలనే ఆలోచన ఏఐసిసి నుంచి సంకేతాలు వెలువడినట్లు తెలిసింది. దీనితో దొమ్మాట సాంబయ్య,చారకొండ వెంకటేష్‌పేర్లు పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

అయితే మాదిగ సామాజిక వర్గంలో పట్టు ఉన్న మరో వ్యక్తి పేరు అందరిని ఆశ్చర్యపరిచేలా వస్తోందని పార్టీలోని కీలకమైన ఓవ్యక్తి అంటున్నారు.ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ పేరు ప్రస్తుతానికి బ్రాహ్మణ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం దక్కుతుందని బలంగా కాంగ్రెస్ శ్రేణులు ఆశిస్తున్నప్పటికి ఆ సామాజిక ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఒక ప్రముఖ మేధావి పేరుతోపాటు మంథని ప్రాంతంకు చెందిన ఒక పారిశ్రామిక వేత్త పేరు కూడా పరిశీలిస్తున్నట్లు తెలిసింది. శాసనసభలో కీలక బాధ్యతలు వ్యవహరిస్తున్న సోదరుడికి తోడు మండలిలో మరొకరని అదే కుటుంబం నుంచి చోటు కల్పించాలని ముఖ్యంగా ఏఐసిసి అగ్రనేత రాహుల్‌గాంధీ అత్యంత సుముఖంగా ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

కేవలం సామాజిక సమీకరణాలు మాత్రమే కాకుండా ప్రభుత్వంకు సుదీర్ఘకాలం ప్రతికూల వాతావర్ణంలో కూడా పనిచేసిన నేతలపేర్లను కూడా పరిశీలించినట్లు తెలిసింది.

రాబోయే రాజకీయ పరిణామాలు స్థానిక సంస్థల ఎన్నికలు దృష్టిలోఉంచికొని అన్నివర్గాల ఆమోదం ఉండేటా సమర్థులకోసం వేటాడుతున్నారు.

# భారత ప్రజాస్వామ్య వ్యవస్థను చూసి ఓర్వలేని కాంగ్రెస్

## వారు గెలిస్తే ఇవిఎంలు, ఎన్నికల సంఘం మంచివి.. ఓడిపోతే నిందలా?

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు



సోమవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర పదాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త:** ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత విజయవంతమైన ప్రజాస్వామ్య దేశంగా భారతదేశం నిలిచిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు పేర్కొన్నారు. సోమవారం భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర పదాధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఎన్. గౌతం రావు, వీరేందర్ గౌడ్, వేముల అశోక్, రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ, సంస్థాగత సంయుక్త ప్రధాన కార్యదర్శి దశరథ్, కర్ణాటక రాష్ట్ర సహ ఇన్‌ఛార్జ్ డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షులు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు దిశానిర్దేశం చేశారు. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సైతం ప్రధాని నరేంద్ర మోడీతో మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం పనితీరును, ఎలక్షన్ గుర్తింపు కార్డులతో పార దర్శకంగా ఎన్నికలు నిర్వహించే విధానాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారని గుర్తుచేశారు. యావత్ ప్రపంచం మన ప్రజాస్వామ్యం, ఎన్నికల ప్రక్రియను చూసి గర్విస్తుంటే.. కాంగ్రెస్ పార్టీ మాత్రం దేశంపై, ఎన్నికల సంఘంపై ఏడుస్తూ అవాకులు చవాకులు పేలుతోందని మండిపడ్డారు. ఒక సాధారణ చాయ్‌వాలా దేశానికి ప్రధానమంత్రి కావడాన్ని ఆ పార్టీ జీర్ణించుకోలేకపోతోందని, నెహ్రూ కుటుంబం నుంచే ప్రధాని కావాలనే సంకుచిత భావనతో దేశంలో జరిగిన ఎన్నికలన్నీ చెల్లవంటూ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ఎన్నికలు చెల్లవనుకుంటే.. మొదట తెలంగాణలో అక్రమంగా గెలిచిన రేవంత్ రెడ్డి చేత, అలాగే కేరళం, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రుల చేత రాజీనామాలు చేయించాలని సవాల్ విసిరారు. ఎన్నికల్లో తాము గెలిస్తే ఈవిఎంలు, ఈసి మంచివని.. ఓడిపోతే మాత్రం వాటిపై నిందలు వేయడం కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని తీవ్రంగా మండిపడ్డారు.

**చొరబాటు దారుల ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ గగ్గోలు**

గతంలో కాంగ్రెస్ పరిపాలించిన కాలంలో విదేశాల నుంచి అక్రమ చొరబాటుదారులు మన దేశంలోకి వచ్చి, అడ్డదారుల్లో రేషన్ కార్డులు సంపాదించి, ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు చేసుకున్నారని రాంచందర్ రావు తెలిపారు. హైదరాబాద్‌లోని మహేశ్వరం నియోజకవర్గంలోనే సుమారు 30 వేల మంది రోహింగ్యాలు, అక్రమ ఓటర్లు ఉన్నట్లు తేలిందన్నారు.

చొరబాటుదారుల పేర్లను జాబితా నుంచి తొలగిస్తుంటే ఓడిపోతామనే భయంతోనే కాంగ్రెస్, ఇండి కూటమి నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. భారతీయ జనతా పార్టీ రాజ్యాంగాన్ని సంపూర్ణంగా గౌరవించే పార్టీ అని, ఏ మతానికి చెందిన వారైనా సరే 18 ఏళ్లు పైబడిన భారత పౌరులకు కచ్చితంగా ఓటు హక్కు ఉండి తీరాలని బిజెపి స్పష్టం చేస్తోం దన్నారు. బిజెపి కేవలం ఎన్నికల రాజకీయాలకే పరిమితం కాకుండా నిరంతరం ప్రజలకు, దేశానికి సేవ చేసే సైన్యమని రాంచందర్ రావు పేర్కొన్నారు. రక్తదాన శిబిరాలు, స్వచ్ఛభారత్ వంటి ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు పార్టీ తరపున నిరంతరం చేపడుతున్నామని గుర్తుచేశారు. ఈ క్రమంలో సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ఈ నెల 7వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లా కేంద్రంలో సేవా జ్యోతి యాత్ర, వికసిత్ భారత్ సంకల్ప సభ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆయా జిల్లాల్లోని అన్ని మండలాల నుంచి కార్యకర్తలు, నాయకులు ఉదయం 9:00 గంటలకే పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

# దేశంలోనే తొలిసారి, జాతీయ రహదారి వెంట 35 వేల జీడిమామిడి మొక్కలు

## రామాయంపేట-సిద్దిపేట మధ్య ఎన్‌హెచ్-765 వెంట భారీ ప్లాంటేషన్ కార్యక్రమం

### మెదక్‌లో నేడు ప్రారంభించనున్న గవర్నర్ శివప్రతాప్‌శుక్లా

**హైదరాబాద్,అక్టోబరు5,ప్రభాతవార్త:** రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్‌శుక్లా మంగళవారం మెదక్ జిల్లాలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా దేశంలోనే తొలిసారిగా జాతీయ రహదారి వెంట 35 వేల జీడిమామిడి మొక్కలు నాటే కార్యక్రమాన్ని రామాయంపేటలో ప్రారంభించనున్నారు. మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు ఆధ్వర్యంలో ఎన్‌హెచ్765 జాతీయ రహదారి వెంట రామాయంపేట నుంచి సిద్దిపేట వరకు సుమారు 35 వేల జీడిమామిడి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నారు. జాతీయ రహదారి వెంట ఒకేసారి ఇంత భారీ స్థాయిలో జీడిమామిడి మొక్కలు నాటడం దేశంలోనే ఇదే తొలిసారి. జాతీయ రహదారి వెంబడి అందు బాటులో ఉన్న భూమిని ఉత్పాదకంగా వినియోగించుకోవడంతోపాటు పచ్చదనాన్ని, పర్యావరణ సుస్థిరత. ప్రోత్సహించే లక్ష్యంతోభారతదేశంలో చేపట్టిన మొట్టమొదటి కార్యక్రమాన్ని గవర్నర్ శివప్రతాప్ శుక్లా సాయంత్రం 3.30 గంటలకు రామాయంపేటలోని అమోఘ్ హోటల్ సమీపంలో స్వామి వివేకానంద విగ్రహం వద్ద ప్రారంభిస్తారు. సాయంత్రం 3.30 నుంచి 4.30 గంటల వరకు కార్యక్రమంలో పాల్గొంటారు.

**ఐడిఓసిలో నషా ముక్త్ భారత్ ర్యాలీ ప్రారంభం**

మెదక్ జిల్లా పర్యటనలో భాగంగా గవర్నర్ మధ్యాహ్నం 2.30 గంటలకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)కి చేరుకుంటారు. 2.40 గంటలకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నిర్వహించే నషా ముక్త్ భారత్ ర్యాలీని ప్రారంభిస్తారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. 2.50 గంటలకు ఐడీఓసీలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి స్టాళ్లను సందర్శించి, స్వయం సహాయక సంఘాల సభ్యులతో భేటీ అవుతారు.

# అంతర్జాతీయ ఆస్ట్రానమీ ఒలింపియాడ్-2026లో నారాయణ విద్యార్థుల ప్రభంజనం

## భారత్‌కు మూడు స్వర్ణ పతకాలు అందించి అబ్బురపరచిన నారాయణ స్కూళ్ల విద్యార్థులు

**హైదరాబాద్,అక్టోబరు5,ప్రభాతవార్త:** వియత్నాంలోని హనోయ్ నగరంలో ఘనంగా నిర్వహించిన 19వ అంతర్జాతీయ ఆస్ట్రానమీ, ఆస్ట్రో ఫిజిక్స్ ఒలింపియాడ్ (ఐఓఏఏ-2026) పోటీలలో భారత జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించిన నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు అద్భుత ప్రతిభకనబరిచి దేశానికి మూడు బంగారు పతకాలను అందించారు. ఈ అంతర్జాతీయ పోటీలలో భారత్ నుంచి ప్రాతినిధ్యం వహించిన ఐదుగురు సభ్యుల బృందంలో ముగ్గురు నారాయణ పాఠశాలల విద్యార్థులే కావడం విశేషం.





వీరిలో అక్షత్ శ్రీవాస్తవ (గురుగ్రామ్), ప్రాంజల్ దీక్షిత్ (హైదరాబాద్), మరియు సుమంత్ గుప్తా (మొహాలి) తమ అసాధారణ ప్రతిభతో ముగ్గుర స్వర్ణ పతకాలను కైవసం చేసు కున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 64 దేశాలు పాల్గొన్న ఈ ప్రతిష్టాత్మక పోటీలలో నారాయణ విద్యార్థుల విశేష కృషితో భారత్ సంయుక్తంగా మూడో స్థానాన్ని కైవసం చేసుకుని అంతర్జాతీయ స్థాయిలో దేశ ఖ్యాతిని చాటిచెప్పారు. ఈ సంద ర్భంగా నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ పి. సింధూర నారాయణ మాట్లాడుతూ ఐదుగురు సభ్యులతో కూడిన భారత జట్టులో పాల్గొన్న ముగ్గురు నారాయణ విద్యార్థులూ స్వర్ణ పతకాలు సాధించడం నారాయణ సంస్థకే కాకుండా యావత్ భారతదేశానికే గర్వకారణ మన్నారు. విద్యార్థులలో క్రమశిక్షణ, నిరంతర సాధన, అభ్యాసం పట్ల మ క్కువను పెంపొందించడం ద్వారానే ఇలాంటి విజయాలు సాధ్యమ వుతు న్నాయన్నారు. 17యేళ్లుగా అనుభవం, నైపుణ్యం, ఆత్మీయత అనే పునా దులపై నిర్మితమైన నారాయణ ప్రత్యేక ఒలింపియాడ్ శిక్షణ విధానం విద్యా ర్థులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ స్థానాల్లో నిలబెడుతోందన్నారు. విద్యార్థుల ప్రతిభకు సరైన మార్గదర్శకత్వం తోడైతే ఎలాంటి విజయాలనైనా సాధించవచ్చని అక్షత్, ప్రాంజల్, సుమంత్ నిరూపించారన్నారు.





# క్రీడలతో ఉద్యోగుల్లో వ్యక్తిత్వ వికాసం

## ఎల్ఐసి ఎండి సిఇఒ ఆర్.దొరైస్వామి

**బెంగళూరు, అక్టోబరు 5:** అఖిలభారత బీమా సంస్థఉద్యోగులకు నాలుగేళ్లుగా నిర్వహిస్తున్న వివిధ క్రీడాపోటీలను ఈ ఏడాది కూడా ఘనంగా ప్రారంభించారు. మొత్తం ఆరువిభాగాల్లో ఈ క్రీడాపోటీలను నిర్వహిస్తున్నారు. క్యారమ్స్, చెస్, టేబుల్‌టెన్నిస్, బ్యాడ్మింటన్, వాలిబాల్, అథ్లెటిక్స్ విభాగాల్లో ఈపోటీలు ఉంటాయని ఎల్ఐసి నిర్వాహకులు చెప్పారు,. తొలిరోజు క్రీడలను ఎల్ఐసి ఎండిసిఇఒ ఆర్ దొరైస్వామి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలల్లో ఉండే పోటీతత్వంతో ఉద్యోగుల్లో వ్యక్తిగత సామర్థ్యం పెంపొందుతుందని అన్నారు. తొలిరోజు మార్చ్ ఫాస్ట్‌తో నిర్వహించిన ఈక్రీడల్లో ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హెచ్‌ఆర్‌డి శిక్షణ విభాగం ఎస్ గిరిజ, కార్పొరేట్ కమ్యూనికేషన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.షెనాయ్, మరో ఈడీ లతా మదంపథ్, ఎస్ శరవణ రమేష్ సీనియర్ డివిజనల్ మేనేజర్ ఆర్కే యాదవ్ తదితరులు పాల్గొన్నారు. మొత్తం 376 మంది క్రీడాకారులు ఎనిమిదిజోన్లనుంచి ఈ క్రీడాపోటీల్లో పాల్గొంటున్నారు.

# ఫ్యూచర్ సిటీలో విదేశీ విశ్వవిద్యాలయాల క్యాంపస్‌ల ఏర్పాటు

## యంగ్ ఇండియా ఇంటెగ్రేటెడ్ స్కూళ్ల పనులు వేగవంతం : సిఎస్ సంజయ్‌జాజు సమీక్ష

**హైదరాబాద్,అక్టోబరు5,ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం, విద్యా మౌలిక వసతుల అభివృద్ధి, ఫ్యూచర్ సిటీలో అంతర్జాతీయ స్థాయి ఉన్నత విద్యా సంస్థల ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సీనియర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు, రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను దశలవారీగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. డిసెంబర్ 2027 నాటికి 67 పాఠశాలలను పూర్తి చేయడంతో పాటు, జూన్ 2028 నాటికి ఈ సంఖ్యను 87కు పెంచేలా పనులను వేగవంతం చేయాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. ప్రతి పాఠశాలను సుమారు 26 ఎకరాల విస్తీర్ణంలో అన్ని ఆధునిక సదుపాయాలతో నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు. అవసరమైన క్రీడా మైదానాలు, వసతి గృహాలు, సిబ్బంది క్వార్టర్లు, ఆధునిక వంటశాలలు, డిజిటల్ తరగతి గదులు తదితర మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షి స్తూ, నిర్దేశిత గడువుల్లో నాణ్యతా ప్రమాణాలతో పనులను పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు. ఈ స్కూళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ పాఠశాలలు ఒకే క్యాంపస్ లో ఉండే విధంగా నిర్మాణాలు చేపట్టారు. దేశంలో ఆదర్శవంతంగా ఉండే విధంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ఏర్పాటు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంను అంతర్జాతీయ విద్యా కేంద్రంగా అభివృద్ధి చేసే దిశగా ఫ్యూచర్ సిటీలో ప్రముఖ విదేశీ విశ్వవిద్యాలయాల క్యాంపస్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. లండన్ యూనివర్సిటీ వంటి ప్రముఖ అంతర్జాతీయ విద్యా సంస్థలను తెలంగాణకు ఆకర్షించేలా సమగ్ర విధానాన్ని రూపొందించాలని అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు లండన్ విశ్వవిద్యాలయం, బర్మింగ్‌హామ్ విశ్వవిద్యాలయంతో పాటు మరో 4 అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు ఫ్యూచర్ సిటీలో తమ బ్రాంచీలు ఏర్పాటు చేసేందుకు సుముఖత వ్యక్తం చేసాయని అధికారులు పేర్కొన్నారు. విదేశీ విశ్వవిద్యాలయాలను ఆహ్వానించడం, క్యాంపస్‌ల ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతులు, పెట్టుబడులు, అనుమతులు, విద్యా కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలను ఈ విధానంలో పొందుపరచాలని అన్నారు. తెలంగాణలో ప్రపంచస్థాయి విద్యా అవకాశాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాల విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని సీఎస్ పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీలో ప్రతిపాదిత అంతర్జాతీయ విద్యా సంస్థల ఏర్పాటుకు సంబంధించి ప్రముఖ విదేశీ విశ్వవిద్యాలయాలతో సంప్రదింపులు జరిపి, గ్లోబల్ సమ్మిట్ సమయానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను సి.ఎస్ ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేశ్ రంజన్, సబ్యసాచి ఘోష్, ముఖ్య కార్యదర్శులు సందీప్ కుమార్ సుల్తానియా, యోగితా రాణా, రాహుల్ బొజ్జ, ఉన్నత విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు.



# ఆ మూడు డిమాండ్లపై వెనక్కి తగ్గేదే లేదు

## ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే



**న్యూఢిల్లీ, అక్టోబరు 5:** ఎన్నికల వ్యవస్థకు సంబంధించిన మూడు అంశాలపై కాంగ్రెస్ పార్టీ తన వైఖరిని మరింత స్పష్టం చేసింది. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ రద్దు, ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికలు నిర్వహించడం, ఆ మూడు డిమాండ్ల విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. వీటిని పార్టీ రాజీ లేని డిమాండ్లుగా పేర్కొన్నారు. దేశవ్యాప్తం గా ఈ మూడు అంశాలపై కాంగ్రెస్ కార్యకర్తలు, ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీలు ఆందోళనలు చేస్తున్నాయని ఖర్గే తెలిపారు. ఎన్నికల వ్యవస్థకు సంబంధించిన అంశాలపై పోరాడుతున్న పౌర సమాజ సభ్యులు, యువజన సంఘాలకు కూడా కాంగ్రెస్ మద్దతుగా నిలుస్తుందని చెప్పారు. ఎక్స్‌లో ఖర్గే సోమవారం చేసిన పోస్టులో కాంగ్రెస్ డిమాండ్లను వరుసగా ప్రస్తావించారు. మొదటగా సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రెండోది ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలని కోరారు. మూడోది ఇకపై ఎన్నికలను బ్యాలెట్ పేపర్ ద్వారా నిర్వహించాలని పేర్కొన్నారు. ఆ మూడు అంశాలపై దేశవ్యాప్తంగా తమ పార్టీ, ఇండియా కూటమి భాగస్వామ్యాలు ఉద్యమిస్తున్నాయని ఖర్గే చెప్పారు. వివిధ ప్రాంతాల్లో ఇదే అంశాలపై ఆందోళనలు చేస్తున్న పౌర సమాజం, యువజన సంఘాలకు కాంగ్రెస్ అండగా ఉంటుందని వెల్లడించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై కొంతకాలంగా రాజకీయంగా వివాదం కొనసాగుతోంది. ప్రతిపక్ష పార్టీలు ఆ ప్రక్రియపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఓటర్ల తొలగింపు, ఓటర్ల జాబితాల పరిశీలన, సంబంధిత వివరాలకు సంబంధించిన అంశాలపై ఎన్నికల సంఘాన్ని ప్రశ్నిస్తున్నాయి. ఇటీవల ఎన్నికల సంఘంలోని ఇద్దరు కమిషనర్లు కొన్ని నిర్ణయాలు, ఫైళ్ల విషయంలో అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ ఆంగ్లపత్రికలో వచ్చిన కథనం కూడా ఈ వివాదాన్ని మరింత పెంచింది.

# డిసెంబరు 7 నుంచి 9 వరకు ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్

**హైదరాబాద్,అక్టోబరు 5, ప్రభాతవార్త:** డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సచివాలయంలో ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి సమీక్షించారు.ప్రతిష్ఠాత్మకమైన గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న ఏర్పాట్లను ప్రధాన కార్యదర్శి సమీక్షించారు. ఆయా శాఖలు ఇప్పటివరకు సాధించిన పురోగతిని అడిగి తెలుసుకున్న ఆయన షెడ్యూల్ ప్రకారం అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.తెలంగాణలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రముఖ కంపెనీల నుంచి సమ్మిట్‌కు విస్తృత భాగస్వామ్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. రాష్ట్రంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న అన్ని ప్రముఖ కంపెనీలకు సమ్మిట్ అడ్వైజరీ బోర్డు లేదా ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని ఆదేశించారు.

ప్రముఖ బహుళజాతి కంపెనీల గ్లోబల్ హెడ్‌లను సమ్మిట్‌కు ఆహ్వానించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అధికారులను ఆదేశించారు. అంతర్జాతీయ స్థాయి కంపెనీల అగ్ర నాయకత్వంతో అనుసంధానం ఏర్పరచి, ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో వారి భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ నెలలో విదేశాలలో రోడ్‌షోలను నిర్వహించాలని సిఎస్ ఆదేశించారు. ఈ రోడ్‌షోల ద్వారా తెలంగాణలోని పెట్టుబడి అవకాశాలు, వ్యాపార అనుకూల వాతావరణం, పెట్టుబడులకు అందుబాటులో ఉన్న అవకాశాలను అంతర్జాతీయ పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థల ప్రముఖులకు వివరించే అవకాశం లభిస్తుందని తెలిపారు. ఈ నెలాఖరున న్యూఢిల్లీలో కూడా రోడ్‌షో నిర్వహించాలని ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. అన్ని రంగాలకు సంబంధించిన టెండరింగ్ ప్రక్రియను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పూర్తి చేసినట్లు సమావేశంలో అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి కార్యాలయ సలహాదారు, ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు నవీన్ మిట్టల్, వాణి ప్రసాద్, ముఖ్య కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, సీఈఓ సెర్ప్ దివ్య, స్పెషల్ సీఐపీఆర్ ముకుంద రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# రూ.5,460 కోట్ల విద్యుత్ బాదుడు

>> మేర భారం వేయనున్నాయి. నవంబర్ నుంచి ట్రూ అప్ చార్జీలు వసూలుకు తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్ అనుమతిస్తూ సోమవారం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. నవంబర్ నెల నుండి ఒక్క యూనిట్ కు 30 పైసలు, డిసెంబర్ నుండి యూనిట్ కు 50 పైసలు చొప్పున వసూలు చేయనున్నాయి. రాష్ట్రంలోని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) 29 నెలలు, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్పీడీసీఎల్) 26 నెలల పాటు వసూలుకు అనుమతి ఇస్తూ నియంత్రణ కమిషన్ ఆమోదం తెలిపింది. 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన విద్యుత్ కొనుగోలు, ఆదాయ ట్రూఅప్ మొత్తాల్లో రూ.7,635.22 కోట్లను టీజీఎస్పీడీసీఎల్, టీజీఎన్పీడీసీఎల్ ద్వారా వసూలు చేసేందుకు తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్ మార్గాన్ని ఖరారు చేసింది. ఇందులో వ్యవసాయ రంగానికి సంబంధించిన రూ.2,214.99 కోట్లను రైతుల నుంచి వసూలు చేయకుండా ప్రభుత్వం నుంచి రాబట్టాలని ఆదేశించింది. మిగిలిన రూ.5,420.23 కోట్లను ఇతర అర్హత కలిగిన విద్యుత్ కనెక్షన్ల నుంచి వసూలు చేయాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుండి రూ.2215 కోట్లు, వినియోగదారుల నుంచి 5.420 కోట్లు వసూలుకు కమిషన్ ఆదేశించింది. అంతేకాకుండా నవంబర్ నుండి వసూళ్లకు సంబంధించిన ప్రతిపాదనలు డిస్కమ్‌ల అదనపు వ్యయాల సర్దుబాటు ప్రక్రియలో భాగమేనని పేర్కొంది. విద్యుత్ కొనుగోళ్లు, నిర్వహణ ఖర్చులు ప్రాథమిక అంచనాల కంటే పెరిగినప్పుడు, ఆ నష్టాలను భర్తీ చేసుకునేందుకు డిస్కమ్‌లు తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్‌ను అనుమతిని కోరుతుంటాయి. మొత్తంగా తెలంగాణ విద్యుత్ వినియోగదారులపై మరో ఆర్థిక భారం పడనుంది. టీజీఈఆర్సీ చైర్మన్ డాక్టర్ జస్టిస్ దేవరాజు నాగార్జున, సభ్యులు రఘు కంచర్ల, చెరుకూరి శ్రీనివాసరావులతో కూడిన కమిషన్ సోమవారం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. 2026 మార్చి 30న ఇచ్చిన ఉత్తర్వుల్లో వసూలు విధానాన్ని తరువాత నిర్ణయిస్తామని పేర్కొన్న కమిషన్.. తాజా ఉత్తర్వులతో ఆ విధానాన్ని ఖరారు చేసింది. 2022-23 సంవత్సరానికి విద్యుత్ కొనుగోలు ట్రూఅప్ కింద రూ.5,186.29 కోట్లు నిర్ణయించారు. ఇందులో టీజీఎస్పీడీసీఎల్ వాటా రూ.3,329.97 కోట్లు, టీజీఎన్పీడీసీఎల్ వాటా రూ.1,856.32 కోట్లు. 2023 24 సంవత్సరానికి ఆదాయ ట్రూఅప్ రూ.2,448.93 కోట్లు కాగా.. టీజీఎస్పీడీసీఎల్‌కు రూ.2,335.45 కోట్లు, టీజీఎన్పీడీసీఎల్‌కు రూ.113.48 కోట్లు ఉన్నాయి.

మొత్తంగా రెండు డిస్కంలకు కలిపి రూ.7,635.22 కోట్లుగా తేలింది. వ్యవసాయ రంగానికి సంబంధించి రెండు ఆర్థిక సంవత్సరాల్లో కలిపి రూ.2,214.99 కోట్ల ట్రూఅప్ ఉన్నట్లు కమిషన్ గుర్తించింది. ఇందులో టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో రూ.1,442.49 కోట్లు, టీజీఎన్పీడీసీఎల్ పరిధిలో రూ.772.50 కోట్లు ఉన్నాయి. ఉచిత విద్యుత్ విధానాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ మొత్తాన్ని రైతుల నుంచి వసూలు చేయకూడదని స్పష్టం చేసింది. బదులుగా ఈ మొత్తాన్ని ప్రభుత్వం నుంచి రాబట్టేందుకు డిస్కంలు చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఇతర కేటగిరీల వినియోగదారుల నుంచి వసూలు చేయాల్సిన రూ.5,420.23 కోట్లలో టీజీఎస్పీడీసీఎల్ వాటా రూ.4,222.93 కోట్లు, టీజీఎన్పీడీసీఎల్ వాటా రూ.1,197.30 కోట్లు. ఈ వసూళ్లు 2026 నవంబర్‌లో జారీ చేసే కరెంట్ బిల్లుల నుంచే ప్రారంభం కానున్నాయి. మొదటి నెలలో యూనిట్‌కు 30 పైసలు, ఆ తర్వాత నెలల నుంచి యూనిట్‌కు 50 పైసలు చొప్పున ట్రూఅప్ రికవరీ చేయాలని కమిషన్ నిర్ణయించింది. వినియోగదారుడి 2022-23,2023-24 సంవత్సరాల వినియోగాన్ని ఆధారంగా చేసుకుని నెలవారీ బిల్లింగ్ పరిమాణాన్ని నిర్ణయిస్తారు. టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో 29 బిల్లింగ్ నెలలు, టీజీఎన్పీడీసీఎల్ పరిధిలో 26 బిల్లింగ్ నెలల్లో ఈ మొత్తాన్ని రాబట్టేలా కమిషన్ వ్యవధిని నిర్దేశించింది. అయితే ఏ వినియోగదారుడి నుంచి అయినా అతని 2022-23, 2023-24 సంవత్సరాల వినియోగానికి సంబంధించిన ట్రూఅప్ మొత్తాన్ని మించి వసూలు చేయరాదని స్పష్టం చేసింది.

**బిల్లులో ప్రత్యేకంగా చూపాలి**

ట్రూఅప్ ఛార్జీని సాధారణ విద్యుత్ బిల్లులో కలిపేయకుండా ప్రత్యేక అంశంగా చూపించాలని టీజీఈఆర్సీ ఆదేశించింది. ఏ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మొత్తం, ఎంత నెలవారీ వినియోగంపై లెక్కించారో, ఏ రేటును వర్తింపజేశారో బిల్లులో స్పష్టంగా పేర్కొనాలి. ఒక బిల్లింగ్ నెలలో రెండు ఆర్థిక సంవత్సరాల రికవరీ ఉంటే.. రెండింటినీ విడివిడిగా చూపాలి.

మొదటి ట్రూఅప్ ఛార్జ్ బిల్లు జారీకి ముందు టీజీడిస్కంలు తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో ఒక్కో విస్తృత ప్రచారం ఉన్న దినపత్రికలో నోటీసు ఇవ్వాలని కూడా కమిషన్ ఆదేశించింది. వసూలు విధానం, రేటు, వ్యవధిని అందులో వివరించాలి.

**సుప్రీంకోర్టు మార్గదర్శకాల నేపథ్యంలో..**

ట్రూఅప్ వసూళ్ల నిర్ణయం తీసుకునేటప్పుడు సుప్రీంకోర్టు, ఏపిటీఈఎల్ ఇచ్చిన మార్గదర్శకాలను కమిషన్ పరిగణనలోకి తీసుకుంది. టారిఫ్ సాధ్యమైనంత వరకు వ్యయానికి అనుగుణంగా ఉండాలని, రెగ్యులేటరీ ఆస్తుల భారం పరిమితంగా ఉండాలని, ఇప్పటికే ఉన్న రెగ్యులేటరీ ఆస్తులను గరిష్ఠంగా నాలుగేళ్లలో పరిష్కరించాల్సిన అవసరం ఉందని ఆదేశాలను ఉత్తర్వుల్లో ప్రస్తావించింది. మొత్తానికి.. నవంబర్ నుంచి కరెంట్ బిల్లుల్లో కొత్త ట్రూ అప్ ఛార్జ్ కనిపించనుంది. వ్యవసాయ వినియోగదారులకు మాత్రం ప్రత్యక్ష భారం లేకుండా రూ.2,214.99 కోట్లను ప్రభుత్వం నుంచి రాబట్టే విధానాన్ని కమిషన్ ఖరారు చేసింది. మిగిలిన రూ.5,420.23 కోట్ల భారం ఇతర అర్హత కలిగిన వినియోగదారులపై పడనుంది.

# టెక్ రంగానికి నిరంతర విద్యుత్

## - కొత్తగా డ్యూయెల్ పవర్ సప్లై సిస్టమ్ - సమగ్ర నెట్‌వర్క్ ప్రణాళిక రూపకల్పన - సంక్షోభాన్ని అధిగమించేందుకు చర్యలు

**హైదరాబాద్, అక్టోబరు 5, ప్రభాతవార్త :** ఎల్ నినో వర్షాభావ పరిస్థితులు తెలంగాణలోని వివిధ రంగాలపై ముఖ్యంగా డేటా సెంటర్లు, ఐటీ కంపెనీల విద్యుత్ సరఫరాపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇటీవలి కాలంలో అన్ని రంగాల నుంచి విద్యుత్‌కు డిమాండ్ అసాధారణంగా పెరిగిన నేపథ్యంలో, టెక్నాలజీ పరిశ్రమ ఎదుర్కొంటున్న ఈ సంక్షోభాన్ని తగ్గించడానికి రాష్ట్ర ప్రభుత్వం చురుకుగా చర్యలు చేపట్టింది. ఎల్ నినో ప్రభావం వల్ల భవిష్యత్తులో ఏర్పడే విద్యుత్ అవసరాలను తీర్చడానికి సమగ్ర నెట్‌వర్క్ ప్రణాళికను అందుబాటులోకి తీసకొస్తోంది. ఈ సంక్షోభ సమయంలో భవిష్యత్తులో విద్యుత్ అంతరాయాలను తగ్గించడానికి ప్రత్యామ్నాయ విద్యుత్ వనరులను సమకూ ర్చడమే ప్రధాన లక్ష ్యంగా విద్యుత్ సంస్థలు పక్కా ప్రణా ళికకు రూపకల్పన చేశాయి. ప్రత్యేకంగా, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని డేటా సెంటర్లు, ఐటీ, ఇతర కీలక పరిశ్రమలకు నిరంతరాయ విద్యుత్ సరఫరాను నిర్ధారించడానికి ద్వంద్వ విద్యుత్ సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నారు. నగరంలోని కంపెనీలకు విద్యుత్ అంతరాయాలు లేకుండా సరఫరా చేసేందుకు తీసుకుంటున్న ముఖ్యమైన చర్యలలో భాగంగా, అధిక లోడ్ ఉన్న 33 కేవీ, 11 కేవీ ఫీడర్లను ఏర్పాటు చేయడం, ట్రాన్స్‌ఫార్మర్ లోడింగ్ 80 శాతానికి మించిన సబ్‌స్టేషన్లలో అదనపు పీటీఆర్‌లను (లేదా సామర్థ్య పెంపు పరికరాలను) ఏర్పాటు చేయడం వంటివి ఉన్నాయని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్‌పీ డీసీఎల్) అధికారులు తెలిపారు. విద్యుత్ కోతలను అరికట్టడానికి లేదా గరిష్ట వినియోగ సమయాల్లో అధిక విద్యుత్ లోడ్‌లను నిర్వహించడానికి ఈ ద్వంద్వ విద్యుత్ సరఫరా వ్యవస్థ (డ్యుయెల్ పవర్ సప్లై సిస్టమ్) ఒక ప్రత్యామ్నాయంగా తీసుకొస్తోంది. ఒక వనరు విఫలమైనప్పుడు కూడా నిరంతరాయంగా పనిచేయడానికి హామీ ఇచ్చేందుకు, ఈ ద్వంద్వ విద్యుత్ వ్యవస్థను రెండు వేర్వేరు విద్యుత్ వనరులు లేదా ఫీడర్ లైన్లలో పొందుపరుస్తారు. ఈ కొత్త వ్యవస్థ, అంతరాయం లేని ఫెయిలోవర్ సామర్థ్యాల ద్వారా, అధిక లభ్యత గల విద్యుత్ వ్యవస్థలలో అనుకోని షట్‌డౌన్, డేటా నష్టాన్ని నివారిస్తుంది. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్‌లో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ విద్యుత్ అధికారులను పరుగులు పెట్టిస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో గత నెల 28న సాయంత్రం 6:42 గంటలకు 4072 మెగావాట్ల గరిష్ట డిమాండ్ నమోదవ్వగా, 82.89 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో, జీహెచ్‌ఎంసీ పరిధిలో మే 22 న 4782 మెగావాట్ల అత్యధిక డిమాండ్ నమోదైంది. అదే రోజు 101.07 మిలియన్ యూనిట్ల అత్యధిక విద్యుత్ వినియోగం కూడా నమోదైందని అధికారులు తెలిపారు. వచ్చే 2027 మార్చిలో వేసవి ప్రారంభమయ్యేలోపు గ్రేటర్ హైదరా బాద్‌లో విద్యుత్ డిమాండ్ 5000 మెగావాట్లకు చేరే అవకాశం ఉంది. అంతకంటే ముందే, ముఖ్యంగా డేటా సెంటర్లు మరియు ఐటీ కంపెనీల విద్యుత్ డిమాండ్‌ను తీర్చడానికి అవసరమైన అన్ని లాజిస్టిక్స్‌తో సన్నద్ధం కావడానికి విద్యుత్ పంపిణీ సంస్థ సిద్ధమవు తోంది. మేధారం-ఘట్‌కేసర్, తిమ్మా పూర్- కందకూర్, ఎలిమినేడు- ఇబ్రహీంపట్నం, దండు మల్కాపూర్- చౌటుప్పల్ వంటి అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక కారిడార్ల కోసం విద్యుత్ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసే పనులను టీజీఎస్‌పీడీసీఎల్ వేగవంతం చేస్తోంది. అలాగే, సకాలంలో పూర్తి చేయడం కోసం తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ)తో సన్నిహితంగా సమన్వయం.



సదస్సులో ప్రసంగిస్తున్న ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్ జి.రమేష్

# విద్యావికాసానికి మాతృభాషే మూలం

## తెలంగాణ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డా. సిహెచ్.లక్ష్మణ చక్రవర్తి

**నాంపల్లి, అక్టోబరు 5 ప్రభాతవార్త :** సమగ్ర విద్యావికాసానికి మూలం మాతృభాషేనని, మాతృభాషలో విద్యాబోధన కీలకమని తెలంగాణ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డా. సిహెచ్.లక్ష్మణ చక్రవర్తి అన్నారు. రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ తెలంగాణ ఆధ్వర్యంలో బొగ్గులకుంట తెలంగాణ సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళావేదికలో సోమవారం మాతృభాషకు భాషాంజలి పేరుతో జరిగిన రాష్ట్రస్థాయి విద్యాసదస్సులో ఆయన ప్రసంగించారు. సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు చక్రవర్తుల శ్రీనివాస్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో తెలుగు సాహిత్యం తీరుతెన్నులు-ఈ కాలపు కవిత్వం అనే అంశంపై పెద్దయెత్తున సదస్సు జరిగింది. ప్రస్తుత తరుణంలో తెలుగు సాహిత్య వికాసానికి ప్రతీఒక్కరూ తమ బాధ్యత విశేషకృషి చేయాల్సిన అవసరముందని, అప్పుడే మాతృభాష అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. తదుపరి ఐశ్వర్య ప్రదాయిని తెలుగు అనే అంశంపై ఆకెళ్ల రాఘవేంద్ర మాట్లాడుతూ మాతృభాష తెలుగులో విద్యను అభ్యసించేవారు అన్నిరంగాల్లో రాణించడానికి మెండుగా అవకాశం ఉంటుందని చెప్పారు. సాహిత్యం, సాంస్కృతిక, సామాజిక తరితర రంగాలలో రాణించడం విద్యార్థులకు సులువుగా ఉంటుందని పునరుద్ఘాటించారు. అధ్యక్షోపన్యాసంలో చక్రవర్తుల మాతృభాష కేవలం భావప్రకటనకు మాత్రమేకాదు మానవీయ విలువలు, జీవన నైపుణ్యాలను పెంపొందించడానికి ప్రేరణగా నిలుస్తోందన్నారు. ఆఖరి సదస్సు మాతృభాషాబోధన-ఉపాధ్యాయుల పాత్ర అనే అంశంపై ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ రఘు మాట్లాడారు. మాతృభాషా బోధకులు విద్యార్థుల మూర్తిమత్వాన్ని ప్రభావితం చేసేవిధంగా బోధన చేయాలని సూచించారు. అనంతరం 45 మంది తెలుగు, హిందీ ఉపాధ్యాయులకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం 2026తో ఎస్‌సిఈఆర్‌టి డైరెక్టర్ రమేష్ చేతులమీదుగా ఘనంగా సత్కరించి ప్రదానం చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.గౌరీశంకర్‌రావు నివేదిక చదవగా గౌరవాధ్యక్షులు చౌడవరం చంద్రమోహన్, పెండ్యాల బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# రామంతాపూర్‌లో మైనర్ బాలిక కిడ్నాప్ డ్రామా!

**ఉప్పల్, అక్టోబరు 5 ప్రభాతవార్త :** రామంతాపూర్‌లో ఓ మైనర్ బాలిక కిడ్నాప్ డ్రామా పోలీసులను ఉరుకులు, పరుగులు పెట్టించింది. బంధువుల ఇంట్లో ఉండేందుకు ఇష్టం లేక స్వగ్రామానికి వెళ్లేందుకు 8వ తరగతి చదువుకున్న బాలిక కిడ్నాప్ చేశారని ఆరోపిస్తూ హంగామా సృష్టించింది. దీంతో విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. వివరాలు ఇలా ఉన్నాయి. రామంతాపూర్ బాలాజీనగర్‌లో నివసించే వ్యక్తికి ఇద్దరు కుమార్తెలు. వీరి పెద్ద కుమార్తె (13) స్థానికంగా ఉన్న ఒక పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. అయితే స్కూల్‌కు వెళ్లేందుకు ఇష్టం లేక స్వగ్రామానికి వెళ్లేందుకు కిడ్నాప్ డ్రామా ఆడింది. ఉదయం 7.30 గంటల సమయంలో తనను కారులో వచ్చిన నలుగురు కిడ్నాప్ చేశారని, ఉప్పల్ హెరిటేజ్ కంపెనీ వద్ద కారు ఆపి మాట్లాడుతుండగా తప్పించుకుని వచ్చినట్లు చెప్పింది. దీంతో బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిఐ రామలింగారెడ్డి, ఇతర అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని బాలికను తీసుకుని వెళ్లి చెప్పిన ప్రాంతాల్లో విచారించారు. అయితే బాలిక కావాలనే కిడ్నాప్ డ్రామా ఆడినట్లు పోలీసుల విచారణలో తేలింది. దీంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. దీనిపై సిఐ రామలింగారెడ్డి స్పందిస్తూ కిడ్నాప్ కేవలం డ్రామా అని, తల్లిదండ్రులు తమ పిల్లలపై దృష్టి కేంద్రీకరించాలని, వారి ఇష్టాలకు అనుగుణంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు.

# క్షేత్రస్థాయిలోకి అగ్రి వర్సిటీ శాస్త్రవేత్తలు

## - ఇన్నోవేషన్ టు ఇంపాక్ట్‌తో పంటల వైవిధ్యీకరణకు ప్రోత్సాహం

## -రైతుల దిగుబడి, ఆదాయం పెంచడమే లక్ష్యం: ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య

**అత్తాపూర్ అక్టోబరు5,ప్రభాతవార్త :** తెలంగాణలో పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహించేందుకు రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంవినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. పరిశోధన ఫలితాలను నేరుగా రైతుల పొలాల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో ఇన్నోవేషన్ టు ఇంపాక్ట్ కార్యక్రమాన్ని ఈ రబీ సీజన్ నుంచి అమలు చేయనున్నట్లు విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలిపారు.సోమవారం ఆయన ఓ ప్రకటనలో ఉపకులపతి మాట్లాడుతూ...సాగులో సాంకేతిక అంతరాలను తగ్గించడం, దిగుబడి అంతరాలను పూడ్చడం, రైతుల ఆదాయాన్ని పెంచడం ప్రధాన లక్ష్యాలుగా ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు చెప్పారు. ముఖ్యంగా పప్పుధాన్యాలు, నూనెగింజల సాగులో సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, రాష్ట్రంలో పంటల వైవిధ్యీకరణకు ప్రోత్సాహం కల్పించనున్నట్లు వివరించారు. 12 కేంద్రాల్లో అమలు రాష్ట్రంలోని పాలెం, తాండూర్, మధిర, వరంగల్, కంపాసాగర్, రుద్రూరు, ఆదిలాబాద్, జగిత్యాల, తోర్నాల, కరీంనగర్, బసంత్‌పూర్, కూనారం కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు జానయ్య తెలిపారు. ప్రతి కేంద్రంలో నలుగురు శాస్త్రవేత్తలతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు.ప్రతి కేంద్రం పరిధిలో నాలుగు గ్రామాలను ఎంపిక చేసి.. ఒక్కో గ్రామం నుంచి 20-25 మంది ప్రగతిశీల రైతులను గుర్తించి, వారి పొలాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల ప్యాకేజీని అమలు చేయనున్నట్లు తెలిపారు. అధునాతన వంగడాలు, మెరుగైన పంట ఉత్పత్తి, సస్యరక్షణ పద్ధతులను రైతులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు.శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలోనే ఉండి రైతుల పొలాలను నిరంతరం పర్యవేక్షిస్తూ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తారని తెలిపారు. రెండేళ్ల పాటు కార్యక్రమాన్ని కొనసాగించి.. ఫలితాలను రైతుల కళ్లముందే చూపించడం ద్వారా ఇతర రైతులు కూడా ఈ సాంకేతికతలను అనుసరించేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. దిగుబడి.. ఆదాయం పెంపే లక్ష్యం ఈ కార్యక్రమం ద్వారా సాంకేతిక పరిజ్ఞాన అమలులో ఉన్న అంతరాలను పూడ్చడం, దిగుబడి అంతరాలను తగ్గించడం, రైతుల ఆదాయాన్ని పెంచడం, నేల-నీటి నాణ్యతను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు జానయ్య తెలిపారు. పప్పుధాన్యాలు, నూనెగింజల ఉత్పత్తిని పెంచి.. వాటి దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఖేత్ బచావ్' కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 18 నుంచి 31వ తేదీ మధ్య రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా 12 కేంద్రాల్లో ఒకచోట ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించనున్నట్లు జానయ్య వెల్లడించారు.

# ఘనంగా జి.వెంకటస్వామి 97వ జయంతి వేడుకలు



వెంకటస్వామి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కెకె, వివేక్, పొన్నం, అజారుద్దీన్ తదితరులు

**సైఫాబాద్, అక్టోబరు 5 ప్రభాతవార్త:** ప్రముఖ కార్మిక నేత, కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి 97వ జయంతి వేడుకలు సోమవారం ట్యాంక్‌బండ్ వద్దగల ఆయన విగ్రహం ఎదుట ఘనంగా జరిగాయి. ఆయన విగ్రహానికి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, రాష్ట్ర మంత్రులు జి.వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, అజరుద్దీన్, ఎంపి జి.వంశీకృష్ణ, ఎమ్మెల్యే వినోద్, పిషరీస్ కార్పోరేషన్ ఛైర్మన్ మెట్టు సాయికుమార్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య తదితరులు పాల్గొని పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అలాగే పార్టీలకు అతీతంగా ఆనేక మంది నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ జి.వెంకటస్వామి రాజకీయాల్లో తనకు మార్గదర్శకంగా నిలిచారని, ప్రజా సమస్యలను ఏలా అర్థం చేసుకోవాలో, పేదలకు ఎలా అండగా నిలవాలో ఆయన వద్దనేర్చుకున్నానని చెప్పారు. తెలంగాణ సాధన కోసం ఆయన చేసిన పోరాటం మరువలేనిదని, తెలంగాణ వచ్చిన తరువాతే తాను చనిపోతానని చెప్పారని ఆయన తెలిపారు. పేదలు, దళితులు, కార్మికులు, అణగారిన వర్గాలకు హక్కుల కోసం వెకంటస్వామి చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. మనం సేవలు చేయడమే ఆయనకు అర్పించే నివాళి అని స్పష్టం చేశారు. జి.చెన్నయ్య మాట్లాడుతూ కార్మికుల హక్కులు, దళితులు, పేదల అభ్యున్నతి కోసం వెంకటస్వామి ఎంతో కృషి చేశారని కొనియాడారు.

# మేడిపల్లిలో భారీ చోరీ

## : రూ. 2 కోట్ల విలువైన వజ్రాభరణాలు మాయం

### క్యారెట్ లేన్ జ్యుయెలరీ షాపులో వజ్రాలు, బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన దొంగలు

**బోడుప్పల్, అక్టోబర్ 5 ప్రభాతవార్త :** మల్కాజిగిరి కమీషనరేట్ పరిధిలోని మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో భారి చోరి కలకలం రేపింది. మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత భారీ దొంగతనం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్ వరంగల్ నేషనల్ హైవేపై కేనరానగర్ బస్టాప్ (బోడుప్పల్ రోడ్డు) సమీపంలో ఉన్న ప్రసిద్ధ క్యారెట్ లేన్ (టాటా ప్రొడక్ట్) డైమండ్స్ జ్యువెలరీ షోరూంను దుండగులు లక్ష్యంగా చేసుకున్నారు. దుకాణం షట్టర్ ను వంచి లోపలికి చొరబడిన దొంగలు, డిస్ప్లే గ్లాస్ ను పగలగొట్టి సుమారు రూ. 2 కోట్ల కంటే ఎక్కువ విలువైన వజ్రాలు, బంగారు ఆభరణాలను అపహరించినట్లు ప్రాథమిక సమాచారం.ఐదు నిమిషాల్లోనే పని ముగించారు. పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం.. ఈ చోరీలో దాదాపు ఏడుగురు వ్యక్తులు పాల్గొన్నట్లు తెలుస్తోంది. అయితే, షోరూమ్లోకి ఒకరు మాత్రమే ప్రవేశించగా, మిగిలిన వారు బయట కాపలాగా ఉన్నట్లు గుర్తించారు. దుకాణం తలుపులు తెరిచిన ఐదు నిమిషాల తర్వాత అలారం మోగుతుందనే విషయం తెలిసిన దొంగలు, ఐదు నిమిషాల వ్యవధిలోనే ఈ భారీ చోరీకి పాల్పడి పరారయ్యారు. సోమవారం ఉదయం షోరూమ్ సిబ్బంది వచ్చి చూసేసరికి షట్టర్ ధ్వంసమై ఉండటాన్ని గమనించి వెంటనే మేడిపల్లి పోలీసులకు సమాచారం అందించారు. ....రంగంలోకి ప్రత్యేక బృందాలు..... ఘటనాస్థలానికి చేరుకున్న ఉప్పల్ జోన్ డీసీపీ సురేష్ కుమార్, మేడిపల్లి ఏసీపీ మోహన్ కుమార్, ఇన్ స్పెక్టర్ జలంధర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. క్లూస్ టీమ్ రంగంలోకి దిగి వేలిముద్రలు, ఇతర కీలక ఆధారాలను సేకరించింది. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించేందుకు ఉప్పల్ జోన్ స్పెషల్ ఆపరేషన్ టీమ్ తో పాటు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ చోరీ వెనుక రాజస్థాన్‌కు చెందిన అంతరాష్ట్ర గ్యాంగ్ హస్తం ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. షోరూమ్ మేనేజ్మెంట్ స్టాక్ లెక్కింపు పూర్తి చేసిన తర్వాత దొంగతనం జరిగిన సొత్తు ఖచ్చితమైన విలువ తెలిసే అవకాశం ఉంది.




జ్యువెలరీ షోరూమ్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

# రూ.4 లక్షల లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్

**మెహిదీపట్నం,అక్టోబర్ 05, ప్రభాతవార్త :** ఓ భవన నిర్మాణదారుడి నుంచి రూ.4 లక్షల లంచం తీసుకుంటూ జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. జీహెచ్‌ఎంసీ గోల్కొండ జోన్ (సర్కిల్ 33) మెహిదీపట్నం కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న తులసిరామ్ సునీత, ఓ ఫిర్యాదుదారుడు చేపడుతున్న భవన నిర్మాణాన్ని అడ్డుకోకుండా ఉండేందుకు లంచం డిమాండ్ చేశారు. సదరు నిర్మాణానికి సంబంధించి జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ ఇదివరకే ఖిస్సికింగ్ ఆర్డర్స్‌ఖి జారీ చేసినప్పటికీ, వాటిని పట్టించుకోకుండా ఉండేందుకు మరియు భవిష్యత్తులో ఎలాంటి వేధింపులకు గురిచేయకుండా సహకరించేందుకు ఆమె రూ.8 లక్షలు డిమాండ్ చేశారు. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ సిటీ రేంజ్1 అధికారులు వ్యూహాత్మకంగా దాడి చేశారు. సోమవారం మొదటి విడతగా రూ.4 లక్షల లంచం సొమ్ము స్వీకరిస్తుండగా సునీతను అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ తనిఖీల్లో లంచం సొమ్ము రూ.4,00,000తో పాటు, ఆమె వద్ద సరైన ఆధారాలు లేని మరో రూ. 2,50,000 నగదును కూడా ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విధి నిర్వహణలో అక్రమాలకు పాల్పడి, నిజాయితీ లేకుండా వ్యవహరించిన సదరు అధికారిణిపై కేసు నమోదు చేశారు. ఆమెను నాంపల్లిలోని ఎస్‌పీఈ ఏసీబీ కేసుల మొదటి అదనపు ప్రత్యేక న్యాయమూర్తి ముందు హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు.



ఎసిబికి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన జిహెచ్ఎంసి సూపర్‌వైజర్ సునీత

# గంజాయి సాగుపై పోలీసుల ఉక్కుపాదం



మాట్లాడుతున్న ఎస్పీ నితికా పంత్

## మూడు రోజుల్లో 6 కేసులు.. రూ.50 లక్షల విలువైన 500 మొక్కలు స్వాధీనం

**ఆసిఫాబాద్, అక్టోబర్ 5, ప్రభాతవార్త :** కుమురం భీం జిల్లాను గంజాయి రహితంగా మార్చే లక్ష్యంతో అక్రమ గంజాయి సాగుపై పోలీసులు కఠిన చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ నితికా పంత్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని మాట్లాడారు. డీఎస్పీ బి.అశోక్ ఆధ్వర్యంలో లింగాపూర్, సిర్పూర్ (యు), కెరమెరి పోలీస్‌స్టేషన్ల పరిధిలో మూడు రోజులుగా నిర్వహించిన తనిఖీల్లో ఆరు కేసులు నమోదు చేసి, ఐదుగురు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి సుమారు రూ.50 లక్షల విలువైన 500 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారని వెల్లడించారు. 2026లో ఇప్పటివరకు గంజాయి సాగుపై 23 కేసులు నమోదు చేసి 27 మందిని అరెస్టు చేయగా, రూ.2.36 కోట్ల విలువైన 2,366 మొక్కలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. అలాగే డ్రై గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు సంబంధించి 32 కేసుల్లో 68 మందిని అరెస్టు చేసి 10 కిలోల డ్రై గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

గంజాయి సాగు, రవాణా, విక్రయాలపై నిరంతర తనిఖీలు కొనసాగు తాయని, సమాచారం ఉంటే పోలీసులకు తెలియ జేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డిఎస్పీ అశోక్, ఎస్బి సిఐ సతీష్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించండి: వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్



సింగరేణి భవన్ ముందు నిరసనకు దిగిన టీఆర్ఎస్ అధినేత కవితతో వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్, కార్యకర్తలు

**శేరిలింగంపల్లి,అక్టోబర్ 5 ప్రభాతవార్త :** సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించే వరకు ఉద్యమాలను ఉధృతం చేస్తామని గ్రేటర్ హైదరాబాద్ టీఆర్ఎస్ అధ్యక్షులు, శేరిలింగంపల్లి నియోజక వర్గ ఇంచార్జి వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ ధ్వజమెత్తారు. తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆధ్వర్యంలో సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సింగరేణి భవన్‌ను ముట్టడించిన కవితతో కలిసి గ్రేటర్ హైదరాబాద్ టీఆర్ఎస్ అధ్యక్షులు వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ ఉద్యమించారు. శేరిలింగంపల్లి నియోజక వర్గం నుంచి పెద్దసంఖ్యలో టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను తరలించారు. సింగరేణి భవన్‌ను ముట్టడించి సింగరేణి యాజమాన్యం దిగివచ్చేవరకు నినదించారు. దీంతో సింగరేణి యాజమాన్యం దిగివచ్చి చర్చలు జరిపి, రెండు నెలల్లో కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంజరిగిందని టీఆర్ఎస్ నేత వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మొహర్రం విషపు గుళికల కేసులో 700 పేజీల ఛార్జిషీట్

**పుణే, అక్టోబరు 5:** పూణెలో మొహర్రం ఊరేగింపు సందర్భంగా అదే నగరానికి చెందిన ఫయాజ్ ప్రేమ్‌జీ అనే 39 ఏళ్ల వ్యక్తి దాదాపు 15వేల మందికి ఎలుకల మందు కలిపిన క్యాప్సుల్స్ ఇచ్చి చంపేందుకు పథకం వేసి అమలులోకి దిగడం తాలూకు ఘటన సంచలనం కలిగించిన సంగతి తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి ముంబై పోలీసులు ఫయాజ్‌కు వ్యతిరేకంగా 700 పేజీల చార్జ్‌షీట్‌ను కోర్టుకు సమర్పించారు. దీని ప్రకారం.. ఎలుకలను చంపేందుకు ఉపయోగించే జింక్ ఫాస్ఫేట్‌ను ఫయాజ్ 50 కిలోల మేర సేకరించాడు. రెండు వారాలు శ్రమించి దానిని గోలీల్లాగా (క్యాప్సూల్స్) తయారు చేశాడు. మొహర్రం ఊరేగింపు సందర్భంగా తాను సిద్ధం చేసిన క్యాప్సుల్స్‌ను తీసుకెళ్లి మోకాళ్ల నొప్పులు తగ్గుతాయని, రోగనిరోధక శక్తి పెరుగుతుందంటూ జనానికి ఇవ్వసాగాడు. పదుల సంఖ్యలో మాత్రలు పంచిపెట్టిన అనంతరం తీసుకున్న ప్రజలు వాంతులు చేసుకొని తీవ్ర అస్వస్థతకు గురవడంతో పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. కాగా తన మతానికే చెందిన కొందరితో తనకున్న వ్యక్తిగత విభేదాల కారణంగా మొత్తంగా ఆ వర్గంపైనే పగ పెంచుకొని మొహర్రం ఊరేగింపును ఫయాజ్ లక్ష్యంగా చేసుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

# పశ్చిమాసియా ఘర్షణలు.. ఇరాన్ మహిళల చేతుల్లో తుపాకులు

**టెహ్రాన్, అక్టోబరు 5:** పశ్చిమాసియాలో ప్రస్తుతం బాంబుల వర్షం కురవట్లేదు కానీ.. యుద్ధ వాతావరణం మాత్రం అలాగే ఉంది. ఏ క్షణం ఎటునుంచి ఎవరు దాడిచేస్తారో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. ఇరాన్ విషయంలో తాను త్వరలో ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించిన నేపథ్యంలో.. టెహ్రాన్ నుంచి కొన్ని దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. ఆ దేశ మహిళల చేతుల్లో తుపాకులు కనిపించాయి. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు భూతల దాడులు చేపట్టొచ్చనే భయాలతో ఇరాన్ సైన్యం మహిళలకు మిలిటరీ శిక్షణను మొదలు పెట్టినట్లు కనిపిస్తోంది.

టెహ్రాన్‌లోని ఇమామ్ హుస్సేన్ స్క్వేర్‌లోని సైనిక కేంద్రంలో ఇరాన్ మహిళలకు శిక్షణా కార్యక్రమం జరుగుతోందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. హ్యాండ్‌గన్ సహా ఇతర ఆయుధాలు ఎలా వాడాలో నేర్పుతున్నారు. యుద్ధ సమయంలో కుటుంబాలను, చుట్టుపక్కల వారిని ఎలా రక్షించుకోవాలో నేర్చుకోవడం వల్ల తమ భయాలు కాస్త తగ్గుతున్నాయని ఆ మహిళలు చెప్తున్నారు.

మరోవైపు ట్రంప్ హెచ్చరికలకు ఇరాన్ గట్టి బదులు ఇస్తోంది. ఆంక్షలు, సైనిక బలప్రయోగం ద్వారా ఘర్షణలకు ముగింపు లభించిందని విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చీ స్పష్టం చేశారు. న్యాయం, నిష్పక్షపాతంగా జరిగే చర్చలతోనే పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. అణ్వాయుధాల వ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్‌పిటి) నుంచి వైదొలగే అంశాన్ని ఇరాన్ పరిశీలిస్తోంది. ఈ అంశం పార్లమెంట్ అజెండాలో ఉందని ఎంపి అలీరెజా సలిమీ వెల్లడించారు. అలాగే తమ దేశం శుద్ధి చేసిన యురేనియాన్ని వదులుకోదని స్పష్టం చేశారు.

# మలేరియా మాత్రలు వికటించి చిన్నారి మృతి ఘటనపై సుమోటాగా సుప్రీం విచారణ

## - దర్యాప్తు ప్రక్రియ నిశితంగా పర్యవేక్షించాలి - హైకోర్టుకు సిజె ధర్మాసనం ఆదేశం

**అమరావతి, అక్టోబరు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** పోలవరంలో యాంటీ మలేరియా మాత్రలు వికటించిన ఘటనపై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. గత నెల 1న ఏజెన్సీలో చిన్నారి మడివి జమున (7) మృతి మృతిచెందడంపై సిజెఐ ధర్మాసనం సుమోటోగా విచారణ చేపట్టింది. దర్యాప్తు ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించాలని ఎపి హైకోర్టుకు సూచించింది. ఏపీ ప్రభుత్వం తరఫున తెలిపిన సీనియర్ న్యాయవాది లూథ్రా హాజరై ఘటనకు సంబంధించిన వివరాలను చేపట్టిన సహాయ చర్యలను కోర్టుకు వివరించారు. ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు చేశామని ఎఫ్ఎస్ఎల్ నివేదిక కోసం ఎదురుచూస్తున్నట్లు లూథ్రా తెలిపారు. మాత్రలు వేసుకున్న ఇతర 52 మందికి పూర్తి వైద్యపరీక్షలు నిర్వహించామని మిగిలిన వారంతా సురక్షితంగా ఉన్నారని ధర్మాసనానికి తెలియ జేశారు. కేసు దర్యాప్తును పర్యవేక్షించాలన్నారు.



వాతావరణం ఎప్పుడూ ఒకేలా ఉండదు. వాతావ రణం ప్రతికూల ప్రభావం మనపై చూపుతుంది. చర్మం పొడిబారి నిర్జీవంగా మారుతుంది. అయితే చర్మంలో తేమని నిలిపి

## బాడీ లోషన్ తడిగా ఉన్నప్పుడే..

ఉంచడానికి ఏదో ఒక క్రీమ్/బాడీ లోషన్ రాసుకుంటే సరిపోతుందనుకుంటారు చాలామంది. కానీ వీటిలో కూడా చర్మతత్వానికి నప్పే లోషన్లను తప్పని సరిగా ముఖ్యమంటున్నారు నిపుణులు, అలాగే వీటిని ఉపయోగించే అనేక జాగ్రత్తలు పాటించాలి. అప్పుడే ఫలితం కనిపిస్తుంది. ముఖానికి లేదా చర్మానికి క్రీమ్లు, లోషన్లు.. రాసుకునే ముందు చర్మాన్ని శుభ్రం చేసుకోవడం తప్పనిసరి. అలాగే చర్మం కాస్త తడిగా ఉన్నప్పుడే వాటిని రాసుకోవాలి. అప్పుడే చర్మం తేమను కోల్పోకుండా జాగ్రత్తపడచ్చు. క్రీమ్ లేదా బాడీ లోషన్స్ ఎప్పుడు పడితే అప్పుడు కాకుండా.. స్నానం చేసిన వెంటనే రాసు కోవాలి. ఎందుకంటే ఆ సమయంలో చర్మంపై తేమ ఎక్కువగా ఉండటం వల్ల లోషన్ సరి రాసుకుంటే మంచి ఫలితం ఉంటుందట. అలాగే స్విమ్మింగ్ పూల్లో ఈత కొట్టిన తర్వాత కూడా తప్పకుండా క్రీమ్ లేదా బాడీ లోషన్ రాసుకోవాలి. లేదంటే నీటిలో ఉంటే క్లోరిన్ వల్ల చర్మం మరింత పొడిగా మారే ప్రమాదం ఉంటుందట. పొడిబారి నిర్జీవంగా మారిపోయిన చర్మానికి క్రీమ్ లేదా లోషన్ రాసుకోవడం వల్ల అది తేమను సంతరించుకోవ దంతో పాటు పునరుత్తేజితం అవుతుందట. పొడిబారి నిర్జీవంగా మారి పోయిన చర్మానికి క్రీమ్ లేదా లోషన్ రాసుకోవడం వల్ల అది తేమను సంతరించుకోవ డంతో పాటు పునరుత్తేజితం అవుతుందట. .. బాడీ లోషన్ చర్మంపై ఉన్న మచ్చల్ని క్రమంగా తగ్గించడానికి ఉపయోగపడు తుందట. .. అలాగే బాడీ లోషన్ వెదజల్లే పరిమళాలు మానసిక ప్రశాంతతను అందిస్తాయట. .. గరుకుగా ఉండే చర్మ భాగాలపై తరచుగా క్రీమ్ లేదా లోషన్స్ అప్లై చేయడం వల్ల కొన్నా అవి మృదువుగా మారతాయి. □

## ఆల్ఫా జనరేషన్‌కి నేర్పాల్సిందే..



'మాలో మేమెప్పుడూ సొంత నిర్ణయం తీసుకోలేదు. అమ్మానాన్నలు ఏం చెబితే అది చేసేవాళ్లం' అంటే ఈతరం తల్లిదండ్రులు చాలామందినే చూస్తుంటాం. అయితే, ఇప్పటి తరమూ అలానే ఉండాలని కోరుకోవడం మాత్రం అత్యాశే. సామాజిక వ్యవస్థ, ఆర్థికాంశాలు, కుటుంబ వాతావరణం... వంటివాటిపై ఆధారపడిన పిల్లల పెంపకం ఉండేదంటున్నారు నిపుణులు. ఇప్పుడు ఆ పరిస్థితులు మారిపోయాయి. అందుకు తగ్గట్టే తల్లిదండ్రులు కూడా తమ పేరెంటింగ్ స్టైల్ మార్చాల్సిందేనని సూచిస్తున్నారు. ముఖ్యంగా ఆల్ఫా జనరేషన్ పిల్లల్ని పెంచడంలో సాంకేతికతను అందిపుచ్చుకోవాలి. అదేలాగంటే... స్క్రీన్ సమయాన్ని నిషేధించే బదులు... వారు ఉపయోగించే యాప్‌లు, ఆడే ఆటలు, వీడియోలు చూస్తే మీరూ తెలుసుకుంటే మేలు. అప్పుడు చిన్నారులూ నియంత్రణలో ఉంటారు. మీరు వద్దనుకున్న వాటి నుంచి... వాళ్లని మళ్లించడమూ సులువవుతుంది. దీంతోపాటే పిల్లలకు ఆన్‌లైన్ భద్రత, సైబర్ బుల్లీయింగ్ ఎదుర్కోవడం, స్క్రీన్ సమయాన్ని బ్యాలెన్స్ చేసుకోవడం నేర్పించండి. అలానే వాళ్లు టెక్నాలజీని కేవలం కంటెంట్ చూడటానికి మాత్రమే ఉపయోగించనివ్వొద్దు. బదులుగా వీడియోలు రూపొందించడం, కథలు రాయడం, కోడింగ్ నేర్చుకోవడం... వంటివాటిపై శ్రద్ధపెట్టేలా చేయండి. అలానే, వాళ్లకెదైనా సమస్య ఎదురైతే... వెంటనే తీర్చేయకుండా వాళ్లంతట వారుగా పరిష్కారాలు వెతుక్కునేలా చేయండి. రోజువారీ జీవితంలో వాళ్ల వయసుకి తగ్గ పనులు, ప్రత్యామ్నా యాలూ చూపించండి. పిల్లలు కూడా మాట్లాడితే మీరు ఓపిగ్గా వినాలి. సమయం ఇవ్వాలి. అప్పుడే వాళ్ల భావోద్వేగాలను అర్థం చేసుకోగలరు. □

'పట్టు'"ఒక ఐడియా మీ జీవితాన్ని' మార్చేస్తుంది. ఎన్నోసార్లు విన్నాం. మరి ఇప్పుడో ఒక 'వార్త' చోర శిఖామణుల్లో పరిమర్తన తచ్చింది. ఎంతో మోజుపడి దొంగిలించిన పట్టుచీరల్ని తిరిగి సొంతదారుకు చేర్చారు. 'వార్త'కు పవరెక్కువ. అది ఏం వార్త? ఏ వార్త ఎలాంటి, 'వార్త' అని చూడొద్దు. ఓ చీరెల షాపులో కొనుగోలు కెళ్లిన వారే చీరలు బాగున్నాయని ఎత్తుకెళ్లారు. కానీ ఎందుకో మరుసటి రోజు 'వార్త'ల్లో పరకాయిస్తే పెద్ద సంఖ్యలో చీరెలు మాయమయ్యాయని సమాచారం అదెలా సాధ్యమో తెలియక షాపు



## 'పట్టు' చీరె శిఖామణులు

యాజమాని లబోదిబోమ న్నాడు. చివరికి రహస్య కెమెరాలు చూసి అవాక్కయ్యాడు. వాళ్లు చోరీ చేసిన విషయం, అందులో చీరలు దాచేసిన వైనం చూసి గమ్మత్తుగా ఫీలయినా సొత్తు పోవడం జీర్ణించుకోలేక తమిళనాడు ఆరణి పోలీసులకు ఫిర్యాదు చేసాడు. అదేనండి తమిళనాడులో 'ఆరణి' పట్టు చీరెలు బాగాఫేమస్ అండోయ్. పేపర్లన్నీ ఆ వార్తలు రాసాయి, ఛానల్స్‌లో భారీ ఎత్తున వ్యాఖ్యానాలు, విశ్లేషణలు, చూద్దురుకోదా ! ఓ రోజు ఆ షాపు యాజమానిపేరట ఓ కొరియర్ వచ్చింది. అందులో తన దుకాణంలో పోయాయనుకున్న 32 చీరెలు యధాతథంగా ఉన్నాయి. అదేదో బుజ్జిమేక తప్పిపోయి తల్లి ఒడి చేరినట్లు ఆ యాజమాని ఎంతో ఆనందభరితుడయ్యాడు. ఐనా, పోలీసులు వారి డ్యూటీవారు చేయకుండా ఉంటారా? ఇప్పటికిది సశేషం చివరాఖరికి ఏం జరుగుతుందో మన పేజీల్లో చూడాల్సిందే! □



చూడచక్కని రంగుల్లో, అందమైన ఆకృతిలో విచ్చుకునే గులాబీ అంటే మనసు పారేసుకోనివారు ఎవరుంటారు చెప్పండి. అందులోనూ అవి గుత్తులు గుత్తులుగా నిరబూస్తుంటే మనసుకెంతో ఆనందం. పైగా ముళ్లు తక్కువగా ఉంటే మరింత సంతోషం. అలాంటివే ఈ బటన్రోజెస్, వీటినే మినియేచర్ గులాబీలని కూడా అంటారు. మరి వీటినెలా పెంచుకోవచ్చో చూద్దామా! చైనా, యూరోపియన్ గులాబీలను సంకరం చేయడం ద్వారా అభివృద్ధి చేసినరకం... బటన్రోజ్. ఈ మినియేచర్ గులాబీకి 1800వ సంవత్సరంలో ప్రాణం పోశారట. తక్కువ కాలంలోనే

## గుత్తులు గుత్తులుగా గులాబీలు

అందంతో ఎక్కువ ఆదరణ పొందింది. దీన్ని ఎక్కడ పెంచినా ఆ ప్రదేశం అందాన్ని రెట్టింపు చేస్తుంది. తక్కువ ప్రదేశంలోనూ ఇవి చక్కగా ఎదుగుతాయి. అందుకే, వీటిని కంటైనర్ గార్డెన్స్, బాల్కనీలు... కాలి బాటల పక్కన ఎక్కడైనా పెంచుకోవచ్చు. దీనికి మెయింటెనెన్స్ తక్కువ. ఈ బటన్ రోజ్లు 12 అడుగుల ఎత్తువరకు పెరుగుతాయి. హ్యాంగింగ్ పాట్స్ ఇవి చక్కని ఎంపిక బటన్‌లోజ్ ఆకులు చిన్నగా, నిగనిగలాడుతూ ముదురాకుపచ్చ రంగులో ఉంటాయి. ఎరుపు, గులాబీ,పసుపు, తెలుపు, నారింజ... వంటి రంగుల్లో ఇవి విచ్చుకుంటాయి. గులాబీ బటన్ మొక్కలు ఆరోగ్యంగా పెరగాలంటే కనీసం 4-6 గంటలు ప్రత్యక్షంగా ప్రసరించేలా చూసుకోవాలి. ఎండ ఎక్కువగా వచ్చే బాల్కనీల్లోనూ పెంచుకోవచ్చు. సారవంతమైన పొడి నేలల్లో వీటిని నాటుకుంటే మేలు. ఆ నేల కోసం ఆ నేలలో కాసిన్ని పటిక నీళ్ల అప్పుడప్పుడూ చల్లుకుంటే సరి. మట్టిలో కాస్త పెర్లైట్ లేదా ఇసుకని, పొటాషియం ఎక్కువగా ఉంటే నెలరోజులకోసారి పూస్తాయి. పూలు పూయడం అయిపోయాక తప్పక ప్రూనింగ్ చేయాలి. వాడిపోయిన పువ్వులనూ ఎప్పటికప్పుడు తీసేయాలి. అప్పుడే పూలతో నిండుగా, ఆరోగ్యంగా ఎదుగుతాయి. □

## సాధనం చిన్నది.. సాయం పెద్దది



ఘాటైన పరిమళాలు వెదజల్లే వెల్లుల్లిని అనేక వంటల్లో ఉపయోగిస్తాం. వీటిని వంటకు అనుకూలంగా మెదిపేందుకు వీలుగా ఉండే పరికరం మాన్యువల్ గార్లిక్ గ్రైండర్ అతి తక్కువ బరువుతో, ఆకర్షణీయంగా కనిపించే ఈ సాధనానికి కరెంట్‌తో పనిలేదు. దీంతో వెల్లుల్లి మాత్రమే కాదు పండ్లు, అల్లం, ఉల్లి, టొమాటోలు-ఇలా అన్నిటికీ ఉపయోగించ వచ్చు. ఈ చిన్న సాధనం వంటలో ఎంతో సాయం చేస్తుంది. సిలికాన్ బేస్ వల్ల స్థిరంగా ఉంటుంది. ఎక్కువకాలం మన్నుతుంది.

## హనుమ పూజ

రామాలయం లేని గ్రామం దాదాపు కనిపించదు. అలాగే హనుమంతుడు లేని రామాలయమూ కనిపించదు. ఎక్కడ రామ నామం వినిపిస్తుందో అక్కడ హనుమంతుడు ఉంటాడనీ, హనుమంతు డిని ప్రసన్నం చేసుకోవాలనుకునే వారు ముందుగా రామచంద్రుడి భక్తులై వుండాలని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. తనని పూజిస్తే మురిసిపోయే హనుమంతుడు .. రామచంద్రుడిని కీర్తిస్తే పరవశించి పోతాడు. అందుకే రాముడితో కలిపి హనుమంతుడిని సేవించడం విశేషమైన ఫలితాన్ని ఇస్తుందని అంటారు. హనుమంతుడికి మంగళవారం .. శనివారం అంటే ఎంతో ఇష్టం. అందువలన ఆ రోజుల్లో ఆయనకి ప్రదక్షి ణలు చేయాలి. సిందూర అభిషేకం .. ఆకుపూజ చేయించాలి. వడలు .. తీపి అప్పాలు నైవేద్యంగా సమర్పించాలి. 'హనుమజ్జయంతి' రోజున ఇలా చేయడం మరింత విశేషమైనదనేది మహర్షుల మాట. ఈ రోజున 'సుందరకాండ' పారాయణం .. 'హనుమాన్ చాలీసా' చదువుకోవడం ..నామ సంకీర్తనం చేయడం వలన, హనుమంతుడు ప్రీతి చెందుతాడు. ఆయురారోగ్యాలు .. సిరి సంపదలను అనుగ్రహిస్తాడు.

## రాగి పన్ కేక్

పిండి– ఒక కప్పు, మైదా: అర కప్పు, కరిగించిన వెన్న: పావు కప్పు, బేకింగ్ పౌడర్: ఒక టీస్పూన్, బేకింగ్ సోడా: చిటికెడు, గుడ్లు: రెండు, చక్కెర: అర కప్పు, పాలు: అర కప్పు, ఉప్పు: చిటికెడు, వెనిలా ఎసెన్స్: నాలుగు చుక్కలు, తేనె: రెండు టేబుల్ స్పూన్లు.

తయారీ : ఒక గిన్నెలో రాగిపిండి, చక్కెర, మైదా, బేకింగ్ పౌడర్, బేకింగ్ సోడా, గుడ్లు, పాలు, ఉప్పు, ఎసెన్స్ వేసి బాగా కలపాలి. కరిగించిన వెన్న కూడా జోడించి మరోసారి కలిపి పది నిమిషాలు పక్కన పెట్టాలి. స్టవ్‌మీద పాన్ పెట్టి కొద్దిగా వెన్నవేసి వేడయ్యాక పిండి మిశ్రమం వేసి సన్నని మంటపై రెండువైపులా కాల్చుకోవాలి. వాటి పైనుంచి తేనె వేసుకుంటే వేడివేడి రాగి పాన్ కేక్స్ సిద్ధం. □



# తెర



## 'ఎస్ఆర్ కళ్యాణమండపం' నర్తకి పాత్రలో పూజిత పొన్నాడ

'ఎస్ఆర్ కళ్యాణమండపం' చిత్రంతో అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరించి దర్శకుడిగా ప్రతిభ చాటుకున్న డైరెక్టర్ శ్రీధర్ గాదె మరో కొత్త చిత్రాన్ని రూపొందిస్తున్నారు. శ్రీ ఐశ్వర్య లక్ష్మి మూవీస్ బ్యానర్ పై ఆది సాయి కుమార్ తో చుట్టాలబ్బాయ్ వంటి ఫ్యామిలీ మూవీ, ఆనంద్ దేవరకొండతో 'హైవే' వంటి యూనిక్ థ్రిల్లర్ మూవీని నిర్మించిన ప్రొడ్యూసర్ వెంకట్ తలారి తమ ప్రొడక్షన్ నెం.3గా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో 'కమిటీ కుర్రోళ్లు' మూవీ ఫేమ్ ఈశ్వర్ రాచి రాజు హీరోగా నటిస్తుండగా, నందు, లిఖిత హీరోయిన్స్ గా నటిస్తున్నారు. ఈ చిత్రంలో నర్తకి క్యారెక్టర్ లో టాలెంటెడ్ యాక్ట్రెస్ పూజిత పొన్నాడ నటిస్తున్నారు. ఈ రోజు పూజిత పొన్నాడ బర్త్ డే సందర్భంగా ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ నర్తకి క్యారెక్టర్ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. రాజభవనంలో నర్తకిమణిగా ముస్తాబైన పూజిత పొన్నాడ లుక్ ఆకట్టుకుంటోంది. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో సాగే హారర్ చిత్రమిది. ఈ సినిమాను సరికొత్త కథా కథనాలతో ప్రేక్షకులను ఆకట్టుకునేలా దర్శకుడు శ్రీధర్ గాదె తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర వివరాలను మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు. నటీనటులు ఈశ్వర్ రాచి రాజు, నందు, లిఖిత, పూజిత పొన్నాడ, సింధు కాసారం, సురేష్ గురు, రాయల్ శ్రీ, మట్టా శివకుమార్, విహా దీకొండ, సునీత మనోహర్, అమ్మ రామచంద్రయ్య, తదితరులు.

## కాస్త ఆలస్యంగా 'ఆదర్శ కుటుంబం' సూర్యదేవర నాగవంశీ



విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో రూపొందుతోన్న చిత్రం ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47 AK47. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. అయితే, అక్టోబర్ 9, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో అడుగు పెట్టాల్సిన ఆదర్శ కుటుంబం చిత్రం, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు ఆలస్యం కావడంతో వాయిదా పడింది. ఈ విషయాన్ని నిర్మాత సూర్యదేవర నాగవంశీ ప్రెస్ మీట్ నిర్వహించి అధికారికంగా ప్రకటించారు. సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ.. "మూడు నాలుగు రోజుల క్రితం కూడా అక్టోబర్ 9నే సినిమా విడుదలవుతుందని మేమందరం ఎంతో నమ్మకంగా ఉన్నాం. అందుకే ఓవర్సీస్ లో బుకింగ్స్ కూడా ఓపెన్ చేయించాము. కానీ, నిన్న ఉదయానికి కూడా ఓవర్సీస్ సెన్సార్ కి కంటెంట్ ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నాము. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ పరంగా మూడు నాలుగు రోజులు వెనకబడిపోయాము. ఈ పరిస్థితుల్లో కంగారుగా సినిమాను విడుదల చేసేకంటే.. ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకొని, క్వాలిటీ అవుట్ పుట్ తో మీ ముందుకు రావాలనే ఉద్దేశంతోనే ఈ వాయిదా నిర్ణయం తీసుకున్నాము. పైగా, ప్రమోషనల్ కార్యక్రమాలకు కూడా సమయం లేకుండా పోయింది. రెండు మూడు వారాల తర్వాత సరైన తేదీ చూసుకొని, వెంకటేష్ గారితో చర్చించి, కొత్త విడుదల తేదీని ప్రకటిస్తాము. మిగతా పాటలను, ట్రైలర్ ను విడుదల చేసి రాబోయే రెండు మూడు వారాల పాటు ప్రమోషనల్ కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించి.. వీలైనంత త్వరగా మీ ముందుకు వస్తాము. ఆదర్శ కుటుంబం కాస్త ఆలస్యంగా వచ్చినా..వెంకటేష్ గారి అభిమానులంతా నూటికి నూరు శాతం సంతృప్తి చెందేలా సినిమా ఉంటుంది." అన్నారు.ఇప్పటికే విడుదలైన ఆదర్శ కుటుంబం AK47 టీజర్‌కు మంచి స్పందన లభించింది. వెంకటేష్ మధ్యతరగతి కుటుంబానికి చెందిన వ్యక్తిగా కనిపించడంతో పాటు.. ఫ్యామిలీ ఎమోషన్స్, కామెడీ, యాక్షన్‌తో టీజర్ ఆసక్తిని పెంచింది.

## చాక్లెట్ స్టార్ పవన్ హీరోగా 'పోతిరెడ్డిపల్లి' మూవీ ప్రారంభం



చాక్లెట్ స్టార్ పవన్ హీరోగా, మోనిక, సిరి హీరోయిన్లు నటిస్తున్న నూతన హారర్ థ్రిల్లర్ చిత్రం పోతిరెడ్డిపలి హైదరాబాద్ లోని రామానాయుడు స్టూడియోస్‌లో ఘనంగా ప్రారంభమైంది. ఆరాధ్య క్రియేషన్స్ బ్యానర్‌పై జేరమ్ విష్ణు నిర్మిస్తున్న ఈ చిత్రానికి అశోక్ రోయ్య దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్ర పూజా కార్యక్రమానికి అతిథులుగా మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య, సీనియర్ నటుడు బాబు మోహన్ ముఖ్య అతిథులుగా హాజరై చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు సినీ ప్రముఖులు, చిత్ర యూనిట్ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.చిత్రం తొలి షాట్‌కు సీనియర్ నటుడు బాబు మోహన్ హీరో, హీరోయిన్లపై క్లాప్ కొట్టగా, ప్రముఖ గర్శకుడు, కొరియో గ్రాఫర్ అమ్మ రాజశేఖర్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. తెలుగు మూవీ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీఎన్ ఆదిత్య తొలి షాట్‌కు దర్శకత్వం వహించారు. దర్శకుడు వి. సముద్ర, ఓయూ శంకర్ గుండేటి ఈ వేడుకలో పాల్గొని చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా హీరో చాక్లెట్ స్టార్ పవన్ మాట్లాడుతూ, కథకు అనుగుణంగా ఆసక్తికరమైన హారర్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతోందని తెలిపారు. దర్శకుడు అశోక్ రోయ్య మాట్లాడుతూ, ఇది నా రెండో సినిమా. ఈ చిత్రాన్ని మరింత వైవిధ్యంగా తెరకెక్కించేందుకు ప్రయత్నిస్తున్నాను. దర్శకుడు అమ్మ రాజశేఖర్, హీరోయిన్ తదితరులు చిత్ర విశేషాలను వెల్లడిస్తూ చిత్రబృందానికి శుభా కాంక్షలు తెలిపారు. త్రివిక్రమ్ శ్రీనివాస్ రచన, దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో వెంకటేష్‌తో పాటు శ్రీనిధి శెట్టి, నారా రోహిత్, నివేదా పేతురాజ్, రావు రమేష్, సత్య, బ్రహ్మాజీ, వెన్నెల కిషోర్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## అమరత్వం పొందిన 'సింగీతం'



1950 నుంచి 1970 సం॥ వరకూ సామాన్యుడికి తక్కువ ఖర్చుతో లభించిన వినోదం "సినిమా వల్లనే? మూకీల తర్వాత టాకీల తరంలో 'సినిమా' కొత్త పుంతలు తొక్కింది. రైతుల జీవితాలు 'రైతు బిడ్డ' లాంటి సినిమాలు ప్రతిబిం బిస్తే 'సంసారం' లోని కష్టాలు, 'బ్రతుకు తెరువు' కోసం ఎన్ని కష్టాలు పడాల్నో మిస్సమ్మ లాంటి చిత్రాలు చూపిస్తే, పెళ్ళి చేసి చూడు వినోదభరితంగా హాస్యాన్ని పండిస్తే, హారర్ సినిమా అనిపించే రీతిలో పాతాళభైరవి లాంటి సినిమాలు హోరరు. జనరంజకంగా మలిచి 'జనం కోరేదే సినిమా యివ్వాలి' అనే సందేశంతో ప్రేక్షకులను రంజింప చేస్తాయి! ఊత పదాలు ఆనాటి సినిమాలల్లో పురుడు పోసుకున్నవే! 'మోసం గురూ!' అన్నది యిప్పటికీ నానుడిగా మిగిలిందంటే ఆనాటి సినిమా వల్లనే యీతరంలో యిప్పటికీ సంగీత, సాంప్రదాయ సిద్ధాంతాలను 'మోడ్రన్ ఏజ్'తో సమంగా ప్రతిబింబింప చేసిన 'మల్లీశ్వరి, శంకరాభరణం' లాంటి సినిమాలు కలకాలం నిలిచేవే! ఈనాటి సినిమాలు యిప్పటి తరం వారి అభిరుచులకు అనుగుణంగా కాస్తంత ఎక్కువ మోతాదులోనే ధ్వనితో పాటు, శృంగారం, పోట్లాటలు, అద్భుతంగా, దృశ్య మాలికలతో విరాజిల్లి రాజమౌళి 'బాహు బలి' ప్రపంచ స్థాయికి తెలుగు సినిమాను తీసుకెళ్ళటం ఎవరు కాదన గలరు? అలనాటి నిర్మాత లూ, దర్శకులూ తక్కువ ఖర్చుతో ఎక్కువ వినోదాన్ని పంచారు. ఇప్పటి వారు ఎక్కువ ఖర్చు చేస్తున్నా కొన్ని సినిమాలు మాత్రమే జనరంజకమవు తున్నాయి. అణా టికెట్తో బెంచి మీద కూర్చొని డేరాల్లోనే సినిమాలు చూసినా, ఆ జనం ఆనందానికి అవధులు లేవు! పాత రోత కొత్త వింత అని సినిమాల విషయంలో 'జనరలైజ్' చేయలేం! వినో దం ఏ రీతిలో పంచినా ఎక్కువ మందికి ఆమోదయోగ్యంగా వుంటే, సినిమా సినిమా యే! దానికి సాటి ఏ రకమైన వినోదం సరికాదు! కె.వి. రెడ్డి దర్శకుడి లాంటి పితా మహుల మధ్య పెంచుకున్న అనుభవంతో సినిమా సమ పాళ్ళలో పండించగల నైపుణ్యం అక్టోబర్ 3న కన్నుమూసిన సింగీతం శ్రీనివాస రావుకు ఒక్కడికే సినిమా గంలో యీ తరం వరకూ దక్కింది అని ఆ రంగానికి చెందిన వారు ఎవరై నా అంటే, విభేదించనికి వెనకడుగు వేయక తప్పదు! కారణం టాకీల కాలంలో మూకీ సినిమా లాంటి 'పుష్పక విమానం' సినిమా తీసి సినిమా పండితులతో పాటు సామాన్య ప్రేక్షకులు గూడ'ఔరా' అని చుకునే విధంగా మాటలు లేకుండా నిశ్శబ్దంగా మాటలు నేర్పిన నిపుణుడు సింగీతం ప్రతిభకు ఐతో పాటు గలగల మనే రీతిలో డబ్బులు కూడా కురిపించారు! మాటలు తక్కువగా పాటలతో 'సింగ్ గీతం' (2026) తీసి తన పేరు బసింగీతం' ను సినిమా టైటిల్‌గా అర్థవంతంగా ఆల్ రౌండర్, నిర్మాతల పాలిటి కల్పవృక్షం, ముఖ్యంగా 'కమల్‌హాసన్'ను మరుగుజ్జుగా హిమాలయం అంత ఎత్తుకు ఆ నటుడిని తీసుకొనిపోయిన ఘనత సింగీతం శ్రీనివాస గాకెవరికి దక్కుతుంది? 'ఫార్ ఎ హెడ్ అఫ్ టైమ్స్'గా ఆలోచించే దర్శకుడు కాబట్టే ఆపి, వెనక్కు వెళ్లి 'ఆదిత్య' సినిమాలో 'కృష్ణ దేవరాయలతో పాటు సాహిత్య వైభవాన్ని, రభాన్ని నింపిన ఆ రోజులను కళ్ల ముందు నడయాడేటట్లు చేయగలిగాడు! తంఖ నైపుణ్యా నికి, ప్రతిభకూ, వైవిధ్య భరితమైన ఆలోచనా స్రవంతికి హద్దులు లేవు!. ఇతఎత్తు ను గూడ ప్రేక్షకుడి ముందు నిలిపి సంతోషం కలిగించేలా ఎక్కం తెరకెక్కించగలిగాడు 94 సంవత్సరాల వయసులో కూడ నూతన యవ్వనత్వం పొందిన వాడిలా చిందులేస్తు సినిమా పరిణతికి హద్దులేవని పించిన సింగీతం మనముందు లేకపోయినా కలకాలం నిలిచే విధంగా ఆయన తీసిన సినిమాలు ఆయనను మన ముందు నిత్యమూ వుంచుతూనే వుంటాయి. ఒక కాలాన్ని యుగాన్ని ఆలోచనా విధానాన్ని- అన్ని విధాలా అనితర సాధ్యంగా సినిమా ద్వారా సామాన్య ప్రేక్షకుడికి దర్శించే శక్తిని కలిగించిన సింగీతం శ్రీనివాసరావుకు మరణంలేదు.

– రావులపాటి సీతారాంరావు

## 'చకోర' ప్రీ రిలీజ్ ఈవెంట్



ఈ నెల 9న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తున్నమూవీ High Joy Commercials బ్యానర్ పై డా. చింతాడ హేమారావు నిర్మాతగా, VIP Ð Vintage Iconic Pictures నిర్మాణ సారథ్యంలో మంగా శ్రీనివాస్ రచన దర్శ కత్వంలో రూపొందిన మాస్ పోయెట్రీ మ్యూజికల్ లవ్ స్టోరీ "చకోర – Lunar Love Bird". శ్రవణ్, మలైకా టి. వాసుపల్ ను సరికొత్త ప్రేమ జంటగా పరిచయం చేస్తూ తెరకెక్కిన ఈ ప్రేమ కథ చిత్రం శ్రీ లక్ష్మి పిక్చర్స్ ద్వారా ఈ నెల 9న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. తాజాగా ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ ను స్టార్ డైరెక్టర్ శివ నిర్వాణ అతిథిగా విశాఖలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలోడీవోపీ రుప్ప గోపీకృష్ణ మాట్లాడుతూ ఈ సినిమాను ఒక ఛాలెంజ్ గా తీసుకుని చేశాం. జస్ట్ 45 డేస్ లో మొత్తం షూటింగ్ కంప్లీట్ చేశాం. హీరోయిన్ అనుష్క లూహార్ మాట్లాడుతూ నేను హిందీలో సినిమాలు, వెబ్ సిరీస్ లు చేశాను. టాలీవుడ్ లో నటించాలనేది నా డ్రీమ్. ఈ చిత్రంతో ఆ కల నెరవేరుతున్నందుకు సంతోషంగా ఉంది. హీరోయిన్ మలైకా టి.వాసుపల్ మాట్లాడుతూ నేను కన్నడలో నాలుగు సినిమాల్లో హీరోయిన్ గా నటించాను. సీరియల్స్ కూడా చేశాను. ఈ సినిమాతో తెలుగులో హీరోయిన్ గా అడుగుపెట్టడం సంతోషంగా ఉంది. యాక్టర్ సుమన్ మాట్లాడుతూ ఈ చిత్రంలో నేను హీరో ఫ్రెండ్ క్యారెక్టర్ లో నటించాను. ఈ అవకాశం కల్పించిన మా డైరెక్టర్, ప్రొడ్యూసర్‌కి థ్యాంక్స్."చక మూవీ మా టీమ్ అందరి కల. సినిమా అద్భుతంగా వచ్చింది.

## 'మెట్రోలవర్' టీజర్ లాంచ్



'మెట్రోలవర్' చాలా పాషన్ తో చేసిన సినిమా. ఖచ్చితంగా అందరికీ నచ్చు తుంది: భీమ్స్ సిసిరోలియో నరేన్ వనపర్తి, భీమ్స్ సిసిరోలియో మ్యూజికల్ ఖిమెట్రో లవర్ఖి టీజర్ లాంచ్ నవంబర్ 20న థియేటర్స్ లో రిలీజ్ నరేన్ వనపర్తి, సాహితీ అవంచ ప్రధాన పాత్రల్లో మహేష్ నాంపెల్లి దర్శకత్వంలో రూపొందు తున్న చిత్రం మెట్రో లవర్. KMC ప్రొడక్షన్స్ ఈగిల్ ఐ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ పై మాల్య కందుకూరి, శివకుమార్ రాజంపేట, గడ్డం రవి కుమార్, సంతోష్ జాదవ్ నిర్మిస్తు న్నారు. స్టార్ కంపోజర్ భీమ్స్ సిసిరోలియో ఈ సినిమాకి మ్యూజిక్ అందిస్తున్నారు. నవంబర్ 20న ఈ సినిమా రిలీజ్ కానుంది. డైరెక్టర్ త్రినాథరావు నక్కిన మాట్లాడుతూ.. నరేన్, మాల్య నాకు ధమాకా సినిమా నుంచి పరిచయం. వారి మెట్రో లవర్ సినిమాతో రావడం చాలా ఆనందంగా ఉంది. హీరో నరేన్ మాట్లా డుతూ..భీమ్స్‌తో ఇరవై ఏళ్ల స్నేహం. తను మా ఫ్యామిలీ. కిరణ్ అన్న చెప్పిన ఈ కథ నాకు చాలా నచ్చింది. మా నిర్మాతలు ఎంతగానో సహకరించారు. భీమ్స్ పెద్ద సినిమాలకు మ్యూజిక్ ఇస్తున్నారు. అలాంటి ఆయన మా సినిమాకి మ్యూజిక్ ఇవ్వడం, అలాగే కథలో కూడా కొన్ని కీలక సూచనలు ఇవ్వడం మాకు ఎంతగానో ఉపయోగపడింది. ఈ సినిమాలో పని చేసిన అందరికీ థాంక్యూ.

# హాంకాంగ్ సిక్సెస్‌కు భారత్ జట్టు ఖరారు

## కెప్టెన్‌గా భువనేశ్వర్ కుమార్




**న్యూఢిల్లీ:** హాంకాంగ్ సిక్సెస్ 2026, టోర్నీ కోసం భారత జట్టును ప్రకటించారు. ఈ నెల 30నుంచి నవంబర్1 వరకు జరగనున్న ఈ టోర్నీకి భువనేశ్వర్ కుమార్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ జట్టులో కృనాల్ పాండ్యా, నితీశ్ రాణా, శశాంక్ సింగ్, టీ. నటరాజన్, రాహుల్ త్రిపాఠి, రాహుల్ తెవాటియా ఉన్నారు. ఈ భారత జట్టులో ప్రస్తుతం అంతర్జాతీయ క్రికెట్‌లో రెగ్యులర్‌గా కనిపించని పలువురు ఆటగాళ్లకు అవకాశం లభించింది. ఐపీఎల్ 2026 లో మంచి ప్రదర్శన చేసిన ఆటగాళ్లను హాంకాంగ్ సిక్సెస్ కోసం ఎంపిక చేసినట్లు జట్టు కూర్పు స్పష్టం చేస్తోంది. భువనేశ్వర్ కుమార్‌కు ఈ ఏడాది ఐపీఎల్‌లో మంచి సీజన్ దక్కింది. 28 వికెట్లు తీసిన అతడు, ఆ తర్వాత జరిగిన యూపీ టీ20 లీగ్‌లోనూ ఆకట్టుకున్నాడు. కృనాల్ పాండ్యా కూడా ఐపీఎల్‌లో రాణించాడు. అతడిని తిరిగి టీ20 అంతర్జాతీయ జట్టులోకి తీసుకునే అంశంపై కూడా గతంలో చర్చ జరిగింది. నితీశ్ రాణా, శశాంక్ సింగ్ టీ20 లీగ్‌లలో మంచి ప్రదర్శనలు చేస్తున్నారు. నటరాజన్, రాహుల్ త్రిపాఠి, రాహుల్ తెవాటియా చేరికతో జట్టుకు మరింత లోతు వచ్చినట్లు కనిపిస్తోంది. ఈ ఏడాది హాంకాంగ్ సిక్సెస్‌లో వీరంతా అరంగేట్రం చేయనున్నారు. గత ఎడిషన్‌లో భారత జట్టుకు నిరాశ ఎదురైంది. 2025లో రాబిన్ ఉతప్ప, దినేశ్ కార్తీక్ వంటి పేరున్న ఆటగాళ్లతో బరిలోకి దిగిన భారత్ గ్రూప్ దశలోనే నిష్క్రమించింది. కువైట్ చేతిలో పరాజయం కూడా ఎదురైంది. ఆ టోర్నీలో పాకిస్థాన్ విజేతగా నిలిచింది. ఈ నేపథ్యంలో ఈసారి మరింత బలమైన జట్టును ఎంపిక చేశారు.




## నెమ్మదిగా ఓవర్లుతో.. భారత్, వెస్టిండీస్‌పై

# 20, 10% జరిమానా

**దుబాయ్:** ఇటీవల న్యూ చండీగఢ్‌లో జరిగిన సిరీస్‌లోని మూడవ, చివరి వన్డేలో నెమ్మదిగా ఓవర్లు వేసినందుకు భారత్, వెస్టిండీస్ జట్లపై ఆంక్షలు విధించినట్లు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసిసి) సోమవారం తెలిపింది. సమయ కేటాయింపులను పరిగణనలోకి తీసుకున్న తర్వాత, భారత్ అవసరమైన రేటు కంటే నాలుగు ఓవర్లు తక్కువగా వేసినట్లు తేలింది. దీంతో వారికి మ్యాచ్ ఫీజులో 20 శాతం జరిమానా విధించారు. రెండు ఓవర్లు తక్కువగా వేసిన వెస్టిండీస్‌కు 10 శాతం జరిమానా విధించారు. ఆటగాళ్లు, వారి సహాయక సిబ్బంది కోసం ఉద్దేశించిన ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 ప్రకారం, తమ జట్టు నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయడంలో విఫలమైన ప్రతి ఓవర్‌కు, ఆటగాళ్లకు వారి మ్యాచ్ ఫీజులో ఐదు శాతం జరిమానా విధించినట్లు స్పష్టం చేసింది. భారత్, వెస్టిండీస్ కెప్టెన్లు ఇద్దరూ తమ పొరపాట్లను అంగీకరించి, ప్రతిపాదిత జరిమానాకు అంగీకరించారు. దీంతో అధికారిక విచారణలు అవసరం కాలేదని స్పష్టం చేసింది.

ఐసీసీ అంతర్జాతీయ మ్యాచ్ రిఫరీల ప్యానెల్‌కు చెందిన ప్రకాష్ భట్ ఈ పెనాల్టీలను విధించారు. ఆన్‌ఫీల్డ్ అంపైర్లు జయరామన్ మదనగోపాల్, సామ్ నోగాజ్స్కి, థర్డ్ అంపైర్ షర్ఫుద్దౌలా ఇబ్నే షాహిద్, ఫోర్త్ అంపైర్ వీరేందర్ శర్మలు ఈ ఆరోపణలను చేశారు.

# టీమిండియా బిజీ బిజీ




### నేటి నుండి వెస్టిండీస్‌తో 5 టి20ల సిరీస్ స్టార్ట్

### 27 రోజుల్లో రెండు దేశాల్లో 10 మ్యాచ్‌లు

**న్యూఢిల్లీ:** ఇక టీమిండియా బిజీ కానుంది. నిరంతరాయంగా మ్యాచ్‌లు ఖరారయ్యాయి. కేవలం 27 రోజుల్లో రెండు దేశాల్లో 10 మ్యాచ్‌లు ఆడనుంది. భారత జట్టు వరుసగా రెండు టీ20 సిరీస్‌లు ఆడనుంది. ముందుగా స్వదేశంలో వెస్టిండీస్‌తో ఐదు టీ20లు, ఆ తర్వాత న్యూజిలాండ్ పర్యటనలో మరో ఐదు టీ20లు ఉన్నాయి. ఈ నెల 6 నుంచి నవంబర్ 1 వరకు కేవలం 27 రోజుల్లో భారత జట్టు మొత్తం 10 టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌ను 2-1తో గెలిచిన టీమిండియా ఇప్పుడు టీ20 ఫార్మాట్‌పై ఫోకస్ పెట్టింది. వెస్టిండీస్‌తో ఐదు టీ20ల సిరీస్ ఈ నెల 6న లక్నోలో ప్రారంభమవుతుంది. ఈ సిరీస్‌కు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. తొలి మ్యాచ్ తర్వాత 9న రాంచీలో రెండో టీ20, 11న ఇండోర్‌లో మూడో టీ20, 14న హైదరాబాద్‌లో నాలుగో టీ20, ఈ నెల 17న బెంగళూరులో చివరి టీ20 జరుగుతుంది. మరోవైపు వెస్టిండీస్ వన్డే సిరీస్‌లో చివరి మ్యాచ్ గెలిచిన ఉత్సాహంతో టీ20ల్లో పోటీ ఇవ్వాలని చూస్తుంది. టీ20 జట్టులో యువ ఆటగాళ్లకు అవకాశాలు దక్కే అవకాశం ఉండటంతో ఈ సిరీస్‌పై ఆసక్తి మరింత పెరిగింది. ఈ స్క్వాడ్‌లో శ్రేయస్ అయ్యర్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, సంజూ శాంసన్, తిలక్ వర్మ, శివమ్ దూబే, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, నితీశ్ కుమార్, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, వైభవ్ సూర్యవంశీ, మయాంక్ యాదవ్ తదితరులు ఉన్నారు. వెస్టిండీస్ సిరీస్ తదుపరి భారత జట్టుకు ఈ నెల 22 నుంచే న్యూజిలాండ్ గడ్డపై ఐదు టీ20ల సిరీస్ ప్రారంభమవుతుంది. న్యూజిలాండ్ పర్యటనతో భారత జట్టుకు మరో కీలక సవాలు ఎదురుకానుంది. క్రైస్ట్‌చర్చ్‌లో తొలి రెండు మ్యాచ్‌లు పూర్తయ్యాక మూడో టీ20 కోసం వెల్లింగ్టన్ వెళ్లాలి. ఆ తర్వాత ఆక్లాండ్, హామిల్టన్‌లో చివరి రెండు మ్యాచ్‌లు జరుగుతాయి. న్యూజిలాండ్ పరిస్థితుల్లో పేస్ బౌలింగ్, బౌన్స్, స్వింగ్‌ను ఎదుర్కోవడం భారత బ్యాటర్లకు పరీక్షగా మారొచ్చు.

అదే సమయంలో భారత పేసర్లు కూడా అక్కడి పరిస్థితులను సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా వెస్టిండీస్ సిరీస్ ముగిసిన వెంటనే న్యూజిలాండ్‌కు వెళ్లాల్సి రావడంతో వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ కీలకంగా మారుతుంది. యువ ఆటగాళ్లకు ఎక్కువ అవకాశాలు ఇవ్వడం, సీనియర్ ఆటగాళ్లకు అవసరమైన విశ్రాంతి ఇవ్వడం టీమ్ మేనేజ్‌మెంట్ ముందున్న ప్రధాన అంశాలుగా కనిపిస్తున్నాయి. రాబోయే టీ20 మ్యాచ్‌లు భారత జట్టు బెంచ్ బలాన్ని పరీక్షించేందుకు కూడా ఉపయోగపడనున్నాయి.



## చైనా ఓపెన్‌లో సెమీఫైనల్స్‌కు జోకోవిచ్

**బీజింగ్:** చైనా ఓపెన్ 2026లో జోకోవిచ్ తన ప్రత్యర్థి జ్వెరెవ్‌ను ఓడించాడు. ఆరుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన నోవాక్ జొకోవిచ్, తనదైన శైలిలో మరోసారి అద్భుతంగా టాప్ సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్‌ను 4-6, 6-4, 6-4 తేడాతో ఓడించి చైనా ఓపెన్ సెమీఫైనల్స్‌కు చేరుకున్నాడు. జర్మన్ ఆటగాడు మరింత బలంగా ప్రారంభించి జొకోవిచ్‌ను ఇబ్బంది పెట్టి, తద్వారా మొదటి సెట్‌ను 6-4తో గెలుచుకున్నాడు. రెండో సెట్ చివరిలో నిర్ణయాత్మక పాయింట్ చోటుచేసుకుంది. స్కోరు 4-4తో సమంగా ఉన్నప్పుడు, జొకోవిచ్ తన ఆటను మెరుగుపరుచుకుని, 10వ గేమ్‌లో జ్వెరెవ్ సర్వ్‌ను బ్రేక్ చేసి, ఆ తర్వాత సర్వ్ చేసి సెట్ గెలిచి మ్యాచ్‌ను సమం చేశాడు. ఫైనల్ సెట్‌లో ఇద్దరూ హోరాహోరీగా తలపడ్డారు, ఇద్దరిలో ఎవరూ స్పష్టమైన ఆధిక్యాన్ని సాధించలేకపోయారు. అయినప్పటికీ, మునుపటిలాగే, అత్యంత కీలకమైన సమయంలో జొకోవిచ్ తన అత్యుత్తమ టెన్నిస్‌ను ప్రదర్శించాడు. స్కోరు 4-4 వద్ద ఉండగా, సెర్బియా ఆటగాడు జ్వెరెవ్ సర్వ్‌ను బ్రేక్ చేసి, తద్వారా నిర్ణయాత్మక బ్రేక్‌ను సాధించాడు. ఆ తర్వాత అతను మ్యాచ్‌ను ముగించేందుకు సర్వ్ చేసి, 4-6, 6-4, 6-4 తేడాతో విజయాన్ని ఖాయం చేసుకున్నాడు.

# స్వియాటెక్ విజయం

**బీజింగ్‌బి:** ఆరుసార్లు గ్రాండ్ స్లామ్ ఛాంపియన్ అయిన ఇగా స్వియాటెక్, సోమవారం ఇక్కడ జరిగిన చైనా ఓపెన్ రౌండ్ ఆఫ్ 32లో ఒక సెట్ మరియు రెండు బ్రేక్‌లతో వెనుకబడినప్పటికీ అద్భుతంగా పుంజుకుని 30వ సీడ్ డోనా వెకిచ్‌ను ఓడించింది. స్వియాటెక్ మొదటి సెట్‌ను 4-6తో కోల్పోయి, రెండవ సెట్‌లో 2-5తో వెనుకబడి ఓటమి అంచున నిలిచింది. అయితే, ఈ పోలిష్ క్రీడాకారిణి అద్భుతమైన పునరాగమనం చేసి మ్యాచ్‌ను 4-6, 7-6 (0), 6-2 తేడాతో గెలిచి, రౌండ్ ఆఫ్ 16లోకి దూసుకెళ్లింది. మ్యాచ్‌లోని మూడవ గేమ్‌లోనే స్వియాటెక్ తన సర్వ్‌ను కోల్పోయి, వెకిచ్ సర్వ్‌ను బ్రేక్ చేయలేకపోయింది. ఎనిమిదో సీడ్ పోలిష్ క్రీడాకారిణి చివరికి మొదటి సెట్‌ను 4-6 తేడాతో కోల్పోయింది. రెండవ సెట్‌లో రెండుసార్లు తన సర్వ్‌ను కోల్పోయి 2-5తో వెనుకబడటంతో, తిరిగి పుంజుకోవాలన్న ఆమె ఆశలు మరింత దెబ్బతిన్నాయి. అయితే,




ఆమె తన అత్యుత్తమ ఆటను కనబరిచి, క్రొయేషియా క్రీడాకారిణి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసి స్కోరును 5-5తో సమం చేసింది. ఇద్దరు క్రీడాకారిణులు తమ సర్వ్‌లను నిలబెట్టుకోవడంతో రెండో సెట్ టైబ్రేక్‌కు దారితీసింది. స్వియాటెక్ ఒక్క పాయింట్ కూడా కోల్పోకుండా ఆధిపత్యం చెలాయించి ఆ సెట్‌ను కైవసం చేసుకుంది. ఇద్దరూ మూడవ సెట్‌ను చెరొక సర్వ్ బ్రేక్‌తో ప్రారంభించారు. కానీ 3-2 వద్ద పోలాండ్ క్రీడాకారిణి ఒక బ్రేక్ సాధించింది. ఆమె తన సర్వ్‌లను నిలబెట్టుకుని, వెకిచ్ సర్వ్‌ను బ్రేక్ చేసి, మూడవ సెట్‌ను 6-2తో కైవసం చేసుకుంది. తద్వారా 2 గంటల 40 నిమిషాలలో ఒక అద్భుతమైన పునరాగమన విజయాన్ని పూర్తి చేసింది.

# నష్టాలకు చెక్..లాభాల్లో సెన్సెక్స్,నిఫ్టీ




**ముంబయి, అక్టోబరు 5:** వరుస నాలుగు సెషన్ల నష్టాలను చవిచూసిన దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టడం, అమెరికా ఉద్యోగాల డేటా అంచనాల కంటే బలహీనంగా ఉండటం, అన్ని రంగాల్లో కొనుగోళ్లు పెరగడం వంటి అంశాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను పెంచాయి. ఎఫ్‌ఎంసీజీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ షేర్లు రాణించగా హెల్త్‌కేర్, ఫార్మా రంగాల షేర్లు నష్టపోయాయి. ఇదే సమయంలో రిజర్వుబ్యాంకు ద్రవ్య విధాన కమిటీ సమావేశంపై ఇన్వెస్టర్లు దృష్టి సారించారు. సోమవారం ప్రారంభమైన ఈ సమావేశంతో పాటు అంతర్జాతీయ బాండ్ ఈల్డ్స్‌ను కూడా మార్కెట్లు నిశితంగా పరిశీలిస్తున్నాయి. ఎస్అండ్‌పీ బీఎస్ఈ సెన్సెక్స్ 472.77 పాయింట్లు లాభపడి 72,382.47 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సూచీ 133.80 పాయింట్లు పెరిగి 22,555.75 వద్ద స్థిరపడింది. అంతకుముందు వరుసగా నాలుగు సెషన్లలో సెన్సెక్స్ 2.69 శాతం, నిఫ్టీ 3.11 శాతం చొప్పున క్షీణించాయి. నిఫ్టీ లాభాల్లో ఐటీసీ, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ కీలక పాత్ర పోషించాయి. ఐటీసీ షేరు 5.08 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 1.63 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.60 శాతం చొప్పున పెరిగాయి. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.38 శాతం లాభపడగా, బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.31 శాతం పెరిగింది. ఎన్ఎస్ఈలో 1,745 షేర్లు లాభాల్లో ముగియగా, 1,844 షేర్లు నష్టాల్లో ముగిశాయి. మరో 117 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. కమోడిటీ మార్కెట్లో డిసెంబర్ 2026 డెలివరీ బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ ధర 51 సెంట్లు లేదా 0.50 శాతం పెరిగి బ్యారెల్‌కు 102.76 డాలర్లకు చేరింది. భారతదేశ 10 ఏళ్ల బెంచ్‌మార్క్ ప్రభుత్వ బాండ్ రాబడులు 0.31 శాతం పెరిగి 7.231కి చేరింది. గత సెషన్ ముగింపులో ఇది 7.209గా ఉంది. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి స్వల్పంగా బలహీనపడింది. డాలర్‌తో పోలిస్తే పాక్షికంగా కన్వర్టబుల్ రూపాయి 96.3000 వద్ద కొనసాగింది. గత సెషన్‌లో ఇది 96.2500 వద్ద ముగిసింది. ఎంసీఎక్స్‌లో డిసెంబర్ 4, 2026 డెలివరీ బంగారం ఫ్యూచర్స్ 0.36 శాతం తగ్గి 10 గ్రాములకు రూ.1,49,850కి చేరాయి. అమెరికా 10 ఏళ్ల బాండ్ ఈల్డ్ 0.15 శాతం పెరిగి 5.288కి చేరింది.

# ప్రయాణీకులపై ఇండిగో ఛార్జీల బాదుడు




**ముంబయి, అక్టోబరు 5:** దేశీయ విమానయాన రంగంలో అగ్రగామి సంస్థ అయిన ఇండిగో, ప్రయాణికులపై అదనపు భారాన్ని మోపనుంది. విమాన ఇంధనం (ఏటీఎఫ్) ధరలు భారీగా పెరగడంతో ఫ్యూయల్ సర్‌చార్జ్‌ను పెంచుతున్నట్లు సోమవారం ప్రకటించింది. ఈ నూతన ఛార్జీలు అక్టోబర్ 6వ తేదీ నుంచి చేసే అన్ని కొత్త బుకింగ్‌లకు వర్తిస్తాయని సంస్థ స్పష్టం చేసింది. గత కొన్ని నెలలుగా ఏటీఎఫ్ ధరలు నిరంతరాయంగా పెరుగుతున్నాయని, గత నెలతో పోలిస్తే తాజాగా 14 శాతానికి పైగా ధర పెరిగిందని ఇండిగో ఒక ప్రకటనలో తెలిపింది. గడిచిన దశాబ్ద కాలంలో ఇదే అత్యధికమని పేర్కొంది. విమానయాన సంస్థల నిర్వహణ వ్యయంలో ఇంధన ఖర్చులే కీలకమని, ఈ పెరుగుదల తమ సంస్థతో పాటు మొత్తం ఏవియేషన్ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించింది. నూతన ఛార్జీల ప్రకారం దేశీయ మార్గాల్లో 500 కిలోమీటర్ల వరకు ప్రయాణించే వారిపై రూ. 375లు, 501 నుంచి 1,000 కిలోమీటర్ల వరకు రూ. 600 వసూలు చేయనున్నారు. అదేవిధంగా, 1,0011,500 కి.మీ. ప్రయాణానికి రూ. 900లు,1,501 2,000 కి.మీ. దూరానికి రూ. 1,150లు, 2,000 కిలోమీటర్లు దాటిన ప్రయాణాలకు రూ. 1,300 చొప్పున ఫ్యూయల్ సర్‌చార్జ్ వర్తిస్తుంది. అంతర్జాతీయంగా సార్క్ దేశాలకు రూ. 1,000 నుంచి రూ. 3,000 వరకు, సౌత్ ఈస్ట్ ఆసియా, గల్ఫ్, మిడిల్ ఈస్ట్ దేశాలకు రూ. 5,500, ఆఫ్రికా, యూరప్ దేశాలకు రూ. 6,000 ఫ్యూయల్ ఛార్జ్‌ను నిర్ణయించారు. వాస్తవానికి పెరిగిన ఇంధన వ్యయాన్ని భర్తీ చేయడానికి ఇంకా అధిక మొత్తంలో ఛార్జీలు పెంచాల్సి ఉన్నప్పటికీ, ప్రయాణికులపై భారాన్ని తగ్గించే ఉద్దేశంతోనే పరిమితంగా సర్దుబాటు చేసినట్లు ఇండిగో వెల్లడించింది.

# ఇన్వెస్టర్లలో అవగాహనకు సెబీ ప్రాజెక్టు జాగరూక్..

### చండీగఢ్‌లో ప్రారంభించిన సెబీ చైర్మన్ తుహిన్‌కాంత పాండే



**చండీగఢ్, అక్టోబరు 5:** పెట్టుబడిదారుల్లో ఆర్థిక అవగాహన పెంచేందుకు భారత సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు సెబీ దేశవ్యాప్తంగా కొత్త అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించింది. సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే సోమవారం ప్రాజెక్ట్ జాగ్రూక్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ప్రచారం మార్చి 2027 వరకు కొనసాగనుంది. గ్రామీణ ప్రాంతాలు, విద్యా సంస్థల్లో ఆర్థిక అక్షరాస్యతను పెంచడంతో పాటు పెట్టుబడిదారులకు మోసాలపై అవగాహన కల్పించనున్నారు. ముఖ్యంగా అనామక పెట్టుబడి టిప్స్, ఫిన్‌ఫ్లుయెన్సర్లు, అధిక రాబడులపై వ్యాపార ప్రకటనలపరంగా జాగ్రత్తగా ఉండాలని సెబీ సూచించింది. ప్రాజెక్ట్ జాగ్రూక్‌లో సెబీతో పాటు స్టాక్ ఎక్స్ఛేంజీలు, డిపాజిటరీలు, అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్‌లు భాగస్వామ్యం కానున్నాయి. పలు భాషల్లో పెట్టుబడిదారుల అవగాహన సందేశాలను ప్రచారం చేయనున్నారు. సెబీ చీఫ్ పాండే మాట్లాడుతూ పెట్టుబడిదారులు నియంత్రిత పెట్టుబడి ఉత్పత్తులు, అధికారిక మార్గాలు, నియంత్రణలో ఉన్న సంస్థలనే ఆశ్రయించాలని సూచించారు. తమకు పూర్తిగా అర్థమయ్యే పెట్టుబడి ఉత్పత్తుల్లోనే డబ్బు పెట్టాలని, పెట్టుబడులను విభిన్నంగా విస్తరించాలని చెప్పారు. స్థిరమైన రాబడి ఉందంటే అది రిస్క్ లేని పెట్టుబడి అని భావించవద్దని హెచ్చరించారు. ఎవరైనా చెప్పారని పెట్టుబడి పెట్టొద్దు. అందరూ పెట్టుబడి పెడుతున్నారని మీరు కూడా పెట్టొద్దు. మీరు అర్థం చేసుకున్నందుకే పెట్టుబడి పెట్టాలన్నారు. పెట్టుబడిదారుల విద్యకు ఒక సాధారణ మార్గదర్శకాన్ని అందించేందుకు నేషనల్ సెక్యూరిటీస్ మార్కెట్ అవేర్‌నెస్ కరిక్యులమ్ను కూడా సెబీ ప్రవేశపెట్టనుంది. దీనికి అనుబంధంగా ఉచిత సెబీ ఇన్వెస్టర్ అవేర్‌నెస్ టెస్ట్ను అందుబాటులోకి తీసుకురానుంది. వివిధ వర్గాల అవసరాలకు అనుగుణంగా ఈ పాఠ్యాంశాన్ని మార్చుకునే అవకాశం ఉంటుంది. సెక్యూరిటీస్ మార్కెట్లో పెట్టుబడుల భాగస్వామ్యం పెరుగుతున్నప్పటికీ, పెట్టుబడిదారుల ఆర్థిక అవగాహన విషయంలో ఇంకా అంతరం ఉందని సెబీ ఇన్వెస్టర్ సర్వే 2025 వెల్లడించింది. ఈ సర్వే ప్రకారం కేవలం 36 శాతం మంది పెట్టుబడిదారులకు మాత్రమే సెక్యూరిటీస్ మార్కెట్‌పై అధిక లేదా మోస్తరు స్థాయి అవగాహన ఉంది.

# ఎఫ్‌డిలపై వడ్డీరేట్లు మరింతపెరిగే ఛాన్స్




**ముంబయి, అక్టోబరు 5:** దేశంలో ద్రవ్యోల్బణం క్రమంగా పెరుగుతుండడంతో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసే వారికి రాబోయే రోజుల్లో అధిక వడ్డీ రేట్లు లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ద్రవ్యోల్బణం ఒత్తిళ్ల కారణంగా భారతీయ రిజర్వ్ బ్యాంక్ తన తాజా ద్రవ్య పరపతి విధాన కమిటీ సమీక్షా సమావేశంలో రెపో రేటును పెంచవచ్చని ఆర్థిక రంగ నిపుణులు అంచనా వేస్తున్నారు. దీనికి తోడు ప్రభుత్వ బాండ్ల రాబడులు, చిన్న పొదుపు పథకాల ఆకర్షణీయమైన వడ్డీ రేట్లు బ్యాంకులపై డిపాజిట్ రేట్లు పెంచేలా ఒత్తిడి తేవచ్చు. దీంతో ఫిక్స్‌డ్ డిపాజిట్ల వడ్డీ రేట్లను పెంచాల్సి రావచ్చని తెలుస్తోంది.కొన్ని నెలలుగా రిటైల్ ద్రవ్యోల్బణం క్రమంగా పెరుగుతోంది. ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ గరిష్ఠ పరిమితి 6 శాతానికి చేరువవుతున్న తరుణంలో దానిని అదుపు చేసేందుకు రెపో రేటును 25 బేసిస్ పాయింట్ల వరకు పెంచవచ్చని నిపుణులు భావిస్తున్నారు. రెపోరేటు పెరిగితే బ్యాంకులు ఎఫ్‌డీవడ్డీ రేట్లను పెంచడానికి మార్గం సుగమమవు తుంది. ప్రస్తుతం 1 సంవత్సరం బ్యాంక్ టర్మ్ డిపాజిట్ రేట్లు 6 శాతం నుంచి 6.75 శాతం పరిధిలో ఉంటే, ప్రభుత్వ బాండ్ల రాబడులు అంతకంటే ఎక్కువగా ఉన్నాయి. 3 ఏళ్ల బాండ్లు 6.79 శాతం, 5 ఏళ్ల బాండ్లు 6.93 శాతం, 10 ఏళ్ల బాండ్లు 7.20శాతం రాబడులు ఇచ్చాయి. అదే సమయంలో సీనియర్ సిటిజన్ సేవింగ్స్‌స్కీమ్, సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాలు 8.20 శాతం వరకు వడ్డీని అందిస్తున్నాయి. ఈపోటీని తట్టుకుని నిధులు సమీ కరించాలంటే బ్యాంకులు ఎఫ్‌డీరేట్లను సవరించాల్సి రావ చ్చు.మార్కెట్లో రుణాలకు డిమాండ్‌ఎక్కువగా ఉండి, బ్యాం కింగ్ వ్యవస్థలో డిపాజిట్ల ప్రవాహంతగ్గినప్పుడు, కొత్త డిపా జిట్లను ఆకర్షించేందుకు బ్యాంకులు వడ్డీ రేట్లను పెంచు తాయి.

# కోటక్ మహీంద్రా బ్యాంక్ డిపాజిట్లలో 23.2శాతం వృద్ధి




**ముంబయి, అక్టోబరు 5:** కోటక్ మహీంద్రా బ్యాంక్ మొత్తం డిపాజిట్లు జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.6.51 లక్షల కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన రూ.5.29 లక్షల కోట్లతో పోలిస్తే డిపాజిట్లు 23.2 శాతం పెరిగాయి.సోమవారం బ్యాంక్ వెల్లడించిన డేటా ప్రకారంగత త్రైమాసికంలో బ్యాంక్ మొత్తం డిపాజిట్లు రూ.5.73 లక్షల కోట్లుగా ఉన్నాయి. దీంతో ప్రస్తుత త్రైమాసికంలో వరుసగా 13.7 శాతం వృద్ధి నమోదైంది. జూలై-సెప్టెంబర్ త్రైమా సికంలో బ్యాంక్ నికర అడ్వాన్సులు ఏడాది ప్రాతిపదికన 24.7శాతం పెరిగి రూ.5.77 లక్షల కోట్లకు చేరాయి. అం తకుముందు త్రైమాసికంలో నమోదైన రూ.5.12 లక్షల కోట్లతో పోలిస్తే వరుసగా 12.7శాతం వృద్ధి సాధించింది. బ్యాంక్ కరెంట్ అకౌంట్-సేవింగ్స్ అకౌంట్ డిపాజిట్లు కూడా పెరిగాయి. గత ఏడాది ఇదే కాలంలోని రూ.2.24 లక్షల కోట్లతో పోలిస్తే ఈసారి 11.3 శాతం పెరిగి రూ.2.49 లక్షల కోట్లకు చేరాయి. తొలిత్రైమాసికంలో కాసా డిపాజిట్లు రూ.2.31 లక్షల కోట్లుగా ఉండగా, త్రైమాసిక ప్రాతిపదికన 7.8 శాతం వృద్ధి నమోదైంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్వాప్ విండో ద్వారా సెప్టెంబర్ 30నాటికి కోటక్ మహీంద్రా బ్యాంక్ 5.78 బిలియన్ల విలువైఎఫ్‌సి ఎన్నార్‌బి డిపాజిట్లను సమీకరించింది. స్థూల నిరర్థకఆస్తులు మొత్తం అడ్వాన్సుల్లో 1.18 శాతానికి తగ్గాయి. అంతకుముందు త్రైమాసికంలో ఇవి 1.20 శాతంగా ఉన్నాయి. నికర ఎన్పీలు అంతకుముందు త్రైమాసికంలోని 0.25శాతం నుంచి 0.27 శాతానికి పెరిగింది. ప్రొవిజన్లు వరుసగా పెరిగి రూ.668 కోట్లకు చేరాయి. అంతకు ముందు త్రైమాసికంలో ఇవి రూ.516 కోట్లుగా ఉన్నాయి. అయితే ఏడాది ప్రాతిపదికన చూస్తే ప్రొవిజన్లు రూ.1,208 కోట్ల నుంచి గణనీయంగా తగ్గాయి. కోటక్ బ్యాంక్ షేర్ ధర సోమవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి 0.56 శాతం తగ్గి రూ.416 వద్ద ముగిసింది.

# 10గ్రాముల బంగారం రూ.1,49,180

### కిలో వెండి రూ.2.45 లక్షలు

**ముంబయి, అక్టోబరు 5:** దేశంలోని బులియన్ వ్యాపారం అత్యధికంగాజ రిగే నగరాల్లో బంగారం ధరలు కొంతమేర దిగివచ్చినట్లు తెలుస్తోంది. ముంబయి నగరంలో పదిగ్రాముల 24 కేరట్లు బంగారం 1,49,180, 22 కరట్లు 1,36,750గాను, 18 కేరట్లు 1,12,350గాను కొనసాగాయి. కాగా ఢిల్లీలో 1,49,330గా ఉంది. అదే ఈఈ కేరట్లు 1,36,900, రూ.1,12,040గాను ధరలు కొనసాగడం గమనార్హం. చెన్నై నగరంలో పదిగ్రాముల 24 కేరట్లు బంగారం 1,49,180గాను,22 కేరట్లు రూ. 1,36,750గాను, 18 కేరట్లు రూ.1,12,350గాను కొనసాగాయి. బెంగళూరులో పదిగ్రాములు బంగారం రూ.1,49,180, 22 కేరట్లు 1,36,750, 18 కేరట్లు 1,11,80గా ఉన్నాయి. ఇక తెలుగురాష్ట్రాల్లోధరలు కూడా ఇంచుమించు ఒకేవిధంగా ఉన్నాయి. 24 కేరట్ల బంగారొ పదిగ్రాములు రూ.1,49,180, 22కేరట్లు రూ. 1,36,750, 18 కేరట్లు రూ.1,11,890గా కొనసాగడం గమనార్హం. అదేవిధంగా వెండిధరలు చెన్నైలో కిలో



ఒక్కింటికి రూ.2.45 లక్షలు, ముంబయిలో రూ.2.35 లక్షలు, ఢిల్లీలో రూ.2.35 లక్షలు కోల్‌కత్తాలో రూ.2.35 లక్షలు, బెంగళూరులో కూడా రూ.2.35 లక్షలుగానే కొనసాగింది. ఎంసిఎక్స్‌లో పదిగ్రాముల బంగారం ధరలు రూ.0.7శాతం తగ్గినట్లు సమాచారం. పదిగ్రాముల బంగారం రూ.1.51 లక్షలుగా కొనసాగింది. అయితే ఈ ధరలు ఇతర పన్నులుఅన్నింటితో కలిపి ఉంటాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.